www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 104 | శనివారం | 03-10-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026



'సర్' ప్రక్రియ నిలిపివేయాలంటూ కోదండరామ్ మౌనదీక్ష

జర్నలిస్టుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు

ఐజెయు పిలుపుతో గన్‌పార్క్ వద్ద జర్నలిస్టుల భారీ నిరసన 03


## 'ఓట్ చోరీ'పై ప్రజాగ్రహం

## జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత

- ఆందోళనకు అనుమతి నిరాకరించిన పోలీసులు
- నిర్బంధాలను ఛేదించుకుని నిరసన స్థలికి చేరుకున్న ప్రతిపక్ష, యువత, విద్యార్థి సంఘాల నాయకులు
- అడ్డుకున్న పోలీసులు, ఇరువర్గాల మధ్య తోపులాట, లాఠీచార్జి
- సిపిఐ, సిపిఐ(ఎం), ఆప్, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎ, ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యుఐ, ఐవైసి, డివైఎఫ్‌ఐ నేతల అరెస్టు








కోల్‌కతాలో వామపక్షాల భారీ నిరసన ప్రదర్శన 07


**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (ఇసిసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు, విద్యార్థి సంఘాలు గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు చేపట్టారు. 'సేవ్ డెమోక్రసీ' పేరుతో చేపట్టిన కార్యక్రమానికి ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. నిరసనల నేపథ్యంలో పోలీసులు జంతర్ మంతర్‌ను మూసివేశారు. భద్రతను కట్టుదిట్టం చేశారు. సమీపంలోని 11 మెట్రో స్టేషన్లను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిరసనలకు అనుమతి ఇవ్వనప్పటికీ ప్రతిపక్ష నాయకులు, యూత్, విద్యార్థి సంఘాల నేతలు పోలీసుల నిర్బంధాలు ఛేదించుకుని విడతలు విడతలుగా జంతర్ మంతర్ చేరుకున్నారు. 700 మందికిపైగా నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో జంతర్‌మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. వారిని అడ్డుకునేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. ఈ నేపథ్యంలో నిరసన ప్రదేశం రణరంగంగా మారింది. 'ఏక్ కచోరీ, దో సమోసా, జ్ఞానేశ్ తుమ్హారా క్యా భరోసా', 'మోదీ–జ్ఞానేశ్ ఓట్లు దొంగలు' వంటి నినాదాలు ఢిల్లీలోని ప్రతిగల్లీలో వినిపించాయి. ఓటర్ల జాబితాల తరువాయి 8లో



### సిపిఐ ఎంపి సందోష్ కుమార్‌ను ఈడ్చుకెళ్ళిన పోలీసులు

- ఎఐఎస్‌ఎఫ్ నేతలు దినేశ్ సి.రంగరాజ్, విరాజ్ దెవాంగ్‌సహా పలువురి అరెస్టు
- జంతర్‌మంతర్ వద్దకు పెద్ద ఎత్తున తరలిన సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలు వందలాది మంది పాల్గొన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి, ఎంపి పి.సందోశ్‌కుమార్ నిరసనలో పాల్గొంటుండగా పోలీసులు, బలగాలు ఆయనపై దురుసుగా ప్రవర్తించారు. మీడియాతో మాట్లాడుతుండగా ఆయనను లాగడంతో కిందపడ్డారు. ఎంపి అని చూడకుండా బలవంతంగా ఈడ్చుకెళ్ళారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ కార్యకర్తలు ఆయనను పోలీసులు లాక్కెళ్ళకుండా గట్టిగా పట్టుకున్నారు. అనంతరం పోలీసులు వారందరినీ అదుపులో తీసుకున్నారు. పోలీసులు అదుపులో తీసుకున్న వారిలో సిపిఐ ఢిల్లీ కార్యదర్శి ప్రొఫెసర్ దినేష్ వర్ష్నే, ఎఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, ప్రధాన కార్యదర్శి దినేష్ సీరంగరాజ్‌తో పాటు వందలాది మంది సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలను ఉన్నారు.

## సెంట్రలైజ్డ్ కిచెన్‌లు డిసెంబర్ 9న షురూ

**విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి**

- నవంబర్ 30 నాటికి కిచెన్‌ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలి
- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయడానికి వచ్చే డిసెంబర్ 9 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి సెంట్రలైజ్డ్ కిచెన్‌లను ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. నవంబర్ 30వ తేదీలోగా ఈ కిచెన్ల ఏర్పాట్లు పూర్తయ్యేలా చూడాలని సిఎం చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయడానికి సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నాయి. హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ప్రతినిధులు ముఖ్యమంత్రిని హైదరాబాద్ జూబ్లీహిల్స్ నివాసంలో శుక్రవారం కలిశారు. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు ఈ రెండు సంస్థలు హరేకృష్ణ ఫౌండేషన్ కు సహకారం అందిస్తాయి. నాగర్‌కర్నూల్ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ సిఎండి శేఖర్ రెడ్డి, సిఈఓ అనిల్ బాబుతో కలిసి రూ.5.17 కోట్ల చెక్కును సిఎం రేవంత్ రెడ్డి హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థ ప్రతినిధి డి.సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. కార్యక్రమంలో తరువాయి 12లో


సెంట్రలైజ్డ్ కిచెన్ రద్దు చేయకుంటే సిఎం ఇంటి ముట్టడి

మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ హెచ్చరిక



03


## ప్రజాస్వామ్య పరిరక్షణే గాంధీకి నిజమైన నివాళి

**దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న బిజెపి : సిపిఐ మండిపాటు**

**రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మతసామరస్య దినోత్సవం**

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణే మహాత్మాగాంధీకి ఇచ్చే నిజమైన నివాళి అని సిపిఐ పేర్కొంది. దేశ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్న బిజెపి పాలనను ప్రజలు ప్రతిఘటించాలని, దేశ సమగ్రతను, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని పిలుపునిచ్చింది. సిపిఐ జాతీయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మతసామరస్య దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా, మండల కేంద్రాల్లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి సిపిఐ తరువాయి 12లో



మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన సిపిఐ నాయకులు

## జ్ఞానేష్ బ్రో రాజీనామా చెయ్

**ముంబయి శివాజీ పార్క్ కేంద్రంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు**

- తరలివచ్చిన వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సంఘాల ప్రతినిధులు
- సిఇసి తప్పుకోకపోతే 'జంతర్ మంతర్ 2.0' తరహా ఉద్యమం తప్పదు
- సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హెచ్చరిక

**ముంబయి :** దేశ ఆర్థిక రాజధాని ముంబయి శుక్రవారం ఆందోళనలతో అట్టుడికింది. శివాజీ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిర్వహించిన నిరసనకు వేలాది మంది యువకులు, విద్యార్థులు, పౌర సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. ఈ నిరసనలో నేపథ్యంలో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పాటు చేశారు. కాగా, సర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నాయని, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని సిజెపి డిమాండ్ చేసింది. ఈ ఆందోళనలో గాంధీ కుటుంబానికి చెందిన తుషార్ గాంధీ, ప్రముఖ బాలీవుడ్ నటులు షబానా అజ్మీ, నసీరుద్దీన్ షా, సంగీత దర్శకుడు తరువాయి 8లో






## ఆర్‌టిసి, మెట్రో రైల్‌కు ఒకే పాస్

- ఇరు రవాణా వ్యవస్థల్లో ఉపయోగపడేలా రోజు, నెలవారీ పాసుల సౌకర్యం
- కామన్ పాస్ ఆవిష్కరణలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ.52 వేల కోట్ల మౌలిక వసతి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని.. ప్రజా పాలనలో హైదరాబాద్ నగర అభివృద్ధికి రూ.52 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రోడ్లు, ఫ్లయిఓవర్లు, బ్రిడ్జిలు, తరువాయి 12లో

## ఆటో మీటర్ చార్జీల పెంపు



- మినిమం ఛార్జ్ రూ.30.. ఆ తర్వాత కిలోమీటరుకు రూ.14
- రాత్రి 11 నుంచి ఉదయం 5 గంటల వరకు 1.5 రెట్లు చార్జీ
- నిమిషానికి 75 పైసలు వెయిటింగ్ చార్జీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో ఆటోరిక్షా ప్రయాణికులకు కొత్త చార్జీలు అమల్లోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం 12 ఏళ్ల తర్వాత ఆటో మీటర్ చార్జీలను సవరిస్తూ శుక్రవారం జిఓ నం.46 జారీ చేసింది. కొత్త రేట్ల ప్రకారం తొలి 1.60 కిలోమీటర్లకు కనీస చార్జీ రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రతి కిలో మీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయాలి. ఆటో ప్రయాణం ప్రారంభమైన వెంటనే డిజిటల్ మీటర్‌లో కనీస చార్జీ రూ.30 ఉ. తొలి 1.60 కిలోమీటర్లు పూర్తయిన తర్వాత ప్రతి 100 మీటర్లకు రూ.1.40 చొప్పున చార్జీ పెరుగుతుంది. అంటే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున మీటర్ కొనసాగుతుంది. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఆటో ప్రయాణానికి సాధారణ చార్జీకి 1.5 రెట్లు (అదనంగా 50 శాతం) తరువాయి 8లో

## 44 ఏళ్ల 'నిరీక్షణకు' తెర!




**ఆసియా గేమ్స్‌లో అదరగొట్టిన భారత మహిళల హాకీ టీమ్**

**చైనాతో జరిగిన ఫైనల్‌లో 1-0 తేడాతో విజయం**

**2028 ఒలంపిక్స్‌కు అర్హత**

**నగోయ :** ఆసియా గేమ్స్‌లో భారత మహిళల హాకీ టీమ్ అదరగొట్టింది. అద్వితీయమైన ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించి 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో సత్తా చాటిన భారత్ 1–0 తేడాతో విజయం సాధించింది. భారత్ తరఫున లాల్‌రెమ్సియామి ఏకైక గోల్ తరువాయి 8లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
03-10-2026
www.prajapaksham.in



# ఉత్తరప్రదేశ్ ఎన్నికల క్షేత్రంలో అనిశ్చితులు

భారతదేశ రాజకీయ చిత్రపటంలో భౌగోళికంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికున్న స్థానం దేశ పాలనాధికారానికి ఎంతో కీలకమైనది. ఢిల్లీ అధికారం చేజిక్కించుకోవాలంటే అది ఉత్తరప్రదేశ్ గుండానే సాధ్యం అన్నారు మాజీ ప్రధాని కీ.శే.అతల్ బిహారీ వాజ్‌పేయి. వైశాల్యం, జనాభా రీత్యా దేశంలోకెల్లా అతిపెద్దదైన ఉత్తరప్రదేశ్, లోక్‌సభలో 80 స్థానాలు కలిగి ఉంది. ప్రస్తుత లోక్‌సభలో (543 సీట్లు) అవి 15 శాతం. మోదీ ప్రభుత్వ ప్రయత్నం ఫలించి లోక్‌సభ సీట్లు 50 శాతం పెరిగితే అది నాలుగైదు హిందీ భాషా రాష్ట్రాలను కలుపుకుని కేంద్రంలో అధికారాన్ని గుప్పిటపట్టగలుగు తుంది. దేశంలో ఎన్నో రాష్ట్రాలు స్థానిక ప్రజాకాంక్ష ప్రకారం చీలి కొత్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి గాని, ఉత్తరప్రదేశ్‌ను నాలుగు రాష్ట్రాలుగా విభజించటానికి బిఎస్‌పి అధినేత మాయావతి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన ప్రయత్నం నెరవేరలేదు. 5 లోక్‌సభ సీట్లు కలిగిన ఉత్తరాఖండ్‌ను మాత్రం వేరుచేసి చిన్న ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. ఉత్తరప్రదేశ్ దేశానికి గుండెకాయ వంటిదనే బలమైన భావనే దాని ఐక్యతను పరిరక్షిస్తున్నది. అయితే రాజకీయం ఏకశిలా సదృశం కాదు. దీర్ఘకాలం కాంగ్రెస్ పాలన అనంతరం మండల్ రాజకీయం, దళిత రాజకీయం పైచేయి సాధించాయి. హిందుత్వ, అయోధ్య రామమందిరం ఆందోళనలతో భారతీయ జనతాపార్టీ ఆధిక్యంలోకి వచ్చింది. గత 10 సంవత్సరాలుగా యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రిగా బిజెపి ప్రభుత్వం ఏలుబడి సాగిస్తోంది. బిఎస్‌పి బలహీనపడగా, సమాజ్‌వాదిపార్టీ అఖిలేశ్ యాదవ్ సారథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా బిజెపితో తలపడుతోంది. కాంగ్రెస్ దాని మిత్రపక్షంగా కొనసాగుతోంది. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో రెండు పార్టీలూ భాగస్వాములుగా ఉండగా, రాష్ట్రంలో వాటిమధ్య ఐక్యతలోనే వైరుధ్యాలు కూడా ఉన్నాయి. రాహుల్‌గాంధి, అఖిలేశ్ యాదవ్ మంచి మిత్రులుగా కనిపిస్తున్నప్పటికీ రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ స్థానాన్ని పరిమితిలో ఉంచటమే సమాజ్‌వాది పార్టీ ధ్యేయం.

వచ్చే సంవత్సరం ప్రథమార్థంలో జరిగే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని గద్దెదించటం రెండు పార్టీల లక్ష్యం. కాని సీట్ల సర్దుబాటు తకరారు నడుస్తోంది. 403 అసెంబ్లీ సీట్లలో 100కు తక్కువ గాకుండా పోటీ చేయా లన్నది కాంగ్రెస్ ఆకాంక్ష. అందుకు ప్రాతిపదిక లేదన్నది సమాజ్‌వాది వాదన. బిహార్‌లో 2021 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎక్కువ సీట్లకు పోటీచేసి తక్కువ సీట్లు గెలుచుకున్న కారణంగా అధికారాన్ని అందుకోలేకపోయా మన్న ఆర్‌జెడి వాదన ఉండనే ఉంది. హిందీ బెల్టులో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ఒబిసిలకు సామాజిక న్యాయం ఎజండాగా గల మండల్ పార్టీలు అధికారం కోల్పోయినా ప్రధాన ప్రతిపక్ష జాగాను ఆక్రమించి ఉన్నాయి. అవి కాంగ్రెస్‌కు తగిన స్థానం ఇవ్వటం లేదు. కాంగ్రెస్ స్థానం కూడా క్షేత్రస్థాయిలో సన్నగిల్లింది. జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి నాయకులు తప్ప పార్టీ జెండా మోసే క్యాడర్ పలచబడింది – పార్టీ వ్యవస్థాగత నిర్మాణం నామమాత్రం.

ఉత్తరప్రదేశ్‌నే తీసుకుంటే, అఖిలేశ్ యాదవ్ తమ యాదవ – ముస్లిం ఐక్యత మద్దతును విస్తరించారు. పిడిఎను (పిచడా–బిసిలు, దళితులు, అల్పసంఖ్యాక (మైనారిటీలు) బలమైన సామాజిక కూటమిగా అభివృద్ధి చేశారు. అంతేగాక రాష్ట్రంలో ఎన్నికల పోటీలు సాంప్రదాయక చతుర్ముఖ పోటీగా లేవు – బిజెపి – ఎస్‌పి మధ్య ముఖాముఖి పోటీగా మారాయి. ఒకనాడు బలమైన శక్తిగా ఉన్న బహుజన్ సమాజ్ పార్టీ ఓటు బ్యాంక్ చీలికలు పీలికలైంది. ఈ పరిస్థితికి మాయావతియే కారణం. పార్టీలో రెండవ స్థానం విషయంలో ఆమె గందరగోళంలో ఉన్నారు. మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను కనీసం రెండు సార్లు ఆ స్థానంలో నియమించింది. అతను ఆ స్థానంలో నిలదొక్కుకుని బిజెపికి వ్యతిరేకంగా పార్టీని సన్నద్ధం చేయటానికి ప్రయత్నించినపుడల్లా అతన్ని తొలగించింది. ఈ మధ్యనే పార్టీ జాతీయ కో ఆర్డినేటర్‌గా రెండో మేనల్లుడు ఇషాన్ ఆనంద్‌ను నియమించారు. ఇటువంటి చర్యలు క్యాడర్‌ను గందరగోళ పరుస్తున్నాయి. సాంప్రదాయక బిఎస్‌పి ఓటర్లకు బిజెపి, సమాజ్‌వాది పార్టీ, పశ్చిమ యుపి దళిత నాయకుడు చంద్రశేఖర్ రావణ్ ఏర్పాటు చేసిన ఆజాద్ పార్టీ ఎరవేస్తున్నా ఆమె నిస్సహాయతలో ఉన్నారు. బిఎస్‌పికి లోక్‌సభలో సభ్యుడు లేరు, అసెంబ్లీలో ఒక్కరే ప్రతినిధి–అతను కూడా అనారోగ్యంతో మరణించారు. మాయావతి తమ పార్టీ ఉనికికోసం పోరాడుతోంది.

ఈ పరిస్థితుల్లో ద్విముఖ పోటీ ఖరారవుతోంది. ఈ ఎన్నికల్లో ఎస్‌పికి కాంగ్రెస్ కన్నా, కాంగ్రెస్‌కు ఎస్‌పి తోడ్పాటు అవసరం. రెండు పార్టీల ఐక్యత బిజెపికి గట్టి పోటీ ఇచ్చేందుకు, ఓటరు మహాశయుడు కరుణిస్తే ఆ పార్టీని గద్దె దించేందుకు అత్యంత అవసరం. అందువల్ల రెండు పార్టీలు పట్టువిడుపులతో వ్యవహరించటం, ఐక్య పోరాట శక్తిగా ప్రజల ముందుకు వెళ్లటం అవసరం. రాహుల్ – అఖిలేశ్ యాదవ్ జోడీకి ఆకర్షణ, విశ్వసనీయత ఉంది. దాన్ని ఓట్లలోకి మలుచుకోవటానికి ఉభయ పార్టీలు తమ కార్యకర్తలను ఇప్పటినుంచే కర్తవ్యోన్ముఖులను చేయగలిగితేనే ఆశిస్తున్న ఫలితం లభించే అవకాశం మెరుగవుతుంది. ●



## పాత ఓటర్లు ఫారం 6 నింపడం నేరం

**ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓటరు తన పేరు తిరిగి జాబితాలో చేర్చాలని ఫారం 6ను నింపకూడదు. ఎందుకంటే అది కేవలం కొత్త ఓటర్ల కోసం మాత్రమే ఉపయోగించేది. దీనిని బలవంతంగా నింపిన వారందరూ ఒక సంవత్సరం జైలు శిక్ష పడే నేరానికి పాల్పడినట్లే. వారిని బలవంతం చేసిన ఇసి అధికారులు నేరానికి సహకరించినవారు అవుతారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన పత్రికా ప్రకటన తొలగించబడిన పాత ఓటర్లను ఫారం 6 భర్తీ కోసం ఇసి బలవంతం చేస్తున్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.**

– ఎస్.వై.ఖురేషీ, మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్



# ప్లాస్టిక్ వద్దు.. స్టీల్ ముద్దు: ప్రతీ పౌరుడి బాధ్యత

ఒక పెళ్లి ముగిసింది. వందల పళ్లాలు, గ్లాసులు చెత్తకుప్పలో చేరాయి. విందు కొన్ని గంటల్లో ముగిసినా, ఆ ప్లాస్టిక్ వ్యర్థం మాత్రం ప్రకృతిపై దీర్ఘకాల భారంగా మిగులుతుంది. సౌకర్యం కోసం ఎంచుకున్న 'వాడి పారేయడం' సంస్కృతి ఇప్పుడు చెత్త సమస్యగా మన ముందుంది. దీనికి పరిష్కారం కేవలం నిషేధం కాదు; పారేయకుండా తిరిగి ఉపయోగించే అలవాటుకు వ్యవస్థను జోడించడం.

ఇక్కడే గ్రామపంచాయతీల్లో ఎన్నికైన యువ సర్పంచ్‌ల నాయకత్వం కీలకమవుతుంది. ప్రతి పంచాయతీ తన జనాభాకు అనుగుణంగా స్టీల్ పళ్లాలు, గ్లాసులు కొనుగోలు చేసి, వాటిని పంచాయతీ ఆస్తిగా నమోదు చేయాలి. 300 కుటుంబాలున్న గ్రామానికి అవసరమైనన్ని, వెయ్యి కుటుంబాలున్న గ్రామానికి తగినన్ని సమకూర్చాలి. పెళ్లిళ్లు, అన్నదానాలు, జాతరలు, పాఠశాల కార్యక్రమాలు, గ్రామసభలు, ఇతర సామూహిక వేడుకలకు వాటిని అందుబాటులో ఉంచాలి. ఒక గ్రామం ప్రారంభించిన విధానాన్ని పక్క గ్రామాలు అనుసరించేలా చేయాలి. ఒక సర్పంచ్ నిర్ణయం మరో గ్రామానికి ఆదర్శంగా నిలవాలి. ఇది కొత్త ఆలోచన కాదు. తెలంగాణలో ఇప్పటికే దీనికి విజయవంతమైన నమూనాలు ఉన్నాయి. సిద్దిపేటలో గ్రామపంచాయతీల స్థాయిలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసి, ఒకసారి వాడే ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం చూపించారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో పాత్రల నిర్వహణ కూడా చేపట్టారు. తూప్రాన్‌లో 1,500 స్టీల్ పళ్లాలు, 2,000 గ్లాసులతో ఏర్పాటైన స్టీల్ బ్యాంకు వందలాది కార్యక్రమాల్లో దాదాపు లక్ష ప్లాస్టిక్ పళ్లాలు, గ్లాసుల వినియోగాన్ని నివారించినట్లు నమోదైంది. ఖమ్మంలోనూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఇలాంటి ప్రయత్నాలు జరిగాయి. అంటే ఆలోచనకు ఆధారం ఉంది; ఇప్పుడు కావాల్సింది విస్తరణ.

ప్రభుత్వమే అన్నీ సమకూర్చాలని ఎదురుచూడాల్సిన అవసరం లేదు. పంచాయతీ కొనుగోలు పునాది అయితే, ప్రజల భాగస్వామ్యం దానికి బలం. నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలకు అవకాశం కల్పించడం మరో ముఖ్యమైన అడుగు. పాత్రలు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం, శుభ్రపరచడం, లెక్క లు నిర్వహించడం వంటి బాధ్యతలను వారికి అప్పగిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాలూ ఏర్పడతాయి. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన కొన్ని ఒకసారి వాడే ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం అమల్లో ఉంది. అయితే చట్టం ఒక వైపు, ప్రజల అలవాటు మరో వైపు. అలవాటు మారాలంటే ప్రత్యామ్నాయం అందుబాటులో ఉండాలి. అందుకే ప్రతి గ్రామపంచాయతీ తన వార్షిక ప్రణాళికలో స్టీల్ బ్యాంకును పర్యావరణ చర్యగా మాత్రమే కాకుండా గ్రామ ఆస్తి నిర్మాణ కార్యక్రమంగా చేర్చాలి. చివరికి ఇది పళ్లెం గురించి కాదు; రేపటి తరానికి మనం వదిలే జీవన విధానం గురించి.

**ప్లాస్టిక్ వద్దు.. స్టీల్ ముద్దు... ఇది గోడపై రాసే నినాదం కాదు..**
**ఇంటి నుంచి పంచాయతీ వరకు ఆచరించాల్సిన బాధ్యత.**
**ఒక పళ్లెం కొనండి.. ఒక గ్లాసు ఇవ్వండి... ఒక గ్రామాన్ని మార్చండి.**
**ఒక గ్రామం మారితే.. మరో గ్రామానికి దారి కనిపిస్తుంది.**

శ్రీశైలం దూడం, 9133947176

# రాష్ట్రంలో ముంచుకొస్తున్న వర్షాభావ పరిస్థితులు

దేశంలోని ఒక ప్రాంతంలో వరదలు ప్రజలను ముంచెత్తుతుంటే మరో ప్రాంతంలో రైతులు వర్షం కోసం ఆకాశము వైపు చూస్తున్నారు. ఈ ఏడాది కూడా ఆసోమ్, గుజరాత్, యూపీ, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ మొదలగు ప్రాంతాలలో భారీ వర్షాలు వరదలు నమోదు అవుతుండగా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత దేశంలో మొత్తంమీద ఆగ్నేయ రుతుపవనాల వర్షపాతం 12శాతం లోటు నమోదైంది. అదేకాదు సమస్య, గతంలో విస్తారంగా సమానంగా కురిసే వర్షం ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో కొద్దిగంటల్లోనే భారీగా కురుస్తుండగా ఇతర ప్రాంతాలు వర్షాభావ ప్రాంతంగా ఉంటున్నాయి.

వాతావరణములో వస్తున్న మార్పులే ప్రధాన కారణమే అయినప్పటికీ, అది ఒకటే కాదు పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల గాలిలోతేమ నిల్వ సామర్థ్యం పెరిగింది. దీంతో అనుకూల పరిస్థితులు ఏర్పడితే తక్కువ సమయంలోనే భారీ వర్షాలు కురుస్తున్నాయి. అదే సమయములో గాలులదిశ, వాతావరణ వ్యవస్థలు, పట్టణీకరణ, భూవినియోగ మార్పులు స్థానిక వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇవన్నీ కలిపి ప్రాంతాల మధ్య వర్షపాతం తీవ్రతలో తేడాలు పెరుగుతున్నాయని వాతావరణ నిపుణులు తెలుపుతున్నారు.



**తెలంగాణలో నేటికీ లోటు వర్షపాతమే!**

భారీ వర్షాలు కురవాల్సిన ఆగస్టులో అంతంతమాత్రంగానే వర్షాలు పడటంతో తెలంగాణలో సగానికి పైగా జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదయింది. 17 జిల్లాల్లో మైనస్ 29 నుంచి 60 శాతం లోటు వర్షపాతం నమోదయింది. కేవలం 16 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఏ ఒక్క జిల్లాలోనూ అత్యధిక వర్షపాతం నమోదు కాలేదు. ఖరీఫ్ సీజన్ ముగింపు సెప్టెంబర్ నెలలో గత నాలుగైదు రోజులలో కురిసిన వర్షాలతో ఉత్తర తెలంగాణలో కొంతవరకు వరి పంటలకు కొంత ఊతమిచ్చే అవకాశం ఏర్పడింది. దక్షిణ తెలంగాణ జిల్లాలో తీవ్ర నిరాశే ఎదురైంది. రాష్ట్రంలో సగటు సాధారణ వర్షపాతం 74.06 సెం.మీ ఉండగా, ప్రస్తుతం నమోదయింది 61.53 సెం. మీ. మాత్రమే. సాధారణ వర్షపాతం కంటే 12.53 సెం.మీ. తక్కువ వర్షపాతం నమోదయింది. ఈ సీజన్లో కురిసే వర్షపాతం లో 17% తక్కువ వానలు కురిశాయి.

రాష్ట్రంలో మంచిర్యాల, పెద్దపెల్లి, రాజన్న సిరిసిల్ల,కామారెడ్డి, మెదక్ జిల్లాలోమాత్రమే సాధారణ వర్షాలు నమోదయినవి. మిగిలిన అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదయిం ది. రాష్ట్ర ప్రణాళిక శాఖ 16 జిల్లాల్లో మాత్రమే లోటు వర్షపాతం ఉన్నట్లు, మిగిలిన 17 జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనట్లు ప్రకటించింది. మండలాల వారిగా వర్షపాతం పరిశీలిస్తే 41 మండలాల్లో అధికం, 270 మండలాల్లో సాధారణం, 308 మండలాల్లో లోటు నమోదైనట్లు వివరించింది.

ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావం రాష్ట్రంలో తీవ్రంగా ఉంటుందని ఆరు మాసాల ముందే వాతావరణ శాఖ హెచ్చరించింది. దానికి తగినట్టుగా రైతులను చైతన్యంచేస్తూ ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని.. త్రాగునీటి ఎద్దడి నివారణకు ఇప్పటినుండే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాలకు వాతావరణ నిపుణులు చెబుతూ వచ్చారు. ఆగస్టు నెలలో నమోదైన వర్షపాతం కేవలం 133 మిల్లీమీటర్లు మాత్రమే. అంటే ఈ ఒక్క నెలలోనే 36% లోటు వర్షపాతం నమోదయింది. కాగా గత ఏడాది ఇదే నెలలో భారీ వర్షాలు కురిశాయి. అంటే ఏకంగా 377 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డు అయింది. ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర సగటు వర్షపాతం 565 మిల్లి మీటర్లు కాగా ఇప్పటివరకు అది కేవలం 472 మిల్లీమీటర్లకే పరిమితమైంది.

**ముగిసిన 'నైరుతి'వర్షాలు!**

నైరుతి రుతుపవన వర్షాలు ముగిశాయి. రాష్ట్రానికి ప్రధాన ఆయువుపట్టుగా ఉండే రుతుపవన వర్షాలు ఈ ఏడాది నిరాశే మిగిల్చాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా తక్కువ వర్షపాతం నమోదవుతుందని వాతావరణ నిపుణులు ముందే హెచ్చరించిన సంగతి తెలిసిందే.

ఎల్‌నినో ప్రభావం దక్షిణ తెలంగాణ జిల్లాలైన నల్లగొండ, మహబూబ్నగర్, రంగారెడ్డి జిల్లాలలో వ్యవసాయంపై తీవ్రంగా పడుతోంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పంటలు కీలక దశలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సుదీర్ఘ పొడి వాతావరణం నెలకొనడం పంటలపై ప్రభావం చూపింది. నల్లగొండ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 11.23 లక్షల ఎకరాలు కాగా, ప్రస్తుత వానకాలం సీజన్లో దాదాపు 9.92 లక్షల ఎకరాల్లో పంటలు సాగులోనికి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రత్తి సుమారు 5.5 లక్షల ఎకరాల్లో సాగుకు గాను వర్షాలు సకాలంలో కురవకపోవడంతో సుమారు నాలుగు లక్షల ఎకరాల్లోనే సాగవుతోంది. ప్రారంభంలో వర్షాలు పడటంతో రైతాంగం ఉత్సాహంగా పంటలు వేసుకొన్నారు. కొంతమేర ఆశాజనకంగా కనిపించినా.. ఆ తర్వాత వర్షాలు రాకపోవ డం సమస్యగా మారింది. చెరువులు, కుంటలకు తగినంత వరద నీరు చేరకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. ప్రస్తుత సీజన్లో వర్షాలు పడకపోవడం.. పొడి విరామము ఏర్పడటం వల్ల పంటలకు అవసరమైన సమయంలో తేమఅందక దిగుబడి పూర్తిగా తగ్గిపోయి పెట్టుబడులు రాని పరిస్థితులు ఉన్నాయని రైతాంగం ఆందోళనలో ఉన్నారు.

**ప్రధాన ప్రాజెక్టులు వెలవెల..**

ఎల్‌నిలో ప్రభావంతో రిజర్వాయర్లు వెలబలబోతున్నాయి. ఎగువ మహారాష్ట్ర, కర్ణాటకలోనూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కృష్ణా, గోదావరి నదులకు పెద్దగా వరదలు రాలేదు. శ్రీశైలంలోనూ నీటి నిల్వ వేగంగా పడిపోతున్నది. ప్రస్తుతం ప్రాజెక్టులో 93 టీఎంసీల నిల్వ ఉండగా.. డెడ్ స్టోరేజ్ కు ఎగువ ఇంకా కేవలం 40 టిఎంసి నీళ్లు ఉన్నాయి. ఏపీ మాత్రం నీటిని తోడడం ఆపడం లేదు. ఇటు నాగార్జునసాగర్ లోనూ డెడ్ స్టోరేజ్‌కు ఎగువన 40 టిఎంసిల చొప్పున మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎండాకాలం వరకు త్రాగునీటి కోసం నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులోకి ఈ ఏడాది సరైన వరదన్నదే రాలేదు. ప్రస్తుతము ఆ ప్రాజెక్టులో 80 టీఎంసీలకు గాను 47 టీఎంసీల నీళ్ళే ఉన్నాయి. అంటే వాడుకోవడానికి ఇంకో 40 టిఎంసిల వాటర్ అందుబాటులో ఉన్నాయి.

ఎత్తిపోతల పథకాలైన పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఏఎంఆర్ తగినంత నీరు లేకపోవటంతో పూర్తి స్థాయిలో నీరు విడుదల చేయలేకపోతున్నారు. ఉన్న నీటిని భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి అవసరాల కోసం ఉంచాల్సిన అవసరం ఉందని అధికారులు తెలుపుతున్నారు.

పంటలు ఎండిపోతున్నాయని రైతాంగం జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయటం.. రైతులు రోడ్ల మీదికి రావడం.. ప్రభుత్వం తాత్కాలిక చర్యలులో భాగంగా కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి మూడు టీఎంసీల నీరుని విడుదలకు ఒప్పించి పంటలను కాపాడుకొనుటకు జూరాల కాలువలకు నీళ్లు విడుదల చేయడం జరిగింది.

ఒకవైపు ఎల్‌నినో ప్రభావం మరో వైపు పాలకుల వైఫల్యం వెరసి అన్నదాత పాలిట శాపంగా పరిణమించాయి. ఎల్ నినో ప్రభావం కేవలం తెలంగాణ పైనే కాదు యావత్ దేశంపై కూడా ఉందనే విషయం వాస్తవమే అయినా, ఇక్కడ ప్రకృతి ప్రకోపానికి తోడు ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం సాగుకు కష్టాలను తెచ్చిపెట్టింది. వరి వేసుకోకుండా మెట్ట పంటలు వేసుకోవాలని సీజన్ కు ముందు నుండే రైతాంగానికి అవగాహన కల్పించేది ఉండే. ఇందులో ప్రభుత్వం వ్యవసాయ శాఖ వైఫల్యం కనిపిస్తుంది.

ఉమ్మడి రాష్ట్రంలోనూ.. నేడు సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోనూ పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను సత్వరము పూర్తి చేసి తెలంగాణలో అని ప్రాంతాలకు సాగునీటి అందించాలంటూ రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, వ్యవసాయ నిపుణులు కోరుతూ వచ్చారు. కానీ పాలకులు ఆ మాటలను పట్టించుకున్న పాపాన పోలేదు.

ఫలితం ఇప్పుడు మనం అనుభవిస్తున్న కరువు కాటకాలే. ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రధానమైన ప్రాజెక్టులను పూర్తి చేయుటకు యుద్ధ ప్రాతిపదిగా చర్యలు చేపట్టి పూర్తి చేయాలి.

ఉజ్జిని రత్నాకర్ రావు, 9490952646

# ఆస్తులు పంచుకుంటున్న కుమారులు.. ఆత్మహత్యల పాలవుతున్న తల్లిదండ్రులు

కుటుంబంలో పెద్దల మాటే నిర్ణయం. వృద్ధ తల్లిదండ్రులు ఇంటికి పెద్ద దిక్కుగా ఉండేవారు. పిల్లల భవిష్యత్తు కోసం జీవితాంతం కష్టపడిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో పిల్లలే అండగా నిలిచేవారు. కాలం మారింది. ఉమ్మడి కుటుంబాలు కనుమరుగవుతున్నాయి. ఆస్తుల పంపకాలు త్వరగా జరుగుతున్నాయి. పిల్లలు తమ తమ జీవితాల్లో బిజీ అవుతున్నారు. కానీ ఆస్తులు పంచుకున్నంత సులభంగా తల్లిదండ్రుల బాధ్యతలను పంచుకునే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. ఇదే అనేక కుటుంబాల్లో కొత్త సమస్యలకు దారితీస్తోంది. తాజాగా.. వృద్ధాప్యంలో తమకు అండగా ఉంటారనుకున్న కుమారులే పట్టించుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వృద్ధ దంపతులు బలవన్మరణానికి పాల్పడిన విషాద ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చప్టా–కే గ్రామంలో చోటుచేసుకుంది.

తమను కుమారులు సరిగా చూసుకోవడం లేదని, కనీసం భోజనం కూడా సక్రమంగా పెట్టడం లేదన్న మనస్తాపంతోనే ఈ దంపతులు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్న కొన్ని విషాద ఘటనలు ఈ అంశంపై సమాజం మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. వృద్ధ తల్లిదండ్రులు తమ జీవితమంతా పిల్లల కోసం త్యాగం చేసిన తర్వాత, చివరి దశలో ఒంటరితనం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, కుటుంబ నిర్లక్ష్యం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. పిల్లలు విడివిడిగా జీవించడం తప్పు కాకపోయినా తల్లిదండ్రులను మాత్రం విడిచిపెట్టడం కుటుంబ బాధ్యత నుంచి తప్పించుకోవడమే అవుతుంది.

**ఆస్తి తీసుకోవడం కాదు.. బాధ్యత తీసుకోవాలి**

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు ఇవ్వడం సాధారణమే. అయితే భూమి, ఇల్లు, నగదు వంటి ఆస్తులను పిల్లలకు బదిలీ చేసిన తర్వాత తల్లిదండ్రుల జీవన భద్రత ఏమిటన్నది చాలా కుటుంబాలు ఆలోచించడం లేదు. ఆస్తి తమ పేర్లకు మారిన తర్వాత వృద్ధ తల్లిదండ్రుల అవసరాలను పట్టించుకోకపోవడం తీవ్రమైన సమస్యగా మారుతోంది. ఆస్తి తీసుకున్న పిల్లలు బాధ్యతను కూడా స్వీకరించాలి. ఎవరి వద్ద తల్లిదండ్రులు ఉంటారో, వైద్య ఖర్చులు ఎవరు భరిస్తారో, రోజువారీ అవసరాలు ఎలా తీరుస్తారో, అత్యవసర సమయంలో ఎవరు అండగా ఉంటారో ముందుగానే కుటుంబంలో నిర్ణయించుకోవాలి. ఇది కేవలం ఆర్థిక ఒప్పందం కాదు..కుటుంబ విలువలకు సంబంధించిన బాధ్యత.

**ఆస్తి పంచే ముందు ఈ విషయం ఆలోచించాలి...**

తల్లిదండ్రులు కూడా తమ జీవిత భద్రత గురించి ముందుగానే ఆలోచించాలి. తమకు ఉన్న ఆస్తిని పూర్తిగా పిల్లల పేర్లకు బదిలీ చేసే ముందు వృద్ధాప్యంలో తమకు అవసరమైన ఆర్థిక భద్రత, నివాస హక్కు, వైద్య ఖర్చులు, రోజువారీ జీవన అవసరాలు వంటి అంశాలను స్పష్టంగా నిర్ణయించుకోవాలి. అవసరమైతే న్యాయ నిపుణుల సలహా తీసుకోవాలి. తల్లిదండ్రుల పోషణ, సంరక్షణకు సంబంధించిన చట్టపరమైన రక్షణలు కూడా ఉన్నాయి. అయితే కోర్టులు, చట్టాల వరకు పరిస్థితి వెళ్లకుండా కుటుంబంలోనే సమస్య పరిష్కరించుకోవడం అత్యుత్తమ మార్గం.

నారాయణఖేడ్ వంటి ఘటనలు కేవలం ఒక కుటుంబ విషాదంగా మిగిలిపోకుండా, ప్రతి కుటుంబం ముందుగానే మేల్కొనే హెచ్చరికగా మారాలి. తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో భద్రత, గౌరవం, ఆప్యాయత కల్పించే కుటుంబ సంస్కృతిని తిరిగి బలపరచాల్సిన సమయం ఆసన్నమైంది.





**తెలంగాణలో నమోదైన సంబంధిత ఘటనలు..**

ఆగసు 20, 2023నాడు... రాజన్న సిరిసిల్ల చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి కనికరపు దేవయ్య (69),లక్ష్మీ నర్సవ్వ(60) ఆస్తి పంపకాల్లో తమకు రావాల్సిన 18 అంకణాల స్థలం విషయంలో పెద్ద కుమారుడి వేధింపులు ఉన్నాయని పోలీసుల వివరాల ఆధారంగా వార్తలు వచ్చాయి. దంపతులు పురుగుల మందు తాగి మృతి చెందారు.

2025 ఆగస్టు... నారాయణపేట మద్దూర్ మండలం ఖాజీపేట వడ్ల నాగమ్మ(83) భర్త మరణం తర్వాత ఉన్న 14 ఎకరాల భూమి, పొదుపు మొత్తాన్ని ముగ్గురు కుమారులు పంచుకున్నారని, తనను పట్టించుకోకుండా వదిలేశారని ఆమె ఆరోపించారు. చివరకు జీవనం కోసం భిక్షాటన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారంపై తెలంగాణ లోకాయుక్త స్వయంగా విచారణకు ఆదేశించింది. ఇది మరణ ఘటన కాదు; వృద్ధుల నిర్లక్ష్యానికి ముఖ్యమైన ఉదాహరణ.

6 ఏప్రిల్ 2026...కరీంనగర్ సైదాపూర్ మండలంఎలబోతారం నూనె వెంకటమ్మ (80) మొదట బావిలో పడి మృతి చెందిన ఘటనగా నమోదైంది. తరువాత పోలీసుల దర్యాప్తులో, అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వెంకటమ్మను ఇద్దరు కుమారులు బావిలో పడేసినట్లు తేల్చారు. కుటుంబంలో ఉన్న మూఢనమ్మకం కారణంగా ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇది ఆత్మహత్య కాదు, హత్య కేసు.

18 సెప్టెంబర్ 2026... జనగామ రఘునాథపల్లి మండలం గబ్బెట గైనీ పుల్లయ్య, గైనీ లక్ష్మి దంపతులకు ఉన్న ముగ్గురు కుమారులు వివిధ కారణాలతో మరణించడంతో, వృద్ధాప్యంలో తమను చూసుకునేవారు లేకపోవడం, కుమారుల మరణంతో తీవ్ర మనోవేదనకు గురికావడం కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

21 జూన్ 2026... పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామంలో మేరుగు యశోద(75) అనే వృద్ధురాలు అనారోగ్యం, ఒంటరితనం భరించలేక వ్యవసాయ బావిలో దూకి మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నప్పటికీ వారు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నారని, భర్త గతంలోనే చనిపోయారు.

సెప్టెంబర్ 29న... సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలోని చప్టా(కె) గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు ముంగె నర్సారెడ్డి (88), ముంగె అంజమ్మ(85) తమ భూములు పంచుకున్న కుమారులు తమను నిర్లక్ష్యం చేయటంవల్ల ఆకలితో అలమటిస్తూ తమ వ్యవసాయ భూమిలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

## 'సర్' ప్రక్రియ నిలిపివేయాలంటూ

# కోదండరామ్ మౌనదీక్ష

ప్రారంభించిన మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

ఇసి పారదర్శకంగా పనిచేయాలని డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషన్ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం పని చేయాలని, వ్యక్తుల ఇష్టాయిష్టాలకు, అదృశ్య శక్తుల ప్రభావానికి లోబడి పనిచేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు నష్టం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 'సర్' ప్రక్రియను నిలిపివేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కల్పించాలని, ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని టిజెఎస్ కార్యాలయంలో టిజెఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ శుక్రవారం మౌన దీక్ష నిర్వహించారు.ఈ దీక్షను కె.శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించగా,ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు కేంద్రంలోని బిజెపి,ఆర్ఎస్ఎస్ కుట్రలకు పాల్పడుతున్నాయన్నారు. ఫామ్ 6లో కొత్తగా చేర్చిన పలు అంశాలు కొత్తవారిని చేర్పించేందుకు ప్రతిబంధకంగా మారాయన్నారు. రాజ్యాంగ బద్ధమైన ఎన్నికల కమిషన్‌ను ఒక వ్యక్తి ఇష్టా ఇష్టాల పైన, అదృశ్య శక్తుల ప్రభావంతో పని చేస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. 18 సంవత్సరాల యువతీ యువకులు తమకు వ్యతిరేకమనే భావంతో పాలకులు ఉన్నారని, వారిని కొత్తగా ఓటర్లుగా చేర్చుకునేందుకు అనేక ప్రశ్నలను,అనేక అడ్డంకులను సృష్టించడం సరైంది కాదని సూచించారు. యువకుల ఓట్లకు వ్యతిరేకంగా పెద్ద కుట్ర జరుగుతోందన్నారు. దేశంలో రాజ్యాంగ, ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమైన పరిపాలన సాగిస్తున్నారని, ఇలాంటి చర్యలను వ్యతిరేకించకపోతే వచ్చే కాలం మొత్తం చీకటి కాలమే అవుతుందని, సభలు, సమావేశాలను కూడా పెట్టుకునే పరిస్థితి ఉండబోదని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**పోరాటాన్ని కొనసాగిస్తాం : కోదండరామ్**

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ కంచే చేను మేసినట్టుగా వ్యవహరిస్తోందన్నారు. అధికారంలో ఉన్నవారు చెప్పినట్టుగానే ఎన్నికల కమిషన్ వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

సర్ ప్రక్రియను నిలిపివేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కు ద్వారానే ప్రజలు తమ హక్కులను కాపాడుకోగలుగుతారని, ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఏర్పడితే ప్రజాస్వామ్య హక్కులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. పౌరుల హక్కులను కాపాడేందుకు టిజెఎస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తామని కోదండరాం తెలిపారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలూ స్పందించాలి : అద్దంకి దయాకర్**

ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు అన్ని రాజకీయ పక్షాలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యం, ఓటు హక్కు పరిరక్షణకు ముందుకు రావాలని కోరారు.

యువత, ఆదివాసీలు, దళితులు సహా అర్హులైన ప్రజల ఓట్లను తొలగించే విధంగా సర్ ప్రక్రియ కొనసాగకూడదని సూచించారు. ఓటు హక్కును తొలగిస్తే ప్రజల హక్కులను కాపాడే అవకాశం ఉండబోదని,అందుకే ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిజెఎస్ యువజన అధ్యక్షులు సలీమ్ పాషా, టిజెఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్, బైరి రమేష్, నిజ్జన రమేష్ ముదిరాజ్, పల్లె వినయ్ కుమార్, మాసంపల్లి అరుణ్ కుమార్, జస్వంత్ కుమార్, హనుమంత్ రెడ్డి, పేరాల ప్రశాంత్,దార సత్యం తదితరులు పాల్గొన్నారు.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న..

# గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

గాంధీయిజమే ప్రపంచానికి మార్గదర్శకం

బాపూజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అహింస, సత్యాగ్రహం, సమానత్వం, సామాజిక న్యాయం వంటి మహాత్మా గాంధీ ఆలోచనలే ప్రపంచానికి మార్గదర్శకాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలోనే అసమానతలు, వివక్ష, అవమానాలు లేని సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని డిప్యూటీ సిఎం పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, టిపిసిసి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సే భావజాలాన్ని సమర్థించే ధోరణులు దేశంలో కనిపించడం బాధాకరమని అన్నారు. గాంధీని విమర్శిస్తూ, గాడ్సే విధానాలే సరైనవని మాట్లాడే సంస్కృతిని దేశ భక్తులెవరూ అంగీకరించరాదన్నారు. గాంధీ ఆలోచనలకు వ్యతిరేకంగా గాడ్సే భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

**గాంధీ ఉద్యమాన్ని మరిచి చరిత్రను వక్రీకరిస్తున్నారు**

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ నాయకత్వం, సత్యాగ్రహం, అహింసా సిద్ధాంతాల పాత్ర అత్యంత కీలకమని డిప్యూటీ సిఎం అన్నారు. పేర్కొన్నారు. గాంధీతో కలిసి నడవని, ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమంతో సంబంధం లేని కొందరు నేడు చరిత్రను వక్రీకరించే ప్రయత్నం భారతీయ జనతా పార్టీ నాయకులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. దక్షిణాఫ్రికాలో ఎదురైన అవమానం గాంధీజీ జీవితంలో కీలక మలుపుగా మారిందని చెప్పారు. అనంతరం భారతదేశానికి తిరిగి వచ్చి రైతులు, పేదలు, అణగారిన వర్గాల సమస్యలను అర్థం చేసుకుని సత్యాగ్రహ ఉద్యమాలకు నాయకత్వం వహించారని వివరించారు. చంపారన్ సత్యాగ్రహం నుంచి దండి సత్యాగ్రహం వరకు గాంధీజీ సామాన్య ప్రజల సమస్యలను ఉద్యమాలకు కేంద్రంగా మార్చారని అన్నారు. గుప్పెడు ఉప్పుతోనూ, చిన్న నూలు పోగుతోనూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి సవాల్ విసిరిన మహాత్ముడు ప్రజల శక్తిని ప్రపంచానికి చాటారని పేర్కొన్నారు.

**గాంధీభవన్‌లో...**

హైదరాబాద్ గాంధీభవన్‌లో టిపిసిసి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహాత్మా గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సిఎం స్పష్టం చేశారు. గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, గడ్డం వివేకానంద స్వామి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలు

మీడియా స్వేచ్ఛ, భద్రతకు ప్రత్యేక చట్టం అవసరం

జాతీయ మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సమస్యలు పరిష్కరించాలి

ఐజెయు, టియుడబ్ల్యూజె నేతల డిమాండ్

ఐజేయూ పిలుపుతో గన్‌పార్క్ వద్ద జర్నలిస్టుల భారీ నిరసన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల హక్కుల సాధన, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు కొనసాగించాల్సిన అవసరం ఉందని ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు), తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) నాయకులు అన్నారు. ఐజెయు ఇచ్చిన పిలుపు మేరకు గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్లోని అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ వద్ద టియుడబ్ల్యూజె ఆధ్వర్యంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, మీడియా స్వేచ్ఛను పరిరక్షించాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు.

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, అయితే మాజీ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్, సంక్షేమ పథకాల అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

ఐజెయు పిలుపు మేరకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జర్నలిస్టులు తమ సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికారంగం కీలకమైన నాలుగో స్తంభమని, జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, వేతనాలు, పని పరిస్థితులు, సామాజిక భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పత్రికా స్వేచ్ఛ, జర్నలిస్టుల రక్షణతో పాటు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం మరింత బలోపేతం కావాలంటే పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని పేర్కొన్నారు. తెలంగాణలో జర్నలిస్టుల హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు, సంక్షేమ పథకాలు, తదితర అంశాలపై ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం మీడియా అకాడమీ చైర్మన్‌గా తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.





**స్వతంత్ర జర్నలిజమే ప్రజాస్వామ్యానికి బలం**
**ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యుడు దేవులపల్లి అమర్**

సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే మీడియా ప్రజల సమస్యలను స్వతంత్రంగా వెలుగులోకి తీసుకురావాలన్నారు. పరిశోధనాత్మక జర్నలిజానికి ఎంతో ప్రాధాన్యం ఉందని, అదే సమయంలో ప్రతి కథనాన్ని ఆధారాలు, పత్రాలు, సంబంధిత వర్గాల స్పందనతో నిర్ధారించుకోవాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. మీడియాపై ప్రజల్లో విశ్వాసం పెరగాలంటే స్వతంత్రత, వాస్తవ నిర్ధారణ, జవాబుదారీతనం, ప్రజా ప్రయోజనం జర్నలిజానికి కేంద్రంగా ఉండాలన్నారు.

**జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి**
**టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ**

విరాహత్ అలీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రాజధానిలో అమరవీరుల సాక్షిగా జర్నలిస్టుల హక్కుల కోసం ఆందోళన చేయాల్సి రావడం విచారకరమన్నారు. గత పదిహేనేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు. జర్నలిస్టులపై ఒత్తిళ్లు, కేసులు, అరెస్టులు, నిర్బంధం వంటి అంశాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రజల తరపున ప్రశ్నించే జర్నలిస్టులు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో జర్నలిస్టులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. చిన్న, మధ్యతరహా పత్రికలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రకటనల బిల్లులు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**జాతీయ జర్నలిస్టుల భద్రతా చట్టం తేవాలి**
**టియుడబ్ల్యూజె ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ**

కె.రాంనారాయణ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై పాలకులు తగిన దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక జాతీయ జర్నలిస్టుల భద్రతా చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి పరిష్కార మార్గాలు సూచించేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు.

**మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి :**
**ఐజెయు ఉపాధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి**

వై.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు, మీడియా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఐజెయు డిమాండ్ చేస్తోందన్నారు.

**ప్రెస్ కౌన్సిల్ను మరింత బలోపేతం చేయాలి**
**ఐజెయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ.మజీద్**

ఎం.ఎ. మజీద్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల భద్రత, ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత, స్వేచ్ఛగా పనిచేసే హక్కులను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ జర్నలిస్టుల భద్రతా చట్టం, మీడియా కమిషన్ ఏర్పాటు తమ ప్రధాన డిమాండ్లని పేర్కొన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మరింత సమర్థవంతంగా, స్వతంత్రంగా, జవాబుదారీతనంతో పనిచేసేలా బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ కార్యవర్గ సభ్యులు కే.సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు వి.యాదగిరి, బొమ్మగాని కిరణ్ కుమార్,రాజేష్ హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (హెచ్.యు.జె) అధ్యక్ష, కార్యదర్శులు శిగ శంకర్ గౌడ్,షౌకత్ చిన్న మధ్య తరహా పత్రికల జర్నలిస్టుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యూసుఫ్ బాబు,అశోక్, దాసు,ఉర్దు జర్నలిస్ట్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ గౌస్, ఫోటో జర్నలిస్టుల సంఘం నాయకులు కె.ఎన్. హరి, అనిల్, వీడియో జర్నలిస్టుల సంఘం నాయకులు హరీష్, సన్నీ,నాగరాజు,హెచ్యూజే నాయకులు వెంకటాచారి,భరత్ చారి, అమరేశ్వర్ రెడ్డి, ఇబ్రహీం, రఫీ, ప్రతిభ, ఆజాం ఖాన్ , వెంకటయ్య, ఆగస్టిన్, సాజిదా తదితరులు పాల్గొన్నారు.

## బాపూఘాట్‌లో

# డిజిటల్ మ్యూజియం ప్రారంభం



**ప్రజాపక్ష/హైదరాబాద్ :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్ హౌస్‌లోని బాపూ ఘాట్‌లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మహాత్ముడి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూఘాట్‌లో ఏర్పాటు చేసిన డిజిటల్ మ్యూజియంను గవర్నర్‌తో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మహమ్మద్ అజారుద్దీన్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలు గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంత రావు, హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డిపిపి సి.వి.ఆనంద్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సెంట్రలైజ్డ్ కిచెన్ రద్దు చేయకుంటే

# సిఎం ఇంటి ముట్టడి

మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులను రోడ్డున పడేసే సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. విధానాన్ని విరమించుకోకపోతే త్వరలో ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించింది.

హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం అధ్యక్షురాలు ప్రేమపావని అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వంట కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, 24 ఏళ్లుగా పనిచేస్తున్న 54,200 మంది కార్మికుల ఉపాధికి భంగం కలిగించేలా సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తీసుకురావడం సరికాదన్నారు. ఈ విధానాన్ని రద్దు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న అల్పాహార బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ 2023 24 సంవత్సరానికి సంబంధించి తొమ్మిది నెలల అల్పాహార బిల్లులు ఇప్పటికీ విడుదల కాలేదని తెలిపారు. పెండింగ్ బిల్లులతో పాటు ఎన్నికల హామీ మేరకు వంట కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

కోడిగుడ్లు, గ్యాస్‌తో పాటు వంట సరుకులను ప్రభుత్వమే సరఫరా చేయాలని, లేదా తరగతులతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి రూ.25 మెస్ చార్జీ చెల్లించాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో టి.చక్రపాణి, కె.సుగుణ, నిమ్మకంటి రామకృష్ణ, బోయిని ప్రసాద్, రామ్మూర్తి, మహేష్, రజిత, సత్యమ్మ, గంగయ్య, ప్రభావతి, సాయమ్మ, లక్ష్మమ్మ, శ్రీదేవి, లక్ష్మి , జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోరెడ్డి ప్రమీల, గడ్డం భారతి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** గాంధీజీ పోరాట స్ఫూర్తితో ప్రజాసామ్యంను కాపాడుతూ మన ఓటు హక్కును కాపాడుకుందామని సిపిఐ జాతీయ కార్యవర్గ మాజీ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా హుస్నాబాద్ పట్టణంలో గాంధీజయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను ప్రజాస్వామ్య పరిరక్షించుకొవాలని దాని కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్నటువంటి దేశంలో మనం అన్ని మతాలకు, కులాలకు ఆతీతంగా ప్రజలకు జీవించే హక్కు ఉందని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం నరేంద్రమోదీ పాలనలో మతోన్మాదశక్తులతో కలిసి మత సామరస్యంగా దెబ్బతీసే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కలిసి పోరాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఆందే స్వామి, జాగీరు సత్యానారయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మ గడిపె మల్లేశ్, ఎఐవైఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్‌కుమార్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, నియోజక వర్గ నాయకులు నాగెల్లి లక్ష్మారెడ్డి, చిన్నస్వామి, తేరాల సత్యనారాయణ, పిట్టల మొగిలయ్య, పూదరి రఘుపతి, ఇ. కిష్టయ్య, పొదిల కుమారస్వామి, ఐలేని మల్లారెడ్డి, ఎల్లయ్య,బి సమ్మయ్య, దొంతర వేణి రజిత, రాయిల్ల శోభ, రాజవ్వతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో 'అఫ్జీ హౌస్'

# ప్రారంభించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమం, భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. గిగ్ వర్కర్లకు చట్టపరమైన రక్షణతో పాటు సామాజిక భద్రత, సంక్షేమ సదుపాయాలు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. కొండాపూర్‌లో శుక్రవారం క్యాబ్ డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్ల కోసం ఏర్పాటు చేసిన 'అఫ్జీ హౌస్'ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శక్తి శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, మాజీ ఎంపి రంజీత్ రెడ్డి, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సలావుద్దీన్, అఫ్జీ ప్రతినిధులు, గిగ్ వర్కర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్‌లో సుమారు నాలుగు లక్షల మంది గిగ్ వర్కర్లు ఉన్నారని, నగర ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర కీలకమన్నారు. గిగ్ వర్కర్లకు కనీస వేతనం, సామాజిక భద్రత, ఇతర సంక్షేమ సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం రూపొందించిందని మంత్రి తెలిపారు. అగ్రిగేటర్లతో పలుమార్లు చర్చలు జరిపామని, వర్కర్ల ప్రయోజనాలతో పాటు అగ్రిగేటర్లు, పరిశ్రమల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని ఆచరణాత్మక పరిష్కారాలు రూపొందించాల్సి ఉందన్నారు. గతంలో గిగ్ వర్కర్లు విశ్రాంతి, భోజనం కోసం రోడ్లపైనే ఆధారపడాల్సి వచ్చేదని, 'అఫ్జీ హౌస్'లో విశ్రాంతి, భోజనం, మొబైల్ ఛార్జింగ్, శిక్షణ వంటి సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. భవిష్యత్ అవకాశాలను మెరుగుపరుచుకునేందుకు నైపుణ్య శిక్షణ పొందాలని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.



## అనురాగ్‌లో హెచ్‌ఎంఏ విద్యార్థి విభాగం ప్రారంభం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పరిశ్రమల అనుభవం వృత్తిపరమైన నైపుణాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్‌ఎంఏ) విద్యార్థి విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఏతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. విభాగాధిపతి డా.వి.విష్ణు వందన హెచ్‌ఎంఏ కార్యక్రమాలు ప్రాధాన్యతను వివరించారు.అధ్యక్షుడు శరత్ చంద్ర మారోజు పరిశ్రమలు, విద్యాసంస్థల అనుసంధానంతో విద్యార్థులకు ఆచరణాత్మక పరిజ్ఞానం, కెరీర్ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. కార్యదర్శి రమేష్ లక్ష్మణ్ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలతో వ్యక్తిగత, వృత్తిపరమైన అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఏ ముఖ్య నిర్వహణ అధికారి జి. ప్రసన్న, సమన్వయకర్తలు డా.సి.మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## రక్తదానంతో మహనీయులకు ఘన నివాళి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లో సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. లాల్‌బహదూర్ స్మారక యువజన సంఘ భవనంలో మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, లయన్స్ క్లబ్ ఆఫ్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మల్కాజిగిరి జిల్లా సేవాభారతి డాక్టర్ హెడ్గెవార్ రక్తకేంద్రం బృందం 30 యూనిట్ల రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో సింగిరెడ్డి రాంరెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, మేకల నర్సింగ్ రావు, నందం గణేష్ బాబు,మారం లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు. రక్తదాతలు రామ్మోహన్, శ్రీధర్, తనీష్ పాల్గొన్నారు.

## కబూతర్ జాలి కంపెనీ తీరుపై స్థానికుల నిరసన



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్ నగర్ పరిధిలోని అరుంధతి నగర్ కాలనీలో కబూతర్ జాలి (పిజాన్ మెష్ ) తయారీ కంపెనీ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ సమస్యలను పట్టించుకోకుండా, విద్యుత్ శాఖ అధికారులు కేవలం సదరు ఫ్యాక్టరీ యాజమాన్యానికే ప్రత్యేకంగా 20 ఫీట్ల రోడ్‌కు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను కేటాయించడంపై కాలనీవాసులు మండిపడుతున్నారు.

**30 ఫిట్ల రోడ్డుపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వదిలి ఫ్యాక్టరీకే ప్రాధాన్యం**

కాలనీ రోడ్డులో ఉన్న సాధారణ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రతిపాదనలను పక్కనపెట్టి, కేవలం కబూతర్ జాలి కంపెనీ ప్రయోజనాల కోసమే అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజల విద్యుత్ అవసరాలు, భద్రతను విస్మరించి, ప్రైవేటు ఫ్యాక్టరీకి ప్రాధాన్యం ఇవ్వడం వెనుక ఉన్న అంతర్యమేమిటని అధికారులను నిలదీస్తున్నారు.

**మైనర్ బాలలతో పనులు – నిబంధనలకు తిలోదకాలు**

సదరు కబూతర్ జాలి కంపెనీలో చట్ట విరుద్ధంగా మైనర్ పిల్లలను కార్మికులుగా పెట్టుకొని పనులు చేయిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. బాలకార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తున్న ఈ ఫ్యాక్టరీపై కార్మిక శాఖ, బాలల హక్కుల పరిరక్షణ అధికారులు తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**గత ఘటనలను గుర్తుచేస్తూ భయాందోళన**

గతంలో అరుంధతి నగర్‌లో విద్యుత్ షాక్ కారణంగా ఒక బాలుడు మృతి చెందిన ఘటన తీవ్ర కలకలం రేపిన విషయాన్ని స్థానికులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ చేదు జ్ఞాపకాలు ఇంకా మానకముందే, ఆరు సంవత్సరాల చిన్నారిపై జరిగిన అగత్యం ఘటనలోనూ ఫ్యాక్టరీ యాజమాన్యం తీవ్ర బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని, బాధితులకు ఎలాంటి న్యాయం చేయలేదని తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

**తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి**

పదే పదే అక్రమాలకు, కాలనీవాసుల భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న ఈ కబూతర్ జాలి ఫ్యాక్టరీపై రెవెన్యూ, పోలీస్, విద్యుత్ కార్మిక శాఖ అధికారులు సంయుక్తంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని అరుంధతి నగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## వరంగల్ విమానాశ్రయ టెర్మినల్‌కు పివి నర్సింహారావు పేరు పరిశీలించాలి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి,దేశ మాజీ ప్రధాని పివి నర్సింహారావు అందించిన సేవలను గుర్తించి,వరంగల్ విమానాశ్రమానికి ఆయన పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించాలని నైస్ కన్‌స్ట్రక్షన్స్ డైరెక్టర్ సామాజికవేత్త రాజారావు కోరారు. శుక్రవారం గాంధీ జయంతని పురస్కరించుకుని కాప్రా ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకుల సమావేశంలో మాట్లాడుతూ దేశ రాజకీయ,పరిపాలన చరిత్రలో పివి నర్సింహారావు కీలక స్థానాన్ని కలిగి ఉన్నారని,పివి నర్సింహారావు దేశానికి విశిష్ట సేవలు అందించారని ఆయన స్థాయికి,చేసిన సేవలను తగిన రీతిలో స్మరించకుని ఆయన పేరును వరంగల్ విమానాశ్రయ టెర్మినల్‌కు ప్రతిపాదనను ప్రభుత్వ సానుకూలంగా పరిశీలించాలని రాజారావు అన్నారు.

## కాప్రాలో ఉరేసుకుని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పిఎస్ పరిధిలోని కాప్రా గాంధీ నగర్‌కు చెందిన ముక్కెర నర్సింహులు(39) ఆరు నెలల క్రితం కొత్త ఇల్లు నిర్మించుకోవడంతో అప్పులు అయ్యాయని దీంతో మృతుడు మానసిక ఒత్తిడి కారణంగా గురువారం రాత్రి భార్యభర్తలు గొడవపడ్డారు. శుక్రవారం ఉదయం ఫిర్యాదుదారు నిద్రలేచి చూడగా బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యానుకు చీరతో ఉరేసుకుని కనిపించాడు. వెంటనే 108కు సమాచారం అందించగా సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# గాంధీ పోరాట స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్ బోస్





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/బోడుప్పల్/ఉప్పల్ :** గాంధీ పోరాట స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయని, దీనికి అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్ పిలుపిచ్చారు. సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీ జయంతి ఉత్సవాల సందర్భంగా హెచ్‌బి కాలనీలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య రక్షణ, రాజ్యాంగ విలువలు, ప్రజల ఓటు హక్కు పరిరక్షణకు పునరంకితం కావాలన్నారు. ఓటర్ల జాబితా సవరణ పేరిట ఏ ఒక్కరి ఓటు హక్కును తొలగించరాదని హెచ్చరించారు. గాంధీజీకి నివాళులర్పించటం అంటే కేవలం జయంతి వేడుకలు నిర్వహించుకోవటం మాత్రమే కాదని, ఆయన ఆశయాల మేరకు భారత దేశ ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకొనేందుకు చేసే యత్నాలే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, ఎఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్యప్రసాద్, సిపిఐ నేతలు స్వామిదాస్, జాన్, నర్సింహారావు, జమిలయ్య, ఐలయ్య, ఎల్లయ్య, రాజ్‌కుమార్, గిరిబాబు, శేఖర్, సుదర్శన్, అశోక్, సుదీప్, మధు, రవి తదితరులు పాల్గొన్నారు. హెచ్‌బి కాలనీలో



జరిగిన మరో కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, శ్రీనివాసరెడ్డి, గొల్లూరి అంజయ్య, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అనిల్ కుమార్, సుధాకర్ గుప్తా, శ్రీనివాస్, నర్సయ్య, ప్రవీణ్, బాలరాజు, మల్లేష్ గౌడ్, కృష్ణమూర్తి, భూ పాల్ గౌడ్, జైపాల్ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామంతాపూర్‌లో జరిగిన మరో కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మహ్మద్ రఫిక్, తోఫిక్, జలీల్ పాషా, లింగం, గాంధీ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, గాయత్రి గౌడ్, అశోక్, తదితరులు గాంధీకినివాళులర్పించారు.

**బోడుప్పల్‌లో...**బోడుప్పల్‌లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అజయ్ యాదవ్‌లు పాల్గొని గాంధీ చూపిన అహింస, శాంతి మార్గాలను మన జీవన విధంగా అల వాటు చేసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. చిలుకానగర్ డివిజన్‌లోని ఉప్పల్ మున్సిపల్ కార్యాలయం, గణేష్ నగర్ కాలనీల్లో జరిగిన గాంధీ జయంతి వేడుకల్లో మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్, ప్రవీణ్ ముదిరాజ్, కొండల్‌రెడ్డి, జగన్, బాలకృష్ణగౌడ్, శ్యాం, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### టియుడబ్ల్యుజె రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.మల్కయ్య




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జాతీయ మీడియా చట్టాన్ని తీసుకొని రావటంతో పాటు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టియుడబ్ల్యుజె రాష్ట్ర కోశాధికారి మోతె వెంకటరెడ్డి డిమాండ్ చేసారు. ఐజెయు పిలుపు మేరకు జర్నలిస్టు డిమాండ్స్ డే శుక్రవారం ఇసిఐఎల్‌లో పెద్ద సంఖ్యలో చేరిన పాత్రికేయులు ర్యాలీ నిర్వహించిన అనంతరం గాంధీ విగ్రహానికి జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందచేసారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.మల్కయ్యతో కల్సి ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు, మీడియా సంస్థల భద్రత కోసం ప్రత్యేక కేంద్ర చట్టం అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియా రంగం లో వచ్చిన మార్పులకు అనుగుణంగా నూతన చట్టం రూపకల్పనకు తగు సిఫార్సుల కోసం జాతీయ స్థాయిలో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. గతంలో 1955,1958 చట్టాల ద్వారా జర్నలిస్టులకు కల్పించిన ప్రత్యేక రక్షణలను పునరుద్దరించాలని డిమాండ్ చేసారు. మీడియా ఉద్యోగుల కోసం నూతన వేతన బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు కావస్తున్నా సిఎం పేర్కొన్న విధంగా ఏ ఒక్క హామీని నెరవేర్చక పోగా సమస్యల పరిష్కారం దిశగా ఒక్క అడుగైనా వేయక పోవటం శోచనీయమన్నారు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆరోగ్య బీమా వర్తింపచేయాలని, ఇళ్ల స్థలాలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమం లో టియుడబ్ల్యుజె కాప్రా, మేడిపల్లి, ఉప్పల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, ఆల్వాల్ ప్రెస్ క్లబ్, మేడిపల్లి, ఉప్పల్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఫ్రెషర్‌లు, జవహర్‌నగర్, మల్కాజిగిరి నియోజకవర్గ జర్నలిస్టులు పాల్గొన్నారు. జర్నలిస్టుల నిరనసన ఆందోళనలకు మద్దతుగా ఎఐవైఎఫ్ నేతలు ధర్మేంద్ర, సత్యప్రసాద్‌లు ర్యాలీలో పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్‌లో :** శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె ఐజెయు) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జీడిమెట్ల గ్రామంలోని 44వ నంబర్ జాతీయ రహదారి సమీపంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు.



ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కమిటీ అధ్యక్షులు గోలిపల్లి దయాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, ప్రధాన కార్యదర్శి రెడ్డెబోయిన మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యులు నాగేంద్రచారి, సలహాదారులు గుంటూరు శేఖర్, లాలయ్య, పాత్రికేయులు కలికిమూర్తి, రణధీర్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, కె.రాజు, తదితరులు పాల్గొన్నారు

# సీనియర్ సిటిజన్లు యువతను ప్రోత్సహిస్తూ మార్గనిర్దేశం చేయాలి

### మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి



**ప్రజాపక్షం/ఉప్పల్ :** బలమైన కుటుంబ వ్యవస్థకు తరాల మధ్య పరస్పర అవగాహన, పరస్పర గౌరవం అవసరం ఉందని, సీనియర్ సిటిజన్లు యువతను ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన మార్గనిర్దేశం చేస్తుండాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి సూచించారు. 60 ఏళ్లు దాటిన 100 మందికి పైగా పాల్గొన్న చిలుకానగర్ డివిజన్ తెలంగాణాఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా) నూతన శాఖ నోవా బ్యాంకెట్ హాలులో శుక్రవారం జరిగిన ప్రారంభ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నేడు సమాజం అనుభవిస్తున్న అభివృద్ధి, సంపద, సౌకర్యాల వెనుక గత తరాల సీనియర్ సిటిజన్ల కృషి, త్యాగం, సేవలు దాగి ఉన్న విషయాన్ని మరువద్దన్నారు. సీనియర్ సిటిజన్లు మొదటి తరానికి ప్రతినిధులైతే తమ తరం రెండో తరంగా, నేటి యువత మూడో తరంగా భావించవచ్చన్నారు. కాగా తరాల మధ్య అంతరాలను అర్థం చేసుకొంటూ ముందుకు సాగాలని, కేవలం తమ ఆలోచనలు, సూచనల మేరకే యువత ముందుకు వెళ్లాలన్న సీనియర్ సిటిజన్లు పట్టుబట్టడం సరైంది కాదని, నేటి యువతలో దాగి ఉన్న అపారమైన శక్తి సామర్థ్యాలను గుర్తిస్తూ ప్రోత్సహించటం ద్వారా భవిష్యత్తు తరాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. సీనియర్ సిటిజన్ల గౌరవం, భద్రత, సంక్షేమం కోసం చట్టపరంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, పోలీసు శాఖ సైతం అవసరం ప్రకారం తోడుంటుందన్నారు. సీనియర్ సిటిజన్లు తమ శేషజీవితాన్ని ఆనందంగా, ఆరోగ్యంగా కొనసాగించేందుకు సమాజం, ప్రభుత్వ యంత్రాగం కలిసి కృషి చేయాలన్నారు. ఉప్పల్ తహసీల్దార్ పూల్‌సింగ్ మాట్లాడుతూ చిలుకానగర్ ప్రాంతంలో సీనియర్ సిటిజన్లకు ప్రత్యేకంగా సామాజిక పార్కు, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు తగిన స్థలాన్ని కేటాయించేందుకు ప్రతిపాదనకు సిద్ధం చేస్తామన్నారు. టాస్కా రాష్ట్ర అధ్యక్షులు పి.నరసింహారావు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు పలు పనులు నిమిత్తం వెళ్లే సందర్భాల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని, సీనియర్ సిటిజన్లు ఎక్కువ సేపు వేచి ఉండకుండా ప్రతి కార్యాలయం లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయటం ద్వారా ప్రాధాన్యతనిస్తూ పూర్తయ్యేలా చూడాలని కోరారు. టాస్కా చిలుకానగర్ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మగాని దాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు, సభ్యుల సమన్వయంతో ఈ ప్రాంతంలో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఉప్పల్ ఏసిపి వెంకటరెడ్డి, టాస్కా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి, జిల్లా ఇన్‌చార్జి వెంకటయ్య గౌడ్, రాజిరెడ్డి, బాలచందర్, భాస్కర్ గౌడ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. టాస్కా చిలుకానగర్ శాఖ నూతన కమిటీ అధ్యక్షుడిగా దాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బోడ విద్యాసాగర్, కోశాధికారిగా చంద్రయ్య, సలహాదార్లుగా శంబు ప్రసాద్, నాగార్జున, రాంచర్ల బలరాం, అంజయ్యలు ఎన్నికైనట్లు ప్రకటించారు.

# ఎన్ఐటిటిటిఆర్ చెన్నైతో ఎంఎల్ఆర్ఐటిఎం అవగాహన ఒప్పందం



**ప్రజాపక్షం/దుండిగల్:** హైదరాబాద్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్, చెన్నైతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా అకడమిక్ ఎక్సలెన్స్, అధ్యాపకుల అభివృద్ధి, పరిశోధన, ఇన్నోవేషన్, సంస్థాగత సామర్థ్య నిర్మాణంను మరింత బలోపేతం చేయనున్నారు. ప్రొఫెసర్ (డా.) శ్రీధర్ పత్తి, డైరెక్టర్, ఎంఎల్ఆర్ఐటిఎం, ప్రొఫసర్ డా॥ ఉషా నటేషన్, డైరెక్టర్, ఎన్ఐటిటిటిఆర్ చెన్నై, నాయకత్వంలో ఈ భాగస్వామ్యం కొనసాగనుందనీ అధ్యాపకుల శిక్షణ, వినూత్న బోధనా అభ్యసన పద్ధతులు, పరిశోధన, పాఠ్యాంశాల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, జ్ఞాన మార్పిడి వంటి అంశాల్లో రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నాయి. ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ భాగస్వామ్యాన్ని అభినందిస్తూ, జాతీయ స్థాయి ప్రాముఖ్యత కలిగిన సంస్థలతో ఇటువంటి భాగస్వామ్యాలు సాంకేతిక విద్య నాణ్యత, ప్రాసంగికతను మరింత పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఎంఎల్ఆర్ఐటిఎం యాజమాన్యం చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి, సెక్రటరీ మర్రి అనూ శ్రేయ రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మర్రి ధీరన్ రెడ్డి, ట్రెజరర్ మర్రి మమతా రెడ్డి ఈ భాగస్వామ్యంపై హర్షం వ్యక్తం చేస్తూ సంబంధిత బృందాలను అభినందించారు. ఈ భాగస్వామ్యం అధ్యాపకులు, విద్యార్థులకు మరిన్ని విలువైన అవకాశాలను అందిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సహకారం అకడమిక్ ఎక్సలెన్స్, అధ్యాపకుల సాధికారత, పరిశోధన, ఇన్నోవేషన్, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక విద్య దిశగా కొనసాగిస్తున్న కృషిలో మరో ముఖ్య మైన ముందడుగుగా అన్నారు.

## బాలాజీనగర్‌లో గాంధీ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి నేతృత్వంలో బాలాజీ నగర్‌లోని బాపూజీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ, దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ చూపిన శాంతియుత మార్గం, ఉప్పు సత్యాగ్రహం వంటి పోరాటాలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టిన మహనీయుడు గాంధీజీ అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ శాఖ కార్యదర్శి కొండా సత్యం సాగర్, డిహెచ్‌పిఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మల్లేశం, ఎఐటియుసి మండల అధ్యక్షులు అంబల ఎల్లయ్య, శాఖ సహాయ కార్యదర్శి నాని, కె.రుక్మియా, ఎరుకల సోమేష్, తదితరులు పాల్గొన్నారు.



**కుత్బుల్లాపూర్‌లో:** మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని దుండిగల్, షాపూర్‌నగర్‌లో సిపిఐ మండల కార్యదర్శి స్వామి అధ్యక్షతన షాపూర్‌నగర్‌లోని హమాలీ అడ్డా వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీ సేవలను కొనియాడుతూ, ఆయన చూపిన శాంతి, అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శులు మల్లేష్, హరినాథ్, వెంకటయ్య, సిద్ధప్ప, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.




## గాంధీ జయంతి సందర్భంగా జైలులో ఖైదీల సంక్షేమ దినం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జాతిపిత మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీని కేంద్ర కారాగారంలో ఖైదీ ల సంక్షేమ దినంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగారంలో జరిగి న కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి తమ ఉచిత న్యాయ సహాయం కొరకు వారి సేవలను వినియోగించుకోవాల్సిందిగా సూచించారు. ప్రత్యేక అతిథి అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రియాంక విచ్చేసి ఖైదీల సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షించారు. కారాగారంలో చదువు, ఆటలు,సాంస్కృతిక ఇతర కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన ఖైదీలకు జైళ్ల శాఖ ఐజి వై రాజేష్‌తో కలిసి బహుమతి ప్రదానం చేశారు. తెలంగాణ జైళ్ల శాఖ నిర్వహిస్తున్న డి ఎడిక్షన్ సెంటర్స్, నిషా ముక్త్ భారత్ కోసం చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి ప్రమోద్, ఉప పర్యవేక్షణాధికారులు వెంకటేష్, దేవ్లా, శ్రీనునాయక్, జైలర్లు, తదితరులు పాల్గొన్నారు.

**ఖైదీల వ్యవసాయక్షేత్రంలో......**

చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఖైదీల సంక్షేమ దినోత్సవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పర్యవేక్షణాధికారి డి. భరత్ ఆటల పోటీలలో గెలిచిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, డాక్టర్ జనార్ధన్, జైలర్ ఆర్ శ్రీనివాస్, డిప్యూటీ జైలర్ వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడిది హత్యా? ఆత్మహత్యా?



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు పట్టణ పరిధి రైల్వే స్టేషన్ సమీపంలో ఓ యువకుడి మృతదేహం కలకలం రేపింది. శుక్రవారం తెల్లవారు జాము న ఆ దారిన వెళ్తున్న స్థానికులకు రక్తపు మడుగులో పడి ఉన్న మృతదేహాన్ని గమనించి కంగుతిన్నారు. యువకుడు రక్తపు మడుగులో పడి ఉడండంతో పాటు పొట్టపై కత్తి పోట్లు ఉండటాన్ని చూస్తుంటే ఇంతకు యువకుడిది హత్య..? ఆత్మహత్య? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని తాండూరు డిఎస్పీ నర్సింగ్ యాదయ్య, టౌన్ సిఐ పరమేశ్వర్ గౌడ్ తమ సిబ్బందితో కలసి సంఘటన ప్రదేశానికి చేరుకున్నారు. మృతుడు సాయిపూర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మున్వర్‌గా గుర్తించారు. మరోపక్క మున్వర్ పొట్ట భాగంలో కత్తి పోట్లు ఉండడంతో పాటు డెడ్ బాడీ రేల్వే స్టేషన్ సమీపంలో పడి ఉండటాన్ని గమనిస్తే అది దారుణ హత్యగానే కన్పిస్తుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## శామీర్‌పేట మండలంలో గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఉమ్మడి శామీర్‌పేట మండలంలో జాతిపిత మహాత్మ గాంధీ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.



అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, శామీర్‌పేట డివిజన్‌లో జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి, గాంధీజీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్‌లు వెంకట్‌రెడ్డి, వెంకటగోపాల్, వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు ముద్దం సుధాకర్‌రెడ్డి, జశ్వంత్‌రెడ్డి, గాదె వెంకటేష్, సరసం వనజ అశోక్ రెడ్డి, నీరజ్‌గౌడ్, నవీన్ నాయక్, అజయ్‌కుమార్, ప్రభాకర్, రాజు, గోవర్ధన్‌రెడ్డి, లత, శ్రీలత, లత, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మాజి సర్పంచ్ ఎళ్ల మల్లేష్, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మేనెజర్ వేణుగోపాల్, ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి, గౌతమి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మోహన్‌సింగ్, నాయకులు నవీన్‌రెడ్డి, కమఠం కృష్ణారెడ్డి, చాట్లపల్లి నర్సింగరావు, కోదూరి దినేష్, వెంకటనర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి,నర్సింలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## బంగారం చోరీ కేసులో మహిళ అరెస్టు

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో గురువారం సాయంత్రం నాలుగు తులాల బంగారు పుస్తెల తాడు చోరీ చేసిన ఘటనలో ఓ మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు యాచారం సిఐ నందిశ్వర్‌రెడ్డి తెలిపారు. సిఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామానికి చెందిన ఈర్లపల్లి జయమ్మ స్కూటిపై వచ్చి మారోజు వజ్రమ్మ(65)ను నీళ్ళు ఇవ్వమని అడిగి వజ్రమ్మ ఒంటి పైనున్న నాలుగు తులాల పుస్తెలతాడును చోరీ చేసి అక్కడి నుండి పరారయ్యింది. పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా నాలుగు గంటల్లో నిందితురాలు ఈర్లపల్లి జయమ్మను అరెస్టు చేసి ఆమె వద్ద నుండి నాలుగు తులాల పుస్తెల తాడును రికవరీ చేశారు. ఈమేరకు భాదితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రెవెన్యూ అధికారులపై కేసు నమోదు




**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల రెవెన్యూ అధికారులపై కేసు నమోదు అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓ భూ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల ప్రమేయం ఉన్నట్లు తెలింది. ఈ మేరకు ఇబ్రహింపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాచారం మండలం నందివనపర్తి రెవేన్యూ పరిధిలోని సర్వేనంబర్ 361లో 8 ఎకరాల 29 గుంటల వ్యవసాయ భూమి కలదు ఈ భూమి విలువ సుమారు 2 కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా.. ఈ భూమిపై తప్పుడు పత్రాలు సృష్టించి ఈ భూమిని రిజిస్రేషన్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తహాశీల్దారు అయ్యప్ప, ఉప తహాశీల్దారు కిర్తి సాగర్, భూ భారతి సిస్టం ఆపరేటర్ నర్సింహ్మా చారి తప్పుడు పత్రాలు సమర్పించి కుట్ర చేశారని ఎండి నజీర్ ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తహాశీల్దారు అయ్యప్పను వివరణ కోరగా ప్రభుత్వం నియమ నిబంధనల ప్రకారమే చేశామన్నారు. మేం కాని మా సిబ్బంది కాని ఎలాంటి తప్పు చేయలేదని తెలిపారు.

## పరుగు పందెంలో ప్రతిభ చాటిన అక్షయ



**ప్రజాపక్షం/కేశంపేట :** పరుగు పందెం పోటీల్లో ప్రతిభను చాటిన విద్యార్థిని అక్షయను ప్రత్యేకంగా అభినంధించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 10వ తరగతిలో చదువుతున్న విద్యార్థినీ అక్షయ రాజేంద్రనగర్‌లో ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌లో మూడు కిలో మీటర్ల పరుగు పందెంలో ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జి.అనిత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థి అక్షయ రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదగాలని, క్రీడల్లో రాణించి బంగారు పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అక్షయ రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## జాంగారి రవికి సన్మానం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం డివిజన్ చైర్మెన్‌గా జాంగారి రవి నియమితులయ్యారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున జాంగారి రవిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాంగారి రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తాను చేస్తున్న సేవలను గుర్తించి షాద్‌నగర్ డివిజన్ ఎస్సీ విభాగం చైర్మెన్‌గా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీని అన్ని విధాల అభివృద్ధి చేయడంతోపాటు ప్రవేశపెట్టిన పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం నిత్యం పాటుపడుతున్న జాంగారి రవి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మాజీ మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు విశ్వం ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, ఫరూఖ్‌నగర్ మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్‌లు పాల్గొన్నారు.

## గాంధీ సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** మహాత్మా గాంధీ చేసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సాదు శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం ఆదిభట్ల సర్కిల్ మునగనూరు పరిధిలో మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని సాదు శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నక్క శ్రీనివాస్ గౌడ్, గుత్త వెంకట్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సంగీత మోహన్ గుప్తా, యశ్వంత్, సుందర్, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



**షాబాద్ :** గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. చందనవెళ్లి గ్రామంలో సర్పంచ్ చేవెళ్ల నవనీత స్వామి, వార్డు సభ్యులతో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం షాబాద్ సిఐ లక్ష్మీరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనదారులకు ఎల్మెంట్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

**యాచారం :** యాచారం మండల కేంద్రంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో ఉన్న అంబేద్కరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నవాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌జి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవిందర్ గుప్త, రంగారెడ్డి జిల్లా అర్యవైశ్య మహసభ నాయకులు నాళ్ళ మురళిగుప్త, పొద్దుటూరి సురేందర్ గుప్త, విషం శెట్టి సంతోష్‌కుమార్ గుప్త, గుద్దేటి ప్రవీణ్ గుప్త పాల్గొన్నారు.

# గాంధీ మార్గాలు నేటి సమాజానికి ఆచరణీయం



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహ మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో ఆచరణీయమైనవని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. గాంధీజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీజీ కీలక పాత్ర పోషించారని తెలిపారు. గాంధీజీ జీవితమే ఒక సందేశమని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**గాంధీజీ జయంతి వేడుకలలో సైబరాబాద్ సిపి డాక్టర్ ఎం.రమేష్**



ప్రజలకు న్యాయం చేయడం, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం, సమాజసేవకు అంకితభావంతో పనిచేయడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి వేడుకలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి) డాక్టర్ ఎం.రమేష్ గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, క్రమశిక్షణ మార్గాలు నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి అన్నపూర్ణ, హెడ్‌క్వార్టర్స్ డిసిపి సంజీవ్, హెడ్‌క్వార్టర్స్ అడిషనల్ డిసిపి షమీర్, హన్మంత్‌రావుతోపాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అబ్దుల్లాపూర్‌మెట్‌లో...**



అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బింగి దేవదాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని డా.బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మాజీ ఎంపిపి బుర్ర రేఖ మహేందర్ గౌడ్, బాటసింగారం మాజీ ఎంపిటిసి కేశెట్టి వెంకటేష్, మండల మాజీ కోప్షన్ గౌస్ పాషా, మండలం సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉప్పు వెంకటేష్, ఎర్రవెల్లి మారుతి ప్రసాద్, గుండె నరసింహ, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల ప్రణీత్ యాదవ్, లస్కర్ గూడ కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు సుర్వి సుదర్శన్, సంభ, నాతి రమేష్ యువజన కాంగ్రెస్ నాయకులు అల్లి బాల కృష్ణ తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరై గాంధీ ఆశయాలను స్మరించుకున్నారు.



## బిసిల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం

టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** బిసిల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని టిపిసిసి ఒబిసి సెల్ చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం బిసిల భారీ బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చైర్మెన్ వీర్లపల్లి శంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బిసిలకు సామాజిక న్యాయం, రాజ్యాధికార హక్కును జనాభా ప్రాతిపదికన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. బీసిలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశంలో బీసిల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటాలు చేస్తుందని వివరించారు. బిజెపి ప్రభుత్వం బీసిలకు న్యాయం చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. బీసిలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ప్రకటించిన కామారెడ్డి డిక్లరేషన్ హామీ మేరకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే శాసలో తీర్మానం చేసి బిసిల 42శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా చర్యలు చేపట్టిందని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో లక్షలాది మంది బీసిలతో భారీ స్థాయిలో ఒబిసి జనగర్జన సభ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బిసిల ఐక్యతను చాటుతూ, సామాజిక న్యాయం సాధించే దిశగా ఈసభ కీలక వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, జెట్టా మహేందర్‌లు పాల్గొన్నారు.



## గాంధీజీ మార్గంలోనే యువత ముందడుగు వేయాలి: ఎమ్మెల్యే శంకర్

**ప్రజాపక్షం/ఫరూక్‌నగర్ :** గాంధీజీ మార్గంలోనే యువత ముందడుగు వేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం తేవడానికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. గాంధీజీ కలలు కన్న ఆశయాలకు అనుకులంగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైజ్ చైర్మెన్ బాబర్ ఖాన్, రఘునాయక్, వెంకట్‌రాంరెడ్డి, బాలరాజుగౌడ్, శ్రీనివాస యాదవ్, నరేష్, దిలీప్ కుమార్, కరుణాకర్, జగదీశ్వర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే సందర్భంగా
చందానగర్‌లో కదం తొక్కిన కలం వీరులు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులు చందానగర్‌లో తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. చందానగర్‌లోని పిజెఆర్ స్టేడియంలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. రంగారెడ్డి జిల్లా యూనిట్, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఎండి సలీమ్ పాషా, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండ విజయకుమార్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. టియూడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలపై నాయకులు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల హక్కులను పరిరక్షించేందుకు నూతన మీడియా కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు గతంలో ఉన్న హక్కులను పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో



జర్నలిస్టుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పనిచేస్తున్న జర్నలిస్టులకు న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టి, విధి నిర్వహణలో వారికి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జర్నలిస్టుల డిమాండ్లను వివరిస్తూ రాష్ట్రపతికి లేఖ పంపించారు. జర్నలిస్టుల హక్కులు, రక్షణ, సంక్షేమానికి సంబంధించిన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎ.శ్రీనివాస్, మాధవ్ రెడ్డి, భీమన్న, భాస్కర్, పాండు యాదవ్, సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నాయకులు శ్రీనివాస్, రవీందర్,నరసింహారావు, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

# కుక్క కాటుకు యాంటీ రేబిస్ టీకా



జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హఫీజ్‌పేట్ ప్రాంతంలో వీధి కుక్కల సంచారం, దాడులు పెరుగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత కొద్ది రోజులుగా చిన్నారులు, వృద్ధులు, ఇతర ప్రజలను వీధి కుక్కలు కరిచిన ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి స్వర్ణకుమారి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ బృందం హాఫీజ్‌పేట్‌లో పర్యటించి స్థానిక ప్రజలకు కుక్కకాటు నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించింది. కుక్కల దాడుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులను ఒంటరిగా బయటకు పంపవద్దని సూచించారు. కుక్క కరిచిన వెంటనే గాయాన్ని నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సూచనల మేరకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఎఆర్‌వి) తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కుక్కకాటు అనంతరం సకాలంలో చికిత్స తీసుకోవడం ద్వారా రేబిస్ ప్రమాదాన్ని నివారించవచ్చని తెలిపారు.

అదేవిధంగా హాఫీజ్‌పేట్ ప్రాంతంలో జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో వెంటనే అనిమల్ బర్త్ కంట్రోల్ (ఎబిసి) కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు, వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా.రాకేష్,హెల్త్ సూపర్‌వైజర్లు, లోకల్ మెడికల్ ఆఫీసర్, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** గాంధీ జయంతి సందర్భంగా వనస్థలిపురంలోని కాంప్లెక్స్‌లో శుక్రవారం హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలని కోనియాడారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొల్లూరి శ్రీనాథ్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**హస్తినాపురంలో :** హస్తినాపురం డివిజన్ పరిధిలోని శ్రీరమణ కాలనీ జడ్పీ రోడ్ వై జంక్షన్‌లో హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీత శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ చైర్మన్ దర్గా శ్రీనివాస్, ఎల్‌బి నగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చింతలపాటి ప్రసాద్, డివిజన్ యూత్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, దినేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాజు గౌడ్, మేడి మహేష్, మల్లేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో :** వనస్థలిపురంలోని కాంప్లెక్స్‌లో మహాత్మా గాంధీ జయంతి వేడుకలను డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిషోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో :** ఉమ్మడి బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్1లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రాపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రావు, నాయకులు శ్రీధర్ రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, సౌమ్య, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

## ఆదర్శ పంచాయతే లక్ష్యం

సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్

**ప్రజాపక్షం/కొత్తూరు :** ఆదర్శ పంచాయతీగా అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నానని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ వివరించారు. శుక్రవారం కొత్తూరు మండల పరిధిలోని పెంజర్ల గ్రామ పంచాయతీలో గ్రామ సభ వాడివేడిగా సాగింది. అంతకు ముందు గాంధీజీ జయంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఆదర్శవంతంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైక లబ్దిదారులకు పూర్తి స్థాయిలో అందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. పెంజర్ల గ్రామంలో కొత్త వేస్తున్న గ్యాస్ పైపులైన్ నిర్మాణాలపై గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్న ప్రజలందరి అమోదంతోనే చేపట్టేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి గౌస్, ఉప సర్పంచ్ శంతన్‌రెడ్డి, వార్డు సభ్యులు మంద మాధవి, భారతమ్మ, ఆర్.రాములు, కె.మైబాజీ, కె.వేదాంత చారి, ఆకనపల్లి మాధవి, ఏఎన్‌ఎం సునంద, అంగన్‌వాడి టీచర్స్ కె.జ్యోతి, ఇందిరమ్మ, మామిడి రాజేందర్‌రెడ్డి, ఆశ వర్కర్ దేశాల లక్ష్మమ్మతోపాటు యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



# రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** స్వార్థ రాజకీయాలకు స్వస్తి పలికి రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉందని షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఫరూక్‌నగర్‌లో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అదే విధంగా లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మెన్ అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని, గాంధీ కలలు కన్న గ్రామ స్వారాజ్యం వైపు యువతను మళ్ళించడంతోపాటు వారి ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, గ్రాంథాలయ కమిటి చైర్మెన్ కొప్పుల మదన్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, దిలీప్, మురళీమోహన్ (అప్పి), చాకలి పెంటయ్య, రాజునాయక్, పి.గోపాల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఇబ్రహీం, నేతలు ముబారక్ అలీ ఖాన్, చందులాల్, శ్రీనివాస్ యాదవ్, నీరటి వాసు, కత్తి చంద్రశేఖర్ అప్ప, జయప్రకాష్, వీరేశం, శేఖర్ రజక, సీతారాం, సాయికుమార్, ప్రకాష్‌లు పాల్గొన్నారు.

**అహింసా మార్గం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం**
**షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

గాంధీజీ ఆశయాలు, ఆహింసా మార్గాలు నేటి సమాజానికి స్పూర్తి దాయకం కావాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టనంలోని ఫరూఖ్‌నగర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి జయంతిని పురస్కరించుకొని పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ గాంధీ చూపిన ఆహింస, సత్యం, సహానం అనే మార్గాలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు వి.నారాయణరెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ చైర్మెన్ కమిటి చైర్ పర్సన్ మన్నె కవిత నారాయణ, బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజన్, మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, గ్రంథాలయ మాజీ చైర్మెన్ లక్ష్మీ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు ప్రసన్నలత వేణుగోపాల్, శారద శేఖర్, జయలక్ష్మీ కిషోర్‌లు పాల్గొన్నారు.



**కొత్తూరులో..** మహాత్మాగాంధీ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కొత్తూరు, నందిగామ మండల కేంద్రాల్లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, కుమారస్వామి గౌడ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ వైస్ చైర్మెన్ డోలి రవీందర్, మాజీ కౌన్సిలర్లు మాదారం నర్సింహ్మా గౌడ్, సోమ్లా నాయక్, అనిత శ్రీనివాస్ గౌడ్, మాధవి గోపాల్ గౌడ్, బ్యాగరి ప్రసన్న లత యాదయ్యతోపాటు చంద్రపాల్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్‌లు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష



ప్రజాపక్షం/అమీర్‌పేట్: రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల పట్ల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పార్టీ శ్రేణులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు అమీర్‌పేట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో రాబోయే పట్టభద్రుల ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై ఎస్ఆర్‌నగర్ లోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్ ప్రెసిడెంట్లకు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు దరఖాస్తు ఫారమ్‌లను పంపిణీ చేశారు. డివిజన్ వ్యాప్తంగా అర్హులైన ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని శేషుకుమారితో పాటు నాయకులు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కూతురు నరసింహ, వనం శ్రీనివాస్, ఎం.హనుమంతరావు, ప్రవీణ్‌రెడ్డి, హరిసింగ్ జాధవ్, లక్ష్మి బాస, రాణి కౌర్, సంపత్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఉషు పోటీలకు వైష్ణవి ఎంపిక



ప్రజాపక్షం/గోషామహల్: జాతీయ స్థాయి ఉషు పోటీలకు బాత్క వైష్ణవి ఎంపికైంది. రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని రెడ్‌హిల్స్‌లోని జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వైష్ణవి అద్భుత ప్రతిభ కనబరిచింది. అండర్17 విభాగంలో, 56 కిలోల కేటగిరీలో రాణించి ఈ ఘనత సాధించింది.ఈ ఏడాది అక్టోబర్ 15 నుంచి 19 వరకు శ్రీనగర్‌లో జరగనున్న 70వ ఎస్జీఎఫ్ జాతీయ ఉషు ఛాంపియన్ షిప్లో వైష్ణవి తెలంగాణ రాష్ట్రం తరపున బరిలోకి దిగనుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని తెలంగాణ రాష్ట విద్యాశాఖ కమిషనర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ నవీన్ నికోలస్ ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయికి ఎంపికైన వైష్ణవిని మండల విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణు ప్రియ, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## ఎగ్జిబిషన్ సొసైటీ కార్యవర్గానికి సన్మానం



ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: ఎగ్జిబిషన్ సొసైటీకి నూతనంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను రామాయణ మేళా ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కమిటీ వైస్ ప్రెసిడెంట్ నరోత్తంరెడ్డి, సెక్రటరీ ఎ.రాజేంద్ర కుమార్, జాయింట్ సెక్రటరీ ద్వీనకుమారి, కోశాధికారి జ్ఞానేంద్రకుమార్, రాజశేఖర్లను రామాయణ మేళా తరపున శాలువాకప్పి, తలపాగా, జ్ఞాపికలతో పాటు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామాయణ మేళా కమిటీ చీఫ్ కో ఆర్డినేటర్, రాజస్థానీ ప్రగతి సమాజ్ ప్రధాన కార్యదర్శి గోవింద్ నారాయణ్ రాఠీ, రామాయణ మేళా కోశాధికారి గిర్ధారి లాల్ దాగా, పబ్లిక్ కోఆర్డినేటర్ మనోజ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు పాతర



ప్రజాపక్షం/అమీర్‌పేట్: నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలు అమీర్‌పేట్ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలోనే మినర్వా కాంప్లెక్స్ పక్కనే యథేచ్ఛగా అక్రమ నిర్మాణం జరుగుతున్నా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఎసిపి టి.రమేష్ నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలున్నాయి. కొండాపూర్ ఘటనను దృష్టిలో ఉంచుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని స్థానికులు ఫిర్యాదు చేసినా ఎసిపి రమేష్ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అత్యంత రద్దీగా ఉండే వాణిజ్య ప్రాంతంలో జరుగుతున్న ఈ నిర్మాణంలో సేఫ్టీ నెట్లు, స్ట్రక్చరల్ క్లియరెన్స్, కనీస సెట్‌బ్యాక్ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపణలున్నాయి. ఇకనైనా సంబంధిత ఖైరతాబాద్ జెడ్‌సి దృష్టి సారించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## 2 నుంచి 4 వరకు సేవా సేతు అభియాన్ నిర్వహణ




ప్రజాపక్షం/వెంగళరావునగర్: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు. టిమ్స్ సనత్‌నగర్‌లో వినియోగదారుల కోసం ఏర్పాటు చేసిన అవగాహన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 2 నుంచి 4 వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమం ద్వారా గృహ వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, దరఖాస్తు విధానం, పథకం ద్వారా లభించే ప్రయోజనాలపై సమగ్ర సమాచారం ప్రజలకు అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ డివిజన్ టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ ఎవి రామారావు, ఐసిఎస్‌సి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ స్వాతి, అమీర్‌పేట్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహనీయులకు ఘననివాళి






ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: జాతిపిత మహాత్మాగాంధీ జయంతి.. దేశ మాజీ ప్రధాన మంత్రి లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు వాడవాడలా నిర్వహించారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతో పాటు వివిధ ప్రాంతాలలో ఏర్పాటైన కార్యక్రమాల్లో దేశానికి వారు అందించిన సేవలను స్మరించుకుని ఘనంగా నివాళ్లు అర్పించడం జరిగింది. ఈ మేరకు ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహానికి టిపీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బేగంపేట్ డివిజన్ సీనియర్ నాయకుడు విశాల్ సూదం, రాంగోపాల్ పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ త్రికాల ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతియుత మౌన ప్రదర్శన కార్యక్రమానికి సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇదిలాఉండగా...గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించిన సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. శాంతి మార్గంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని మన దేశం నుంచి తరిమికొట్టిన మహామనిషి గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో కవాడిగూడా డిసి పుష్పలత, హార్టికల్చర్ అధికారి రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్‌లు అత్తిలి మల్లిఖార్జున్‌గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, టి.మహేశ్వరి, కిరణ్మయి, డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, తలసాని ధర్మేందర్ యాదవ్, కుర్మ హేమలత, పద్మారావునగర్ డివిజన్ బిఆర్ఎస్ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, వెంకటరమణ, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, అంబికా, కౌసల్య, దుర్గ తదితరులు పాల్గొన్నారు.బల్కంపేట్‌లో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. అమీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు జి.శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం.నవీన్ రాజ్, గోవింద్ రాజ్, పాండు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా టిటిడిపి హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో జరిగిన వేడుకల్లో గాంధి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా టిటిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నల్లెల్ల కిషోర్ మాట్లాడుతూ.. అహింసా పరమో ధర్మం అనే పవిత్ర సూక్తిని విశ్వసించి గాంధీ ముందుకు సాగారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంకె బోసు, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ క్రమంలోనే గాంధీ,మాజీ ప్రధాని శాస్త్రి జయంతులను పురస్కరించుకుని మిత్ర యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌పి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో గౌలిపుర గాంధీ విగ్రహానికి, శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు బి.కోటేష్, మిట్ట రవీందర్, బి.కార్తిక్ చారి, దుర్గా ప్రసాద్, ఎస్.ప్రణీత్, టి.శ్రీనివాస్, నరేష్ చారి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. కాగా... వెంగళరావునగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ పి.రాధా రెడ్డి, కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్, ఏఐసీసీ జాతీయ కో ఆర్డినేటర్ డా.పివి రవిశేఖర్‌రెడ్డి తదితరులు గాంధీకి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కాలనీ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ, కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రంగారావు, ఉపాధ్యక్షుడు సారంగారావు, ట్రెజరర్ లక్ష్మీ కాంతారావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ప్రదీప్ కుమార్, కుటుంబరావు, నాగరాజు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోస విన్నారు.. గూడు కల్పించారు.. గుండెల్లో నిలిచారు..

ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం బాచుపల్లి 2బీహెచ్‌కే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద్ హాజరై కేక్ కట్ చేసి లబ్ధిదారులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో పేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించి, లబ్ధిదారులకు పట్టాలను అందించిన విషయానిన గుర్తుచేసుకున్నారు. సొంతింటి కలను సాకారం చేసి ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లిన ఘనత కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. పేదల గోస విని వారికి గూడు కల్పించిన నాయకుడు కెసిఆర్ అని పేర్కొన్నారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి పథంలో పయనించాలంటే కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల సత్యనారాయణ, జయరాజు, మోహన్, దుర్గాప్రసాద్, మల్లేష్, నరసింహాగౌడ్, లక్ష్మ ణ్, శ్రీకాంత్, బద్రీనాథ్, రామారావు, శివ, నరసింహులు, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు ఎమ్మెల్సీ ఇవ్వకుంటే గుణపాఠం చెప్తాం

### రెండు స్థానాలూ రెడ్లకివ్వడాన్ని ఖండిస్తున్నాం : ఎంపి ఆర్.కృష్ణయ్య



ప్రజాపక్షం/హిమాయత్‌నగర్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక స్థానాన్ని బిసిలకు కేటాయించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు ఎంఎల్‌సి స్థానాలను రెడ్లకే కేటాయించడాన్ని ఖండిస్తున్నామని, ఇది బిసిలకు అన్యాయం చేయడమేనన్నారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య విచ్చేసి, మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గంలో కేవలం ఇద్దరు బిసిలకు ప్రాధాన్యం లేని మత్స్య, బిసి, పశుసంవర్ధక శాఖలు కేటాయించి బిసిలను అవమానపరిచారన్నారు. ఇటీవల ఆరుగురి సమాచార కమిషనర్ల నియామకంలో ఒకటి కూడా బిసిలకు ఇవ్వకపోవడం బిసిల అణచివేసే చర్యగా భావిస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసి వ్యతిరేక వైఖరి మార్చుకోవాలని,లేదంటే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎపి ప్రభుత్వం బిసిలకు 37శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధం చేస్తే హైకోర్టు కొట్టివేయడం బాధాకరమన్నారు. బిసిల 37శాతం రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధం చేసేందుకు వెంటనే ఎపి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచాలని కోరారు. సమావేశంలో బిసి సంఘం అధ్యక్షులు సి.రాజేందర్, విద్యార్థి సంఘం కన్వీనర్లు మోదీ రాందేవ్, నిఖిల్ పటేల్, నేతలు భీంరాజు, పల్లం యాదయ్య, రఘుపతి, రామాంజనేయులు, బిసి ఎపి కార్యదర్శి ఎంకె.రంగస్వామి, రమణయ్య పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సులో రాణాకు..

### సామాన్యుడిలా ప్రయాణం సిఐ ప్రభాకర్



ప్రజాపక్షం/జూబ్లీహిల్స్: పోలీసు అధికారి అంటే అధికారిక వాహనం, హంగూ ఆర్భాటం ఉండాల్సిందేననే భావనకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు మధురానగర్ సిఐ హెచ్.ప్రభాకర్. అధికార దర్పానికి దూరంగా ఉంటూ సామాన్యుడిలా ప్రజల మధ్య ప్రయాణిస్తూ విధులు నిర్వహిస్తున్నారు. పోలీసు శాఖ వాహనాన్ని వ్యక్తిగత రాకపోకలకు వినియోగించకుండా పొదుపు పాటిస్తున్నారు.నాగోల్‌లోని తన ఇంటి నుంచి ప్రతిరోజూ మెట్రో రైలులో యూసుఫ్‌గూడకు చేరుకుని, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నారు. విధులు ముగిసిన తర్వాత కూడా ఇదే విధంగా ప్రజా రవాణాను వినియోగిస్తూ ఇంటికి వెళ్తున్నారు. మఫ్టీలో సామాన్యుడిలా ప్రయాణించడంతో ప్రజలతో మమేకమవ్వడంతో పాటు క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా గమనించే అవకాశం కలుగుతోందని ఆయన భావిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సమయంలో మహిళలను వేధించే ఆకతాయిలు, జేబుదొంగలు, గొలుసు దొంగతనాలకు పాల్పడే వారి కదలికలను గుర్తించే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. వ్యక్తిగత రాకపోకలకు ప్రభుత్వ వాహనాలను ఉపయోగించకుండా ప్రజా రవాణాను ఆశ్రయిస్తూ ప్రభుత్వ వాహనాల ఇంధన వ్యయాన్ని తగ్గించేందుకు సిఐ ప్రభాకర్ చేస్తున్న ప్రయత్నం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

## సేవా కార్యక్రమాల్లో 20 ఏళ్ల ప్రస్థానం




ప్రజాపక్షం/బోరబండ: సామాజిక సేవే లక్ష్యంగా గడచిన 20 ఏళ్లుగా సేవాభారతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని.. ఇప్పటివరకు సుమారు రూ.2 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు రుద్రా ఫౌండేషన్ సీఈఓ శ్వేత తెలిపారు. తాజాగా నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 130 మంది పేద విద్యార్థులకు చెక్కుల రూపంలో ఆర్థిక సాయం, 44 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు, కొందరు పేద విద్యార్థులకు విద్యా సామగ్రి, యూనిఫాంలు అందజేశారు. మోతీనగర్ శంకరమఠం ప్రాంగణంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎంఎల్‌ఏ మాదవరం కృష్ణారావు, ఐటీబీ సీజీయం ఎస్.గోపాల్, రుద్రా ఫౌండేషన్ సీఈఓ శ్వేత, తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, ట్రస్ట్ ప్రతినిధులతో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌కు వంతపాడటం సిగ్గుచేటు : రాచాల



ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు వంత పాడటం ఆపాలని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ఘాటుగా హెచ్చరించారు. ఎక్సైజ్‌శాఖలో జరిగిన అవినీతిని, అక్రమాలను నిలదీయడానికి పదవులే ఉండాల్సిన అవసరం లేదనే విషయాన్ని గెజిటెడ్ అధికారుల సంఘం నేతలకు తెలియకపోవ డం సిగ్గుచేటన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ యూ నియన్ నేతలు కూడా ఈ విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. హైదరాబాద్ బషీర్‌బా గ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ లో బదిలీల అవకతవకలపై చర్చించడానికి రావాలని గెజిటెడ్, బార్ అండ్ రెస్టారెంట్ యూనియన్ నేతలక సవాల్ విసిరారు. టిడిఎస్ క్లెయిమ్ కోసం కమిషనర్ ప్రతి బార్ అండ్ వైన్ షాపు నుం చి రూ .35 వేలు వసూలు చేస్తున్న విషయం బయటపెడతామన్నందుకే ప్రిన్సిపల్ సెక్రటరీ ఆన్‌లైన్ చేశార ని గుర్తుచేశారు. దీంతో రూ.14 కోట్ల అవినీతిని ఆ పగలిగామని పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖలో అక్రమ బదిలీలపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి జూపల్లి కృష్ణారావు, సిఎం రేవంత్ రెడ్డికి రాచాల విజ్ఞప్తి చేశారు. సమావేశ ంలో జెఎసి నేతలు వివి గౌడ్, కృష్ణ ప్రసాద్, శ్రీటధర్, సిద్ధార్థ్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పలు కాలనీల్లో అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/చర్లపల్లి:చర్లపల్లి డివిజన్ పరిధిలోని మోడీ విస్టా హోమ్స్,ఇసీ నగర్,శుభోదయ నగర్ కాలనీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.మోడీ విస్టా హోమ్స్‌కు సంబంధించిన కనెక్టింగ్ రోడ్ల పనులు,ఇసీనగర్‌లో జరుగుతున్న రోడ్లు,స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు,శోభోదయ నగర్ కాలనీలో రోడ్లు,స్ట్రీట్ లైట్లు,పారిశుధ్యం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పనుల పురోగతిని సంబంధించిన అధికారులు,సిబ్బందిని అడిగి తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు,పట్టణ పార్టీ అధ్యక్షులు బాతుల నాగు నాయకులు ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ముదుమాల్ చారిత్రక అభివృద్ధికి సహకారం

### నారాయణపేట కలెక్టర్ హామీనిచ్చినట్టు వేదకుమార్ వెల్లడి



ప్రజాపక్షం / హైదరాబాద్: ముదుమాల్ బృహత్ శిలాయుగ స్థల అభివృద్ధి, పరిరక్షణకు సహకారం అందిస్తామని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక హామీనిచ్చినట్టు దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టు చైర్మన్ ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ తెలిపారు. శుక్రవారం తాను తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జున్‌రావుతో కలిసి నారాయణపేట కలెక్టర్‌ను కలిసినట్టు ఆయన శుక్రవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో మీడియాతో చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పలు ప్రతిపాదనలతో వినతి పత్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు. ముదుమాల్ చారిత్రక, పురావస్తు ప్రాధాన్యంపై నారాయణపేట జిల్లా ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించాలని కోరారు. ముదుమాల్‌కు రవాణా సదుపాయానికి బీటీ రోడ్డు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ స్థలానికి ప్రాచుర్యం కల్పించేందుకు, వారసత్వ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ముదుమాల్‌లో ప్రతి ఏడాది రెండు సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. తమ ప్రతిపాదనలపై కలెక్టర్ సుముఖత వ్యక్తం చేసినట్టు వేదకుమార్ తెలిపారు.

## సమితి ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం/వెంగళరావునగర్: మధురానగర్ సంక్షేమ సమితి 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన బాలబాలికలు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన జూబ్లీహిల్స్ ఏసిపి(ట్రాఫిక్) కట్టా హరిహార ప్రసాద్ మాట్లాడుతూ.. కాలనీని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలను పెంచి పచ్చదనాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు దిల్ రమేష్, ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.సాంబశివరావు, సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి మన్నే కళ్యాణ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు సీహెచ్.సత్యనారాయణ రాజు, కోశాధికారి జీవి కృష్ణ, సహాయ కార్యదర్శి హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయవాణి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌పై అవగాహన



ప్రజాపక్షం/సనత్‌నగర్: సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న డ్రగ్స్ మహమ్మారిపై యువతలో అవగాహన పెంచేందుకు గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛంద సంస్థ (వాలంటీర్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక జూనియర్ ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు 'యూత్ పై డ్రగ్స్ ప్రభావం' అనే అంశంపై వ్యాస రూప పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ సిఐ పరశురామ్, శ్యాంసుందర్ గౌడ్, అమీర్‌పేట్ మాజీ కార్పొరేటర్ సరళ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ పరశురాం మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, ముఖ్య నాయకులు సుబ్బరాజు, చందు, సునీల్, బిల్డర్ రాజా, సదాశివ్ యాదవ్, విశ్వనాథరాజు, వీరయ్య, నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, భానోజీరావు, ఇబ్రహీం, ఆంజనేయులు, శారద, ఆశా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్ గ్రామ మత్స్య పారిశ్రామిక శాఖ అధ్యక్షుడిగా తలారి వీరేశ్ ముదిరాజ్

ప్రజాపక్షం/ నిజాంపేట్ : మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ గ్రామ మత్స్య పారిశ్రామిక శాఖ కమిటీని ఎన్నికల విప్ అయిన బొర్ర చందు ముదిరాజ్ ప్రకటించారు. నిజాంపేట్ మత్స్య పారిశ్రామిక శాఖ అధ్యక్షునిగా తలారి వీరేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షునిగా బొర్ర రమేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా రాజులు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తలారి వీరేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ మత్స్య కారుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అధికారులకు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానని అన్నారు. మత్స్య కార్మికులకు, ముదిరాజ్ కులస్థులకు ప్రభుత్వ పరంగా వచ్చే నిధులు, సంక్షేమ పథకాలను అందేవిధంగా కృషి చేస్తానని తెలిపారు. తన పై నమ్మకంతో ఈ పదవిని నియమించినందుకు ప్రతిఒక్కరికి కృతజ్ఞతలను తెలిపారు.

## ఎస్‌పిడిసిఎల్‌లో గాంధీ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: మహాత్మా గాంధీ జయంతి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి పురస్కరించుకుని వారికి టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. టీజీఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్ మహనీయుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారి సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్(కమర్షియల్) సి.చక్రపాణి, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) వి.శివాజీ, డైరెక్టర్(ఫైనాన్స్) కృష్ణారెడ్డి, చీఫ్ ఇంజనీర్ (కమర్షియల్) ప్రతిమ షోలే, చీఫ్ ఇంజనీర్ (ఐటీ) శివాజీ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా.. నిమ్స్‌లో గాంధీ జయంతి వేడుకలు డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్‌దేవరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

## మహాత్ముడికి ముర్ము, మోదీ నివాళి



**న్యూఢిల్లీ:** మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయనకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్రమోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ముర్ము, మోదీ ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌ను సందర్శించి... మహాత్ముడి స్మారకం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాపూజీ సేవలను, ఆయన అనుసరించిన శాంతి, అహింసా మార్గాలను ప్రధాని గుర్తుచేసుకున్నారు. ప్రధానితో పాటు కొంతమంది కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులు, ప్రముఖులు రాజ్‌ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ గాంధీ జయంతి వేడుకలు, స్వచ్ఛ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. మరోవైపు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని విజయ్ ఘాట్‌ను సందర్శించి అంజలి ఘటించారు. దేశానికి లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలను, ఆయన నాయకత్వ పటిమను గుర్తుచేసుకున్నారు.

## కండక్టరుగా మారిన సిఎం విజయ్

డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌ల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం



**చెన్నై:** తమిళనాడులో ఉచిత బస్సు పథకాన్ని విస్తరించారు. గాంధీ జయంతి సందర్భంగా 'వెట్రి పయనం' పథకాన్ని శుక్రవారం సిఎం విజయ్ ప్రారంభించారు. ఉచిత బస్సు పథకం ద్వారా సుమారు 84 లక్షల మంది మహిళలు లబ్ధి పొందనున్నారు. డీలక్స్, ఎక్స్‌ప్రెస్ కేటగిరీ బస్సుల్లోనూ ఇక నుంచి మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చు. వెట్రి పయనం అంటే విజయవంతమైన ప్రయాణం అని అర్థం వస్తుంది. ఇది మహిళల విజయం అన్న రీతిలో విజయ్ సర్కారు వివరణ ఇచ్చింది. తమిళనాడులో ఉన్న ఏడు రాష్ట్ర రవాణా సంస్థలకు చెందిన 12,695 బస్సులకు ఈ పథకం వర్తించనుంది. పథకం ప్రారంభోత్సవం సందర్భంగా బస్సు ప్రయాణికులతో సిఎం మాట్లాడారు. ఆయన కండెక్టర్‌లా మారి బస్సులోని మహిళలకు టికెట్లు కూడా ఇచ్చారు. రవాణా శాఖ మంత్రి ఎ. విజయ్ తమిళన్ పార్తిబన్ మాట్లాడుతూ... మహిళలు, ట్రాన్స్‌జెండర్ల విద్య, ఉపాధి, ఉద్యోగం, ఆర్థిక సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలు ఆలోచించి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని ఆయన అన్నారు. గతంలో ఉచిత బస్సు పథకం కొన్ని ప్రత్యేక బస్సులకు మాత్రమే ఉండేది. ఇప్పుడు ఆ పథకాన్ని మరిన్ని కేటగిరీలకు విస్తరించారు. ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్, మఫిసిల్ ఆర్డినరీ, ఘాట్ ఏరియా సర్వీసులకు వర్తించనున్నది.

## దేశాన్ని కాపాడుకుందాం
# వామపక్షాల భారీ నిరసన ప్రదర్శన

జ్ఞానేశ్ కుమార్ ఆర్ఎస్ఎస్ ఏజెంటని విమర్శ




**కోల్‌కతా:** నాథూరామ్ గాడ్సే మద్దతుదారుల నుంచి గాంధీ, నేతాజీల భారతదేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిస్తూ శుక్రవారం కోల్‌కతాలో వామపక్ష పార్టీలు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. అక్టోబర్ 2 నుంచి 8 వరకు దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణకు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఇండియా ఐక్య సంఘటన ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. తొలుత రాణి రాస్మణి అవెన్యూ వద్ద సిపిఎం పోలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీదీప్ భట్టాచార్య అధ్యక్షతన జరిగిన సభలో ఆ పార్టీ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం మాట్లాడుతూ... 'నేడు మహాత్మా గాంధీ జయంతి. మన స్వాతంత్ర్య పోరాటం, ప్రజా ఉద్యమాలు ఒక్కటై 190 ఏళ్ల బ్రిటిష్ పాలనకు ముగింపు పలికాయి. ఆ స్వాతంత్ర్య పోరాటమే మన రాజ్యాంగానికి పునాది. కానీ నేడు ఆ రాజ్యాంగాన్ని, ప్రజల ప్రాథమిక హక్కులను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది' అని మండిపడ్డారు. 'మోదీ ప్రభుత్వం దేశ సార్వభౌమాధికారాన్ని అమెరికా సామ్రాజ్యవాదానికి తాకట్టు పెట్టిందని ఆరోపించారు. మన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని, స్వాతంత్ర్య పోరాట గొప్పదనాన్ని నాశనం చేస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న ఓటు హక్కును బెంగాల్‌లో వామపక్షాలు 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించాయి. కానీ నేడు ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని బిజెపి ప్రజల ఓటు హక్కును లాక్కుంటోంది' అని సలీం ఆరోపించారు. గతంలో ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేసేది. కానీ నేడు జ్ఞానేశ్ కుమార్‌ను ఆ కుర్చీలో కూర్చోబెట్టి రాజ్యాంగ హక్కులను హరించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఓటర్లల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనేది ఏ రాజ్యాంగ వ్యవస్థ కాదని మేము చెప్పాం. కానీ అమిత్ షా నిర్దేశించిన విధానాల ప్రకారం లక్షలాది మంది ప్రజల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. జ్ఞానేశ్ కుమార్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు అని సలీం విమర్శించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తొలగించిన ఓటర్ల పేర్లను పునఃపరిశీలించి మళ్లీ చేర్చాలని సీఈఓ కార్యాలయాలకు ఇచ్చిన ఆదేశాలపై సలీం స్పందిస్తూ 'కమిషన్ ఇప్పుడు తాను చేసిన తప్పును తానే సరిదిద్దుకోవాల్సిన పరిస్థితికి వచ్చింది' అని ఎద్దేవా చేశారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ప్రతి ఒక్కరికీ తిరిగి ఓటు హక్కు కల్పించాలని, సంఘ్ పరివార్ మాటలు వింటూ పనిచేస్తున్న జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. 'యువత నేడు తిరుగుబాటు బాట పట్టింది. మోదీషా జోడీ వారిని అణచివేయాలని చూస్తున్నారు. కానీ బ్రిటిష్ వారు కూడా సాధించలేనిదాన్ని వీరు సాధించలేరు. వంద సంవత్సరాల క్రితం 'పథేర్ దాబీ' పుస్తకాన్ని బ్రిటిష్ వారు నిషేధించినా నిరసనలను ఆపలేకపోయారు'' అని సలీం స్పష్టం చేశారు. కాగా, నిరసన ప్రదర్శనలో నేతాజీ విగ్రహానికి పూలమాల వేసేందుకు రాష్ట్ర యంత్రాంగం అనుమతించలేదు. రాణి రాస్మణి వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన కోల్‌కతా ప్రెస్ క్లబ్ వద్దకు చేరుకోగానే పోలీసులు అడ్డుకున్నారు.

## 'ఇండియా' ఐక్యత అద్భుతం

2029 లోక్‌సభ ఎన్నికలు వేరే కథగా ఉంటాయి: ఖుర్షీద్




**న్యూఢిల్లీ:** న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన సమావేశం అనంతరం ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన 'అద్భుతంగా' ఏకమవుతోందని, 2029లో జరగబోయే లోక్‌సభ ఎన్నికలు 'వేరే కథగా' ఉంటాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సల్మాన్ ఖుర్షీద్ శుక్రవారం అన్నారు. ఈ కూటమి వల్ల తాము ఏమి పొందగలమనే దాని కంటే, దానికి ఎలా తోడ్పడాలనే దానిపై ప్రతిపక్ష నాయకులు దృష్టి సారిస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి తెలిపారు. ప్రతిపక్ష కూటమి భవిష్యత్ గురించి అడిగినప్పుడు 'రెండు రోజుల క్రితం ఇండియా కూటమి సమావేశమయింది. వారి మధ్య గొప్ప సంఘీభావం వ్యక్తమయింది' అని ఖుర్షీద్ ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. 'గతంలో మేమంతా వేర్వేరు దిశల్లో పయనిస్తున్నామనే భావన ఉండేది. కానీ రెండు రోజుల క్రితం ఇలా ఒక్కటవ్వడం విశేషం' అని ఆయన అన్నారు. జాతీయ రాజధానిలో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్, టిఎంసిలోని మమతా వర్గం, ఎస్‌పి, సిపిఐ, సిపిఎం, ఎన్‌సిపి(ఎస్‌పి), శివసేన (బీటీ) తదితరులు హాజరయ్యారని ఆయన తెలిపారు. 'తాము ఏమి పొందగలం అనే దానిపై కాకుండా, కూటమికి ఏమి అందించగలం' అనే దక్పథంతో కూటమి నాయకులు ఇప్పుడు 2029 ఎన్నికలకు ఎలా సిద్ధం కావాలో ఆలోచిస్తున్నారని ఖుర్షీద్ అన్నారు. అందరూ చిత్తశుద్ధితో, శ్రద్ధతో సహకరిస్తే, 2029 ఒక విభిన్నమైన కథగా ఉంటుంది' అని ఆయన తెలిపారు.

## ఎస్‌పి-కాంగ్రెస్ కూటమి కలిసే ముందుకు: అఖిలేశ్



**లక్నో:** అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమి ముందుకు సాగుతుందని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ శుక్రవారం నొక్కి చెప్పారు. బిజెపిని ఓడించేందుకు ప్రతిపక్షాల ప్రయత్నాలలో చేరడానికి సిద్ధంగా ఉన్న ప్రత్యర్థి శిబిరాల నాయకులను తన పార్టీలోకి స్వాగతించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నారు. 'గత తప్పులను మరచిపోవడానికి' ఎన్నికలు సరైన సమయమని ఆయన తెలిపారు. 'ఇది రాజ్యసభ ఎన్నికల సమయం. ఎన్నికలు అంటే అందరూ కలిసికట్టుగా ఉండే సమయం. గత తప్పులను మరచిపోవడానికి, ఇతరులతో కలిసి నిలబడటానికి, సూత్రాల కోసం నిలబడటానికి ఇది ఒక అవకాశాన్ని అందిస్తుంది' అని లక్నోలో అఖిలేశ్ మీడియాతో అన్నారు. 'పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పెట్రోల్‌లో ఈ20 కలపడం వంటి కారణాల వల్ల మన ప్రజాస్వామ్యం, మన రాజ్యాంగం, మన దేశ ఆర్థిక వ్యవస్థపై దాడి జరుగుతోందని ఎవరైనా భావిస్తే... ఇవి (కేంద్రం తీసుకున్న) తప్పుడు నిర్ణయాలను వారు విశ్వసిస్తే, అప్పుడు రాజ్యసభ, అసెంబ్లీ ఎన్నికలకు ముందు మనమందరం ఏకం కావాల్సిన సమయం ఇది. అందుకే ఈ సమయంలో మనం అన్ని విద్వేషాలను మరచిపోవాలి' అని ఆయన అన్నారు. తమ మార్గం నుంచి పక్కకు మళ్లిన వారిని, మాతో చేరాలనుకుంటున్న మా మిత్రులను, గతంలో జరిగినదంతా మేము మరచిపోతామని అఖిలేశ్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష కూటమి సమావేశానికి హాజరు కానందుకు బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ ఆయనను విమర్శిస్తూనే ఉన్నప్పటికీ, ఇండియా ఐక్య సంఘటన ప్రతిపాదించిన 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' యాత్రకు ఆయన మద్దతు తెలిపారు. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి' ప్రతిఒక్కరూ ఏకం కావాలి. ఈ అందమైన దేశాన్ని, దాని గొప్ప ప్రజాస్వామ్య చరిత్రను, మన రాజ్యాంగాన్ని కాపాడటానికి మనమందరం కలిసి ముందుకు రావాలి' అని ఆయన అన్నారు. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో పొత్తు పెట్టుకునే అవకాశం గురించి అడగగా, తమ పార్టీ ప్రస్తుతమున్న 'ఇండియా' కూటమితోనే ముందుకు వెళుతుందని అఖిలేశ్ అన్నారు. 'సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమి 2027లో ముందుకు సాగుతుంది. మేము 'ఇండియా' కూటమితోనే ముందుకు వెళతాము' అని ఆయన స్పష్టం చేశారు.

## నేటి నుంచి ఎస్‌కెఎం 'గ్రామ మహాపంచాయతీ'

'సర్', ఓటు హక్కులను లేవనెత్తనున్న రైతు సంఘం

**న్యూఢిల్లీ:** ఎన్నికల హక్కులకు సంబంధించిన పోరాటాన్ని కేవలం రాజకీయ పార్టీలు, కార్యకర్తలకు మాత్రమే వదిలేయ వద్దని అఖిల భారత కిసాన్ సభ నాయకుడు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) సభ్యుడు పి. కృష్ణప్రసాద్ అన్నారు. ఈ పోరాటాన్ని ఒక విస్తృత ప్రజా ఉద్యమంగా గ్రామాలకు, కర్మాగారాలకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. శనివారం నుండి గ్రామ స్థాయి మహా పంచాయతీలలో 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) అంశాన్ని లేవనెత్తడానికి ఎస్‌కెఎం సన్నద్ధమవుతున్న తరుణంలో కృష్ణప్రసాద్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి ఎస్‌కెఎం దేశవ్యాప్తంగా గ్రామ మహా పంచాయతీలను నిర్వహించనుంది. ఈ గ్రామ సమావేశాల్లో ఆమోదించడం కోసం ఎస్‌కెఎం మూడు తీర్మానాలను ప్రతిపాదించింది: 2021 డిసెంబర్ 9న కేంద్రం తమ సంఘానికి ఇచ్చిన లిఖితపూర్వక హామీని అమలు చేయడం, 2020-21 ఆందోళన సమయంలో మరణించిన రైతుల కోసం సింఘు సరిహద్దు వద్ద స్మారక చిహ్నాన్ని నిర్మించడం, సర్ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపించబడుతున్న అక్రమాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించి ఆయనపై చర్యలు తీసుకోవడం. పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), వ్యవసాయ రుణ మాఫీ, భూ హక్కుల వంటి సాంప్రదాయ వ్యవసాయ డిమాండ్లతో పాటు, సర్ అంశాన్ని కూడా ఈ చర్చల్లో భాగం చేయాలని ఆ సంఘం యోచిస్తోంది. ఈ సమావేశాలు అక్టోబర్ 23 వరకు కొనసాగుతాయి. నవంబర్ 26 నుండి రైతు పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని ఎస్‌కెఎం భావిస్తున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో ప్రజలను సమీకరించడం కూడా ఈ సమావేశాల ఉద్దేశ్యం. ఎంఎస్‌పి, ఇతర రైతు డిమాండ్ల వంటి ప్రధాన రాజకీయ అంశాలతో పాటు, సర్ అంశం కూడా ఇప్పుడు తెరపైకి వచ్చింది. ఇది కేవలం మా డిమాండ్ల కోసం నిరసన తెలిపే విషయం మాత్రమే కాదు; నిరసన తెలిపే హక్కుకే ముప్పు వాటిల్లింది, అలాగే ఓటు హక్కుతో సహా ప్రజాస్వామ్య హక్కులు కుదించబడుతున్నాయి అని కృష్ణప్రసాద్ పిటిఐతో అన్నారు. 'పౌరులకు ఓటు హక్కు ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. కానీ ఇప్పుడు అది నిబంధనలను శాసిస్తోంది. మనం గ్రామాలకు, కర్మాగారాలకు వెళ్లి ఒక వర్గ, ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి అని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల తొలగింపుల ఆరోపణల స్థాయి ఈ సమస్యను విస్తృత ప్రజాస్వామ్య ఆందోళనగా మార్చిందని కృష్ణప్రసాద్ అన్నారు. 'రైతుల పోరాటం, విద్యార్థుల పోరాటం తర్వాత, ప్రజాస్వామ్య హక్కుల కోసం చేసే పోరాటం మరింత పెద్ద సమస్యగా మారుతుంది' అని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు.

## లధాఖ్‌లో 28 ఉద్రిక్త ప్రాంతాల గుర్తింపు



**న్యూఢిల్లీ :** లధాఖ్ కేంద్రపాలిత ప్రాంతంలోని 28 ప్రదేశాలు, భౌగోళిక అంశాలను కేంద్రం అధికారిక మ్యాప్‌లో గుర్తించింది. ఈ మేరకు 'సర్వే ఆఫ్ ఇండియా' (ఎస్ఒఐ) అధికారిక మ్యాప్‌లో చేర్చుతున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ వెల్లడించింది. అక్కడి యంత్రాంగంతో సంప్రదింపులు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. వీటిని అధికారిక మ్యాప్‌లో గుర్తించడం ద్వారా కచ్చితమైన గుర్తింపుతో పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం సాధ్యమవుతుందని తెలిపింది. ఎల్ఎసి (వాస్తవ నియంత్రణ రేఖ) వెంబడి ఉన్న గోగ్రా, హాట్ స్ప్రింగ్ వంటి కీలకమైన సరిహద్దు ఉద్రిక్తత ప్రాంతాలతో కలిపి మొత్తం 28 వ్యూహాత్మక ప్రదేశాలు, భౌగోళిక అంశాలను కేంద్రం అధికారిక భారతీయ మ్యాప్‌లో గుర్తించింది. కేంద్రం గుర్తించిన 28 ప్రదేశాలు, భౌగోళిక లక్షణాల్లో శిఖరాలు, పర్వత శ్రేణులు, కనుమలు, హిమానీనదాలు, లోయలు, నదులు, సరస్సులు, భూభాగాలు ఉన్నాయి. ఆ జాబితాలో అతిషా గిరి (శిఖరం), బ్రాంగ్సా భూభాగం (ప్రాంతం), చాప్‌చింగల్ కనుమ (కనుమ), కనిష్క శిఖరం (శిఖరం), కరుణ్ పిర్ (పర్వతం), కుక్సెల్ (భూభాగం), మార్తాండ గిరి (శిఖరం), పర్సిక్ (హిమానీనదం), స్క్రామి హిమానీనదం (హిమానీనదం), షాచ్మిర్క్ కనుమ (కనుమ), శ్కోర్గా లోయ (లోయ), జోరావర్ శిఖరం (శిఖరం), దేహ్రా కంపాస్ (భూభాగం), డ్రాక్ కార్పో (పర్వతం), గోగ్రా (భూభాగం), జోల్మోరి (పర్వతం), కుమారాయణ పాయింట్ (భూభాగం), పాంగ్లుంగ్ (భూభాగం), రించెన్ జాంగ్పో (శిఖరం), శాక్యశ్రీ గిరి (శిఖరం), గురు రింపోచే (సరస్సు), శ్యామల్ లుంగ్పా (భూభాగం), యాంగ్పా నది (నది), వేడి నీటి బుగ్గ (జల వనరు), మార్పా లత్సవ రి (శిఖరం), మిలారెపా కాంగ్రి (శిఖరం), శివ రి (శిఖరం), మహేశ్వర రి (శిఖరం) ఉన్నాయి.

## 'ప్రవచన మంత్రి' నిర్లక్ష్యానికి హద్దులేవి?

ప్రధాని మోదీపై జైరాం రమేశ్



**న్యూఢిల్లీ:** రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలపై కాంగ్రెస్ శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు గుప్పించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ మాట్లాడుతూ 'ప్రవచన మంత్రి నిర్లక్ష్యానికి' హద్దులు లేవని అన్నారు. వరుసగా నెలలుగా, ముఖ్యంగా పండుగ సీజన్‌లో పెరుగుతున్న ధరల కారణంగా కుటుంబాల వంటగది బడ్జెట్‌లు 20 నుంచి 25 శాతం వరకు పెరిగాయని పేర్కొన్న ఒక మీడియా నివేదికను ఆయన పంచుకున్నారు. 'ద్రవ్యోల్బణం కేవలం గణాంకాలలో మాత్రమే పెరగడం లేదు. దాని బాధ ప్రతి మధ్యతరగతి, పేద కుటుంబం వంటగదిలో అనుభూతి చెందుతోంది' అని జైరాం రమేశ్ 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆ నివేదికను ఉటంకిస్తూ, కేవలం వరుస నెలల్లోనే కుటుంబాల వంటగది బడ్జెట్ 25 శాతం వరకు పెరిగిందని ఆయన అన్నారు. ఆ నివేదికలో ఉదహరించిన ఒక గృహిణిని కూడా ఆయన ప్రస్తావించారు. ఆమె కుటుంబం నెలకు రూ.35,000 సంపాదిస్తుందని, వంటగది ఖర్చులను నిర్వహించడం రోజురోజుకు కష్టంగా మారుతోందని ఆమె చెప్పినట్లు తెలిపారు. 'ఈ ద్రవ్యోల్బణ యుగంలో ఈ కుటుంబాలన్నీ తమ గృహ బడ్జెట్‌లను ఎలా సర్దుబాటు చేసుకుంటున్నాయో మోదీజీకి అర్థమవుతోందా?' అని ప్రశ్నించారు. అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను ఆయన ఉదహరించారు. కంది పప్పు కిలో రూ.105 నుంచి రూ.140150 కి, పెసరపప్పు రూ.95 నుంచి రూ.120 కి, బియ్యం రూ.4245 నుంచి రూ.5355 కి, లీటరు ఆవనూనె రూ.165 నుంచి రూ.190 కి పెరిగాయని ఆయన తెలిపారు. 'ప్రభుత్వ స్వంత గణాంకాల ప్రకారం ఆగస్టులో ఆహార ద్రవ్యోల్బణం 5.95 శాతంగా ఉంది. ఉల్లిపాయల ధరలు 48.27 శాతం, అల్లం 73.82 శాతం, వెల్లుల్లి 43.60 శాతం పెరిగాయి' అని జైరాం రమేశ్ అన్నారు. 'పప్పులు, మసాలాలు, కూరగాయలు, నూనె... ద్రవ్యోల్బణం అన్నిచోట్లా దెబ్బతీస్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం కుటుంబాల పొదుపు తగ్గిపోతోందని, అప్పులు పెరుగుతున్నాయని తెలుస్తోంది' అని ఆయన అన్నారు. ఒక సగటు కుటుంబానికి ఉన్న సమస్య కేవలం పెరుగుతున్న ఖర్చులు మాత్రమే కాదని, తగ్గిపోతున్న పొదుపు, పరిమిత ఆదాయంతో ఇంటి బడ్జెట్‌ను సర్దుబాటు చేసుకోవడమేనని జైరాం రమేశ్ తెలిపారు. 'ప్రభుత్వానికి ఇవి కేవలం అంకెలు కావచ్చు. కానీ ప్రజలకు ఇది ప్రతి నెలా చిన్నాభిన్నమవుతున్న ఇంటి బడ్జెట్. నడుము విరిచేస్తున్న ఈ ద్రవ్యోల్బణం నుంచి దేశ ప్రజలకు ఎప్పుడు ఉపశమనం లభిస్తుంది? 'ప్రవచన మంత్రి' (నీతులు చెప్పే మంత్రి) సున్నితత్వం లేమికి హద్దులు లేవు' అని మోదీని ఎద్దేవా చేస్తూ జైరాం రమేశ్ అన్నారు.

## ఓటర్ల చేర్పుకు ప్రత్యేక డ్రైవ్

రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించిన ఇసిఐ

**న్యూఢిల్లీ :** ఎస్ఐఆర్‌పై వివాదం వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితా సవరణ పూర్తైన ప్రాంతాలలో తొలగించిన, విస్మరించిన అర్హులైన కొత్త ఓటర్లను తక్షణమే ఓటరు జాబితాలో చేర్చేందుకు ఒక ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. దీంతో తాజాగా సర్ ప్రక్రియలో తొలగించిన ఓట్లు మళ్లీ ఓటర్ల జాబితాలో చేరనున్నాయి. రాష్ట్ర సిఇఒలతో జరిగిన వర్చువల్ సమావేశం అనంతరం, గురువారం ఎన్నికల సంఘం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఓటర్ల నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని, సర్ గణన సమయంలో చేర్చబడలేదనే కారణంతో ఏ అర్హతగల పౌరుడి ఓటు హక్కును కూడా హరించకూడదని కమిషన్ పేర్కొంది. గతంలో పేర్లు ఉండి, తుది జాబితా నుండి తొలగించబడిన ఓటర్లను గుర్తించడానికి, ప్రస్తుత ఓటర్ల జాబితాలను సర్‌కు ముందున్న జాబితాలతో సరిపోల్చి చూసుకోవాలని బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఒ) సూచించారు. గుర్తించబడిన తప్పిపోయిన వ్యక్తులందరి కోసం బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి ధృవీకరణలు నిర్వహిస్తారు. ఒక నెలలోపు ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసే లక్ష్యంతో, ప్రతి అధికారికి వారానికి 20 నుండి 25 మంది ఓటర్లను కవర్ చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. బిఎల్ఒలు కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్లు, నిజంగా ఓటు వేయని ఓటర్ల నుండి అక్కడికక్కడే ఫారం-6 దరఖాస్తులను సేకరిస్తారు. పారదర్శకతను పాటించేందుకు, ఈ జాబితాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లకు నేరుగా అందజేస్తారు. ఎస్ఐఆర్ నిర్వహించడం ద్వారా, ఇసి బిజెపితో కుమ్మక్కై అర్హులైన పౌరుల ఓటు హక్కును హరిస్తోందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి.

## చొరబాటుకు యత్నం...ఇద్దరి కాల్చివేత

**న్యూఢిల్లీ:** దేశంలోకి అక్రమంగా చొరబాటుకు యత్నించిన ఇద్దరు పాకిస్థానీలను భారత జవాన్లు కాల్చి చంపారు. ఈ ఘటన పంజాబ్‌తార్న్ తరాన్ సెక్టార్ వద్ద రాజోకే గ్రామం వద్ద ఇండియాపాకిస్థాన్ సరిహద్దులో జరిగింది. పాకిస్థాన్‌లోని చత్తన్‌వాలె ప్రాంతం నుంచి ముగ్గురు వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో అక్రమంగా సరిహద్దు నుంచి ఇండియాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. దీన్ని బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) సిబ్బంది గమనించారు. వెంటనే వారికి ఆగిపోవాలని హెచ్చరించారు.

**SRI SHIVANI COLLEGE OF PHARMACY**
Hanuman Junction, Mulugu Road, Warangal, Telangana.
(Approved by PCI, New Delhi, Affiliated to Kakatiya University)
Website: www.sscpwgl.com, Email ID: sscpwgl@gmail.com
Contact : 0870-2976777, 7893616171

**B. Pharmacy & Pharm. D Spot & Category -B admissions 2026-2027**

Inviting applications from the eligible candidates for Spot admissions into B.Pharmacy & Pharm.D courses for the academic year 2026-2027 on or before 06.10.2026 & Category-B admissions into B. Pharmacy & Pharm. D courses for the academic year 2026-2027 on or before 14.10.2026. The admissions will be conducted as per the guidelines from the TGCHE, Hyderabad. Spot & Category-B admissions are not eligible for fee reimbursement/ scholarship. Eligible candidates attend the Spot & Category-B admissions process with all original certificates and two sets Xerox copies.

Sd/- Secretary & Correspondent

**PRATAP NARENDER REDDY COLLEGE OF PHARMACY**
( Approved by AICTE, PCI and Affiliated to JNTUH )
1-117&1-118 Peddashapur (Vill) Shamshabad (M), Rangareddy (Dist) - 509329
Ph: 08413-255255, 99129140488, 9441113576, 95733064547

B.PHARMACY/ PHARMA-D/. M.PHARMACY Spot / Category-B Adnissions - 2026 - 27

| COURSE | B.Pharmacy | Pharma - D | EAMCET CODE PNRP |
|---|---|---|---|
| Intake | 100 | 30 | |
| 'B' Cat. Seats | 30 | 09 | |

PEGCET - Category - B Admissions - 2026 - 27

| COURSE (M. Pharmacy) | Intake | 'B' Cat | PGECET CODE PNRP1 |
|---|---|---|---|
| Pharmaceutics | 15 | 04 | |
| Pharmaceutical Analysis | 15 | 04 | |

Application forms and instructions to the candidates can be obtained from the College office, filled application forms can be submitted in the college office , admission will be made as per the guidelines of TGCHE and Govt of TG.

Sd/- Principal

**CHILKUR BALAJI COLLEGE OF PHARMACY**
( Approved by AICTE, PCI and Affiliated to JNTUH )
Azeeznagar (Vill) Moinabad (M), Rangareddy (Dist) - 509325
Ph: 9290403667, 6302464946

B.PHARMACY/ PHARMA-D/. M.PHARMACY Spot / Category-B Adnissions - 2026 - 27

| COURSE | B.Pharmacy | Pharma - D | EAMCET CODE CBCP |
|---|---|---|---|
| Intake | 100 | 30 | |
| 'B' Cat. Seats | 30 | 09 | |

PEGCET - Category - B Admissions - 2026 - 27

| COURSE (M. Pharmacy) | Intake | 'B' Cat | PGECET CODE CBCP1 |
|---|---|---|---|
| Pharmaceutics | 15 | 04 | |
| Pharmaceutical Analysis | 15 | 04 | |

Application forms and instructions to the candidates can be obtained from the College office, filled application forms can be submitted in the college office , admission will be made as per the guidelines of TGCHE and Govt of TG.

Sd/- Principal

**VISION College Of Pharmacy Sciences & Research**
( Approved by AICTE, PCI and Affiliated to JNTUH )
RNS. Colony, Boduppal, Medipally (M), Medchal - Malkajgiri (Dist) - 509329
Ph:82297101215,8297101206

B.PHARMACY/ PHARMA-D/. M.PHARMACY Spot / Category-B Adnissions - 2026 - 27

| COURSE | B.Pharmacy | Pharma - D | EAMCET CODE VPRG |
|---|---|---|---|
| Intake | 100 | 30 | |
| 'B' Cat. Seats | 30 | 09 | |

PEGCET - Category - B Admissions - 2026 - 27

| COURSE (M. Pharmacy) | Intake | 'B' Cat | PGECET CODE VPRG1 |
|---|---|---|---|
| Pharmaceutics | 15 | 04 | |
| Pharmaceutical Analysis | 15 | 04 | |
| Regulatory Affairs | 15 | 04 | |

Application forms and instructions to the candidates can be obtained from the College office, filled application forms can be submitted in the college office , admission will be made as per the guidelines of TGCHE and Govt of TG.

Sd/- Principal

**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**
( Approved by AICTE, PCI & Affiliated to JNTU - Hyderabad )
Uppal Bus Depot, hyderabad - 500 039, Ph: 9393144412/15/18,
E-mail: gyanajyothicollege@gmail.com, Web: www.gjcp.ac.in.

**SPOT ADMISSIONS**

* Spot Admissions will be made on 5/10/2026 to 10/10/2026 in College Premises.
* Interested Candidates can Report before 5.00 PM along with the original Certificates
* Tuition Fee in form of DD/Challan.
* Admissions will be made as per guidelines issued by the TGPGECET - 2026

Sd/- Principal

**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**
( Approved by AICTE, PCI & Affiliated to JNTU - Hyderabad )
Uppal Bus Depot, hyderabad - 500 039, Ph: 9393144412/15/18,
E-mail: gyanajyothicollege@gmail.com, Web: www.gjcp.ac.in.

**SPOT ADMISSIONS**

* Spot Admissions will be made on 5/10/2026 to 6/10/2026 in College Premises.
* Interested Candidates can Report before 5.00 PM along with the original Certificates
* Tuition Fee in form of DD/Challan.
* Admissions will be made as per guidelines issued by the TGEAPCET-2026

Sd/- Principal

**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**
( Approved by AICTE, PCI & Affiliated to JNTU - Hyderabad )
Uppal Bus Depot, hyderabad - 500 039, Ph: 9393144412/15/18,
E-mail: gyanajyothicollege@gmail.com, Web: www.gjcp.ac.in.

**B.CATEGORY NOTIFICATION: TGPGECET-2026**

| S.No. | M.Pharmacy | Intake | B-Category Seats |
|---|---|---|---|
| 1 | Pharmaceutics | 12 | 3 |
| 2 | Pharmaceutical Analysis | 12 | 3 |

Applications are invited under B category for the above mentioned courses for the academic year 2026-2027. Interested and eligible candidates may submit applications along with the copies of certificates in the college or submit online. Admissions Criteria will be as per the guidelines of TGCHE_Hyderabad

Sd/- Principal

**GYANA JYOTHI COLLEGE OF PHARMACY**
(Approved by AICTE, PCI & Affiliated to JNTU, Hyderabad)
Uppal Bus Depot, Hyderabad 500098. Ph.: 9393144415/12/18
Email: gyanajyothicollege@gmail.com Web: www.gjcp.ac.in

**B.CATEGORY NOTIFICATION: TGEAPCET - 2026**

| S.No. | Course | Intake | B.Categoryseats |
|---|---|---|---|
| 1 | B-Pharmacy | 100 | 30 |

Applications are invited under **B category** for the above mentioned courses for the academic year **2026-2027.** Interested and eligible candidates may submit applications along with the copies of certificates in the college. Admissions criteria will be as per the guidelines of TGCHE.

Sd/- Principal

# మొత్తం సంపాదక బృందం అరెస్టు



ఈజిప్టులో స్వతంత్ర మీడియా సంస్థపై ఉక్కుపాదం

**న్యూయార్క్:** ఈజిప్టులో మిగిలిన అతికొద్ది స్వతంత్ర మీడియా సంస్థల్లో ఒకటైన 'మత్సదాష్' (అరబిక్‌లో 'నమ్మొద్దు' అని అర్థం)కు చెందిన మొత్తం సంపాదక బృందాన్ని అధికారులు అరెస్ట్ చేశారు. నిషేధిత 'ముస్లిం బ్రదర్‌హుడ్'తో సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలతో ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ వారం ఆ సంస్థకు చెందిన ఆరుగురు జర్నలిస్టుల అరెస్టు అంతర్జాతీయ, ప్రాంతీయ హక్కుల సంస్థల నుంచి తీవ్ర ఖండనలకు దారితీసింది. ఇది స్వతంత్ర మీడియా, భావప్రకటన స్వేచ్ఛపై ప్రమాదకరమైన అణచివేతగా హక్కుల సంఘాలు అభివర్ణించాయి. అరెస్టయిన జర్నలిస్టులు విదేశీ నిధులు తీసుకుని ఆన్‌లైన్ వేదిక కోసం కల్పిత వార్తలు ప్రచారం చేస్తున్నారని ఈజిప్టు అధికారులు ఆరోపించారు. మత్సదాష్ సహ వ్యవస్థాపకుడు అబ్దెల్‌రహ్మాన్ మన్సూర్ ఈ ఆరోపణలను ఖండించారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. 2018లో వార్తా సైట్‌గా ప్రారంభమైన మత్సదాష్, ఆ తర్వాత ఈజిప్టుతో పాటు ఇతర అరబ్ దేశాల్లో పరిశోధనాత్మక జర్నలిజం వైపు విస్తరించింది. సంస్థకు చెందిన ఇద్దరు సంపాదకులను 2023లో అరెస్ట్ చేసినప్పటికీ, 'ముస్లిం బ్రదర్‌హుడ్'తో సంబంధం లేదని భద్రతా దర్యాప్తులో తేలడంతో వారిని ఎలాంటి అభియోగాలు లేకుండా విడుదల చేశారని మన్సూర్ చెప్పారు. ఈజిప్టు అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ మాత్రం మత్సదాష్‌ను విదేశాల నుంచి నిర్వహిస్తున్న అనుమతి లేని వేదికగా పేర్కొంది. అరెస్టయిన ఆరుగురు 'ముస్లిం బ్రదర్‌హుడ్'కు చెందిన మీడియా కమిటీలో భాగమని ఆరోపించింది. అయితే వారి మీద నమోదైన నిర్దిష్ట అభియోగాలను వెల్లడించలేదు. అరెస్టయిన జర్నలిస్టుల ఆచూకీ ప్రస్తుతం తెలియరాలేదు. వారి కుటుంబ సభ్యులను లేదా న్యాయవాదులను సంప్రదించేందుకు కూడా అనుమతించలేదని ఈజిప్షియన్ ఇనిషియేటివ్ ఫర్ పర్సనల్ రైట్స్ తెలిపింది. మత్సదాష్ వెబ్‌సైట్‌ను ఈజిప్టులో బ్లాక్ చేసినప్పటికీ, దాని ఫేస్‌బుక్ పేజీకి 10 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఇలావుండగా, 80కుపైగా అంతర్జాతీయ, ప్రాంతీయ హక్కుల సంస్థలు, పౌరసమాజ సంస్థలు, స్వతంత్ర మీడియా సంస్థలు జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ఈజిప్టు ప్రభుత్వాన్ని కోరాయి. ఈజిప్టు 2013లో 'ముస్లిం బ్రదర్‌హుడ్'ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. అప్పటి అధ్యక్షుడు, బ్రదర్హుడ్కు చెందిన మొహమ్మద్ మోర్సీను సైన్యం పదవి నుంచి తొలగించిన అనంతరం ఈ చర్య జరిగింది. అప్పటి నుంచి జర్నలిస్టులు, ప్రభుత్వ విమర్శకులపై 'ముస్లిం బ్రదర్‌హుడ్'తో సంబంధాలున్నాయన్న ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి.

# ఇరాన్‌పై మళ్లీ దాడులు!

- సిద్ధమవుతున్న అమెరికా.. మధ్యప్రాచ్యానికి మూడో విమాన వాహక నౌక

**వాషింగ్టన్:** ఇరాన్‌పై అమెరికా కొత్త దాడులు చేసే అవకాశాన్ని అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ పరిశీలిస్తున్నట్టు సమాచారం. మళ్లీ దాడులు జరుగుతాయన్న వాదనకు మరింత బలం చేకూరేలా మధ్యప్రాచ్యానికి అమెరికా సుమారు 9,000 మంది సైనికులను తరలిస్తోంది. వీరిలో 7,000 మందికి పైగా నావికులు, 2,000 మంది మెరైన్లు ఉన్నారు. మూడో విమాన వాహక నౌక కూడా ఈ బలగాల్లో ఉంది. యుఎస్‌ఎస్ థియోడర్ రూజ్వెల్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్, యుఎస్‌ఎస్ మాకిన్ ఐలాండ్ ఉభయచర దళం ఈ తరలింపులో ఉన్నాయి. అక్టోబర్ చివరినాటికి మధ్యప్రాచ్యంలో మూడు అమెరికా విమాన వాహక నౌకలు ఉండే అవకాశం ఉందని ఓ అమెరికా అధికారి తెలిపారు. ఇదే సమయంలో, ఇజ్రాయెల్‌కు వెళ్తున్న 'ఫ్లై దుబాయ్' విమానంలో కెప్టెన్‌పై కోపైలట్ దాడి చేసిన ఘటనకు ఇరాన్‌తో సంబంధం ఉండొచ్చని ట్రంప్ అనుమానం వ్యక్తం చేశారు. సంబంధం నిర్ధారణ అయితే ఇరాన్‌పై 'చాలా తీవ్రంగా' దాడి చేస్తామని హెచ్చరించారు. అయితే ఇందుకు సంబంధించిన ఆధారాలను ఆయన వెల్లడించలేదు. కాగా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం నిందితుడు ఇస్లామిస్ట్, తీవ్రవాద భావజాల ప్రభావానికి గురయ్యాడని దర్యాప్తుదారులు భావిస్తున్నట్లు తెలిపారు. టైమ్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్, నవంబర్ 3 ఎన్నికల తర్వాత ఇర్బా బాంబు దాడులను మళ్లీ పెంచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇరాన్ ప్రతిపాదించిన తాజా కాల్పుల విరమణ ప్రతిపాదనను ఆయన తిరస్కరించినట్లు కూడా తెలిపారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్న ప్రతిపాదన సరిపోదని ట్రంప్ అభిప్రాయపడ్డారు. 'ఇరాన్‌తో సంబంధాలపై మీకు సమాచారం అందిందా?' అని వైట్‌హౌస్‌లో విలేఖరులు ప్రశ్నించగా, ప్రస్తుతం వివరాలు సేకరించే పనిలో ఉన్నామని ట్రంప్ అన్నారు. ఇలావుంటే, కాక్‌పిట్‌లో కెప్టెన్‌పై దాడి చేసిన కోపైలట్‌ను ఒమన్ పౌరుడిగా దర్యాప్తు అధికారులు ధ్రువీకరించారు. ఉగ్రవాదం నుంచి మానసిక సమస్యల వరకు అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని, ప్రస్తుతం ఏ కోణాన్నీ కొట్టిపారేయడం లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సౌదీ అరేబియా నిందితుడిని యుఎఇకి అప్పగించింది. ఇజ్రాయెల్ అధికారులు కూడా దర్యాప్తులో పాల్గొంటున్నారు.



### శాంతియత్నాలకు విఘాతం!

'ఫ్లై దుబాయ్' విమానం హైజాక్‌కు ప్రయత్నం జరిగిందని, కోపైలట్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వార్తలు రావడంతో, అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఈ ఘటనను 'ఉగ్ర' కోణంలో చూస్తున్నాయి. ఇస్లామిక్ తీవ్రవాదమే పైలట్‌పై దాడికి కారణమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు ఆరోపిస్తుండగా, ఇరాన్‌తో ఏవైనా సంబంధాలు ఉండవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఇరాన్–అమెరికా మధ్య యుద్ధాన్ని ముగించేందుకు జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు కూడా అనిశ్చితిలో ఉన్నాయి. ఇరాన్ తన తాజా ప్రతిపాదనపై అమెరికా అధికారిక స్పందన అందిందని తెలిపింది. అయితే, ఆ స్పందనలో ఏముందో వివరించలేదు. అమెరికా ఆ ప్రతిపాదనను తిరస్కరించిందా? లేదా? అన్నది స్పష్టం కాలేదు. యుద్ధాన్ని ముగించి హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలన్న లక్ష్యంతో మధ్యవర్తులు ఇరువర్గాలతో చర్చలు కొనసాగిస్తున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## 'ఫ్లై దుబాయ్' విమాన ఘటనతో విమాన భద్రతపై మళ్లీ చర్చ

**జెరూసలేం:** ప్రపంచంలో అత్యంత కఠినమైన విమాన భద్రతా నిబంధనలు అమలు చేస్తున్న దేశాల్లో ఇజ్రాయెల్ ఒకటి. అంతర్జాతీయ విమాన భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా పాటిస్తున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) చెబుతోంది. అయినప్పటికీ, దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న 'ఫ్లై దుబాయ్ ఎఫ్‌జెడ్ 1073' విమానం కాక్‌పిట్‌లో జరిగిన దాడి ఈ భద్రతా వ్యవస్థలపై కొత్త ప్రశ్నలు లేవనెత్తింది. మళ్లీ ఈ అంశంపై చర్చకు తావిస్తున్నది. 174 మంది ప్రయాణికులతో బయలుదేరిన విమానం కెప్టెన్‌పై కోపైలట్ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. తీవ్రంగా గాయపడిన కెప్టెన్ కాక్పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విమానం సౌదీ అరేబియాలో అత్యవసరంగా సురక్షిత ల్యాండ్ అయింది. సౌదీ, యుఎఇ, ఇజ్రాయెల్ అధికారులు దర్యాప్తు చేస్తుండగా, అమెరికా, ఒమన్ కూడా సహకరిస్తున్నాయి. ఇప్పటివరకు భద్రతా తనిఖీల ప్రధాన దృష్టి ప్రయాణికులు, వారి సామానుపైనే ఉండేదని ఇజ్రాయెల్ మాజీ జాతీయ భద్రతా సలహాదారు ఇయాల్ హులాటా పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత విమాన సిబ్బందిపైనా మరింత కఠినమైన తనిఖీలు జరిగే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసిఎఒ) పైలట్ల అర్హతలు, లైసెన్సింగ్‌కు ప్రాథమిక ప్రమాణాలు నిర్దేశించినప్పటికీ, అదనపు నిబంధనలు దేశాలు, విమానయాన సంస్థలవారీగా మారుతాయి. నిందితుడు ఒమన్ పౌరుడని ఇజ్రాయెల్ తెలిపింది. ఇజ్రాయెల్–ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు లేనందున, అతను టెల్ అవీవ్‌కు వెళ్లే విమానంలో ఎలా పనిచేశాడన్నదీ దర్యాప్తులో కీలక ప్రశ్నగా మారింది. అత్యవసర సంకేతాలు పంపిన తర్వాత సౌదీ, జోర్డాన్ తొలుత విమానానికి ల్యాండింగ్ అనుమతి ఇవ్వలేదన్న సమాచారం కూడా వెలుగులోకి వచ్చింది. అయితే అంతర్జాతీయ నిబంధనలు హైజాకింగ్ లేదా ఇతర అక్రమ జోక్యానికి గురైన విమానాలకు సాధ్యమైనంత అత్యవసర సహాయం అందించాలని సూచిస్తున్నాయి. 2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత కాక్‌పిట్ తలుపులను బలోపేతం చేసి ఎప్పుడూ లాక్‌లో ఉంచే విధానం ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. తాజా ఘటన మాత్రం ముప్పు బయట నుంచి కాకుండా విమాన సిబ్బంది నుంచే వస్తే భద్రతా వ్యవస్థ ఎలా స్పందించాలి? అనే కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది. దర్యాప్తులో సిబ్బంది ఎంపిక, వైద్య పరీక్షలు, గత ప్రవర్తనపై హెచ్చరికలు, అత్యవసర సంకేతాలకు అధికారుల స్పందన వంటి అంశాలన్నీ పరిశీలించనున్నారు.

## చైనా, పాకిస్తాన్, జపాన్‌సహా ప్రపంచవ్యాప్తంగా ఘనంగా గాంధీ జయంతి



**బీజింగ్/ఇస్లామాబాద్:** మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా చైనా, పాకిస్థాన్, జపాన్‌తో పాటు ప్రపంచంలోని పలు దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాయి. శాంతి, సత్యం, అహింస వంటి గాంధీజీ విశ్వవ్యాప్త సందేశాలు నేటికీ ప్రాసంగికమేనని ఈ సందర్భంగా పలువురు వక్తలు గుర్తుచేశారు. చైనా రాజధాని బీజింగ్‌లో భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి జింతై ఆర్ట్స్ మ్యూజియంలో గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చైనా కళాకారులు సంగీత నివాళి అర్పించగా, భారతీయ ప్రవాసులు గాంధీజీకి ఇష్టమైన భజనలను ఆలపించారు. శాంతి, సామరస్యం, అహింస సందేశాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. షాంఘైలో భారత కాన్సుల్ జనరల్ ప్రతీక్ మాథుర్, బ్రిక్స్ దేశాల కాన్సుల్ జనరల్స్‌తో కలిసి గాంధీజీకి నివాళులర్పించారు. ఆయన జీవితం, బోధనలు, ప్రస్తుత ప్రపంచానికి వాటి ప్రాసంగికతపై వక్తలు మాట్లాడారు. ఇస్లామాబాద్‌లో భారత రాయబార కార్యాలయ తాత్కాలిక చార్జ్ డి'అఫైర్స్ సత్యాంజల్ పాండేతో పాటు అధికారులు గాంధీజీకి పుష్పాంజలి ఘటించారు. నేపాల్‌లోని ఖాట్మండు భారత రాయబార కార్యాలయంలోనూ గాంధీ జయంతి నిర్వహించారు. జపాన్‌లో భారత రాయబారి నగుమ మాలిక్ ఎడోగావాలోని గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. సమాజంలోని అత్యంత బలహీన వర్గాల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్న 'అంత్యోదయ', పరిశుభ్రత, సామాజిక సేవ వంటి గాంధీజీ విలువలను ఆయన ప్రస్తావించారు. యువత ఎడో నది తీరంలో భక్తి గీతాలు ఆలపించింది. ఆస్ట్రేలియాలోని కాన్‌బెరా, న్యూజిలాండ్‌లోని వెల్లింగ్టన్‌తో పాటు బహ్రెయిన్, దక్షిణ కొరియా తదితర దేశాల్లోనూ గాంధీజీ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. ఆస్ట్రేలియాలో ఈ కార్యక్రమాన్ని అంతర్జాతీయ అహింసా దినోత్సవంతో కలిపి నిర్వహించారు. మంగోలియా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, తుర్కియేతో పాటు మరికొన్ని దేశాల్లోని భారతీయ మిషన్లు కూడా గాంధీ జయంతిని నిర్వహించాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమాల్లో సత్యం, అహింస, శాంతి అనే గాంధీజీ సందేశాన్ని సమకాలీన ప్రపంచానికి మరోసారి గుర్తుచేశారు.

## పెంటగాన్‌లో మత వ్యవహారాల కార్యాలయం

**వాషింగ్టన్:** అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పెంటగాన్‌లో కొత్తగా 'మత వ్యవహారాల కార్యాలయం' (ఒఆర్‌ఎ)ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యాలయం నేరుగా రక్షణ మంత్రికి నివేదిస్తుంది. సైనిక చాప్లిన్లు, మతపరమైన సేవలకు ఉన్నతస్థాయిలో మద్దతు కల్పించడం దీని లక్ష్యమని పెంటగాన్ తెలిపింది. సైనికులు తమ మతాన్ని అనుసరించేందుకు మద్దతు ఇస్తామని, అయితే ఎవరినీ మతపరమైన కార్యక్రమాల్లో పాల్గొనమని బలవంతం చేయబోమని, అదే విధంగా ఏ ఒక్క మతానికీ ప్రాధాన్యం ఇవ్వబోమని రక్షణ శాఖ పేర్కొంది. కాగా, ఈ చర్యపై విమర్శలు మొదలయ్యాయి. క్రైస్తవ మతానికి సైనిక విధానాల్లో మరింత ప్రాధాన్యం కల్పిస్తున్నారని అమెరికన్స్ యునైటెడ్ ఫర్ సెపరేషన్ ఆఫ్ చర్చ్ అండ్ స్టేట్ ఆరోపించింది. హెగ్సెత్ సైనిక చాప్లిన్ల పాత్రను విస్తరించడంతో పాటు, సైనిక కుటుంబాలకు మత ఆధారిత విద్యా సహాయం, ఆత్మహత్యల నివారణ కార్యక్రమాల్లో విశ్వాస ఆధారిత చర్యలను కూడా ప్రతిపాదించారు. రక్షణ శాఖ అధికారికంగా గుర్తించే మత సంప్రదాయాల సంఖ్యను 200కుపైగా నుంచి 31కి తగ్గించింది. తాజా జాబితాలో నాస్తికులు, యూనిటేరియన్ యూనివర్సలిస్టులు, పేగన్లు, విక్కన్లు లేకపోవడం గమనార్హం.

## మహిళల హాకీ జట్టుకు సిఎం రేవంత్‌రెడ్డి అభినందనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో చైనాపై విజయం సాధించి స్వర్ణ పతకం గెలుచుకున్న భారత మహిళల హాకీ జట్టుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. 1982 తర్వాత ఆసియా క్రీడల్లో మహిళల హాకీ జట్టు మళ్లీ స్వర్ణ పతకం సాధించడం, 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించడం అభినందనీయమని పేర్కొన్నారు. చైనాతో జరిగిన తుదిపోరులో లాల్రెమ్సియామి హ్మార్జోటే 10వ నిమిషంలో గోల్ చేసి భారత్‌కు ఆధిక్యం అందించగా.. రెండో క్వార్టర్‌లో సవితా పూనియా పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకోవడం ద్వారా జట్టు అద్భుత పోరాట పటిమను ప్రదర్శించిందని సిఎం కొనియాడారు. ఆసియా క్రీడల్లో భారత్ ఇప్పటికే 16 స్వర్ణాలతో మొత్తం 76 పతకాలు సాధించి ఐదో స్థానానికి చేరుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. మహిళల హాకీ జట్టు దృఢ సంకల్పంతో సాధించిన విజయం దేశంలోని క్రీడాకారులకు స్ఫూర్తినిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## 4న తెలంగాణకు అమిత్ షా

కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ఈనెల 4న తెలంగాణలో పర్యటించనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని ఊర్జీ ఇండస్ట్రియల్ పార్క్‌లో శబర్ డైరీ ప్రాజెక్ట్ భూమిపూజతో పాటు అమూల్ సంస్థ ఆధునిక డైరీ ప్లాంట్‌ను అమిత్ షా ప్రారంభించనున్నారు. రోజుకు 5 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యంతో ఏర్పాటువుతున్న ఈ ప్లాంట్ రాష్ట్ర పాడి పరిశ్రమ రంగానికి కీలక మైలురాయిగా నిలవనుందన్నారు. 'శ్వేత విప్లవం 2.0'లో భాగంగా 2029 నాటికి తెలంగాణలో 1,525 కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఎన్‌సిడిసి ద్వారా తెలంగాణకు రూ.1.16 లక్షల కోట్లు మంజూరు చేశామని, రాబోయే ధాన్యం సేకరణకు కూడా భారీగా నిధులు కేటాయించామని చెప్పారు.

## రాజీనామా చెయ్

(మొదటి పేజీ తరువాయి)

విశాల్ దద్లానీ, రాజకీయ పార్టీలు శివసేన (యుబిటి), మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) పార్టీలు, ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ వంటి విద్యార్థి సంఘాలు మద్దతు పలికాయి. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోకపోతే 'జంతర్ మంతర్ 2.0' తరహా ఉద్యమం తప్పదని పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. నిరసనకారులను ఉద్దేశించి దీప్కే ప్రసంగిస్తూ బిజెపి, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌లపై తీవ్రంగా మండిపడ్డారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి, క్రిమినల్ విచారణను ఎదుర్కోవాలి అని సిజెపి నాయకుడు అజింక్య షిండే డిమాండ్ చేశారు. అలాగే, 2025 నాటి ఓటర్ల జాబితాలను నిలిపివేయాలని, ఎన్నికల కమిషనర్ల నియామక విధానాన్ని నిర్దేశించే 2023 చట్టాన్ని రద్దు చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. 'ఓటర్ల తొలగింపు' తర్వాత, నరేంద్ర మోదీ హవా ఉధృతంగా ఉన్నప్పుడు కూడా గెలవలేని రాష్ట్రాల్లో బిజెపి విజయం సాధించిందని దీప్కే ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకపోతే, దేశవ్యాప్తంగా ఉన్న జెన్‌జీ ఢిల్లీకి తరలివస్తుందని, అక్కడ 'జంతర్ మంతర్ 2.0' ఉద్యమం జరుగుతుంది' అని పేర్కొంటూ 'చలో ఢిల్లీ'కి పిలుపునిచ్చారు. 'ప్రభుత్వం ఎంత అసమర్థంగా ఉందంటే, (నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జంతర్ మంతర్ వద్ద నిరసన జరిగిన) రెండు నెలలకే మనం మళ్లీ నిరసన తెలపాల్సి వస్తోంది అని సిజెపి వ్యవస్థాపకుడు అన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రస్తావిస్తూ, అధికార భారతీయ జనతా పార్టీ అసలు లక్ష్యం 'ఒక దేశం, ఒక ఎన్నిక, ఒక పార్టీ' అని ఆయన ఆరోపించారు. మహారాష్ట్రలోని శివసేన, ఎన్‌సిపిలతో మొదలుపెట్టి, ప్రాంతీయ పార్టీలను అంతం చేయడానికి బిజెపి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనను ఒక 'షెల్ కంపెనీ'గా అభివర్ణించారు. కాగా, మధ్య ముంబయిలోని శివాజీ పార్కులో సిజెపి నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. అయినప్పటికీ, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తనను, ఇతర నిరసనకారులను జైలులో పెట్టాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌కు దీప్కే సవాలు విసిరారు. శివాజీ పార్కులోని కొందరు నివాసితులు వ్యతిరేకించినప్పటికీ, దాదర్ స్టేషన్ వరకు భారీ భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ, నిరసనకారులు కుమార్ తక్షణ రాజీనామా కోరుతూ నినాదాలు, గాంధేయ సూక్తులు, ప్లేకార్డులతో ఆ ప్రాంతాన్ని నింపేశారు. స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌ఎఫ్‌ఐ) వంటి సంఘాలకు చెందిన కార్యకర్తలు, యువత త్రివర్ణ పతాకాలను ఊపుతూ, 'జ్ఞాను, ప్రజాస్వామ్యంపై నీకు నమ్మకం లేదా?, జ్ఞానేష్ బ్రో, రాజీనామా చెయ్, 'ద్రోహి జ్ఞాను పోవాలి' వంటి సందేశాలు ఉన్న పోస్టర్లతో ఆ ప్రాంతానికి భారీగా తరలివచ్చారు. నిరసనకారులు వినూత్నమైన వస్తువులను కూడా ప్రదర్శించారు. పుణెకు ఎఐఎస్‌ఎఫ్ అనుబంధ సంఘాలు సంగీత వాయిద్యాలను వాయిస్తూ నిరసనలో ఉత్సాహాన్ని నింపాయి. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా, నిరసన వేదికపై బాబాసాహెబ్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించడంతో పాటు అహింస, సరళతకు సంబంధించిన సూక్తులను ప్రదర్శించారు. 'రంగ్ దే బసంతి' చిత్రంలోని పాటలు, ఎ.ఆర్. రెహమాన్ పాడిన 'వందేమాతరం' గీతం కూడా వినిపించాయి. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలకు వ్యతిరేకంగా 'జెన్ నెక్ట్స్ ముంబయి' పేరిట ఓ వర్గం అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టింది.



## 44 ఏళ్ల నిరీక్షణకు తెర

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. భారత్ మహిళల హాకీ టీమ్ చివరిసారిగా 1982 ఆసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించింది. ఈ విజయంతో లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్స్ బెర్త్‌ను భారత మహిళల హాకీ టీమ్ దక్కించుకుంది. జపాన్‌లోని నగోయాలో జరిగిన ఫైనల్లో భారత్, చైనా హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్ తొలి క్వార్టర్‌లో భారత ప్లేయర్ లాల్‌రెమ్సియామి మెరుపు వేగంతో ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించింది. భారత క్రీడాకారులు ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకొని విజయం సాధించింది. ఆరంభంలో వెనుకబడిన చైనా జట్టు.. స్కోర్లను సమం చేసేందుకు వరుసగా తీవ్రమైన దాడులు చేసింది. చివరి పావుగంటలో.. చైనా తమ గోల్ కీపర్‌ను పంపించేసి మరి ఎక్స్‌ట్రా అటాకర్‌ను బరిలోకి దించింది. కానీ భారత గోల్ కీపర్ సవితా పునియా ఉక్కు గోడలా నిలబడి చైనా గోల్ ప్రయత్నాలను అడ్డుకుంది. సలీమా టేట్, రుతజలతో సహా భారత ప్లేయర్లు చివరి నిమిషాల్లో తమ చాకచక్యమైన బాల్ హ్యాండ్లింగ్‌తో సమయాన్ని గడిపారు. ఫైనల్లో విజిల్ మోగి ఆట 1–0తో ముగియగానే.. భారత క్రీడాకారిణుల విజయోత్సవాలతో స్టేడియం మొత్తం హోరెత్తింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత మహిళల హాకీ జట్టు 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించిన డబుల్ రికార్డ్ సృష్టించింది. ఈ ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2–0 తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై భారత క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

## చార్జీల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేయడానికి ప్రభుత్వం అనుమతించింది. ట్రాఫిక్ లేదా ఇతర కారణాలతో ఆటో నిలిచిపోయిన సమయంలో నిమిషానికి 75 పైసలు డిటెన్షన్ (వెయిటింగ్) చార్జీగా లెక్కించనున్నారు.

### లగేజీకి అదనపు చార్జీ

ప్రయాణికుడితో పాటు తీసుకెళ్లే నిర్దిష్ట లగేజీకి నిబంధనల ప్రకారం ప్యాకేజీకి 50 పైసలు చొప్పున చార్జీ వసూలు చేయవచ్చు. అయితే బ్రీఫ్ కేస్, హ్యాండ్‌బ్యాగ్ లేదా 60X40 సెంటీమీటర్ల లోపు ఉండే అనుబంధ బ్యాగులకు ఈ చార్జీ వర్తించదు. ఆటోలో గరిష్టంగా 100 కిలోల వరకు లగేజీకి అనుమతి ఉంది. కొత్త ఛార్జీలకు అనుగుణంగా ఇప్పటికే ఉన్న డిజిటల్ మీటర్లను రీసెట్ చేసేందుకు రవాణా శాఖ మూడు నెలల గడువు ఇచ్చింది. అప్పటివరకు ఆటోల్లో పాత, కొత్త చార్జీల వివరాలతో కూడిన ఆమోదిత టారిఫ్ కార్డును ప్రదర్శించాలి.

### 2014లో చివరిసారిగా సవరణ:

తెలంగాణలో ఆటో చార్జీలు చివరిసారిగా 2014లో నిర్ణయించారు. అప్పటి నుంచి చార్జీలలో మార్పు లేకపోవడంతో ఇంధనం, నిర్వహణ వ్యయాలు పెరిగిన నేపథ్యంలో సవరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆగస్టులో ఆటో, క్యాబ్ తదితర డ్రైవర్ల సంఘాలు చార్జీల పెంపుతో సహా పలు డిమాండ్లపై సమ్మెకు పిలుపునివ్వగా, ప్రభుత్వం చార్జీల సవరణకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. పెరిగిన చార్జీలతో ప్రయాణికులపై కాస్త భారం పడనున్నప్పటికీ, ఆటో డ్రైవర్ల శ్రేయస్సును పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

**పాత, కొత్త ఆటో మీటర్ చార్జీలు:**

| అంశం | ప్రస్తుత చార్జీ | సవరించిన చార్జీ |
|---|---|---|
| కనీస చార్జీ | రూ. 20 | రూ. 30 |
| ప్రతి తదుపరి కి.మీ. | రూ.11 | రూ.14 |
| వెయిటింగ్ చార్జీ, (నిమిషానికి) | రూ.0.50 | రూ.0.75 |
| అర్హత కలిగిన సామాను | రూ.0.25 | రూ.0.50 |
| గరిష్టంగా లగేజీ | 100 కిలోలు | 100 కిలోలు |
| రాత్రి చార్జీ (11– 5 గంటల) వరకు | 1.5 రెట్లు | 1.5 రెట్లు |

## ప్రజాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో జరిగిన అవకతవకలు, ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించడం వంటి ఆరోపణలపై జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న సిపిఐ, సిపిఐ(ఎం), ఆప్, ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్, ఎఐఎస్‌ఎ, ఎస్‌ఎఫ్ఐ, ఎన్‌ఎస్‌యుఐ, ఐవైసి, డివైఎఫ్‌ఐ, ఇతర విద్యార్థి, యువజన సంఘాల సభ్యులతో సహా 700 మందికిపైగా నిరసనకారులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషీ, రాజ్యసభ ఎంపి సంజయ్ సింగ్, ఆప్ నాయకులు సౌరభ్ భరద్వాజ్, సంజీవ్ ఝూ, సిపిఐ జాతీయ కార్యదర్శి పి. సందోశ్‌కుమార్, సిపిఐ ఢిల్లీ కార్యదర్శి, ప్రొఫెసర్ దినేష్ వర్ష్ణి, ఎఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ సీరంగర, సిపిఐ (ఎం) నేత బృందా కరత్, సామాజిక కార్యకర్తలు యోగేంద్ర యాదవ్, నిఖిల్ డే, ఆర్‌జెడి నేత మనోజ్ ఝూ, మరికొందరు కార్యకర్తలను పోలీసు అరెస్టు చేశారు. అదే విధంగా నిరసన ప్రదేశానికి చేరుకునేందుకు ప్రయత్నించిన ఇతర నిరసనకారులను వేర్వేరు ప్రాంతాల్లో అరెస్టు చేశారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో జంతర్ మంతర్ చేరుకోవడానికి ప్రయత్నిస్తున్న సుమారు 700 మంది ఎస్‌ఎఫ్‌ఐ సభ్యులను అశోకా రోడ్ రౌండ్ అబౌట్ వద్ద అడ్డగించి, వారిలో చాలా మందిని అదుపులోకి తీసుకున్నారని ఒక పోలీసు వర్గం తెలిపింది. జంతర్ మంతర్, సమీప ప్రాంతాల నుండి ఆప్ నాయకులు, ఎఐఎస్‌ఎ, ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యుఐ, ఇతర విద్యార్థి సంఘాల సభ్యులతో సహా సుమారు 700 మంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారని మరో పోలీసు అధికారి తెలిపారు. ఎన్‌ఎస్‌యుఐ కార్యకర్తలు తమ కార్యాలయం నుంచి జంతర్ మంతర్ వైపు పాదయాత్ర చేస్తున్న జాతీయ అధ్యక్షుడు సమయంలో వినోద్ జాఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, అదుపులోకి తీసుకునే సమయంలో మహిళలతో సహా నిరసనకారులపై పోలీసులు బలప్రయోగం చేశారని ఎఐఎస్‌ఎ కార్యకర్తలు ఆరోపించారు.

### నిరసనలకు అనుమతి నిరాకరణ

జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసనలకు అనుమతి ఇవ్వలేదని పోలీసులు తెలిపారు. దీంతో ఆ ప్రాంతంలో పరిసరాల్లో అదనపు సిబ్బందిని, బారికేడ్లను మోహరించారు. అనధికారిక సమావేశాలను నివారించడానికి ఆ ప్రాంతంలో నిషేధాజ్ఞలు కూడా విధించారు. నిరసన స్థలానికి చేరుకోకుండా నిరసనకారులను అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా, ఫిరోజ్ షా రోడ్డు వద్ద పలువురు నిరసనకారులు బారికేడ్లను దాటేందుకు ప్రయత్నించడం కనిపించింది. జంతర్ మంతర్ వద్ద ఎలాంటి సమావేశాలకు అనుమతి లేదని, ప్రజలు అక్కడ గుమిగూడవద్దని కోరుతూ పోలీసు సిబ్బంది కూడా పదేపదే బహిరంగ ప్రకటనలు చేశారు. అదే విధంగా నిరసన ప్రదేశంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను కూడా నిలిపివేశారు.

### గాంధీజయంతి రోజున అరెస్టులా?

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపినందుకు ప్రతిపక్షనాయకులు, యువత, విద్యార్థి సంఘాల నాయకులను గాంధీజయంతి రోజున అదుపులోకి తీసుకోవడం సిగ్గుక చేటని ప్రతిపక్షాలు విమర్శించాయి. కేంద్ర ప్రభుత్వ, పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండించాయి. శాంతి దూత జయంతి రోజున ఇలా ప్రవర్తించడం సిగ్గుచేటు తనను బస్సులోకి లాక్కెళ్తుండగా ఆర్‌జెడి నాయకుడు మనోజ్ ఝూ అన్నారు. వారికి గాంధీ సారం అర్థం కాదన్నారు. తమ పార్టీ యువజన విభాగం కార్యకర్తలతో కలిసి ఘటనా స్థలానికి వచ్చిన సిపిఐ(ఎం) నేత బృందా కరత్, ఢిల్లీలోని ప్రతి వీధి జంతర్ మంతర్‌గా మారిపోయిందని అన్నారు. 'గాడ్సే గాంధీ హంతకుడు. కేంద్రంలో గాడ్సే భావజాలం ఉన్నవాళ్ళే అధికారంలో ఉన్నారు. ఈరోజు వాళ్ళు ఓట్ల దొంగతనం ద్వారా ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నారు' అని ఆమె అన్నారు. 'సుమారు 13 కోట్ల మంది పౌరుల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి; ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన చట్టాన్ని మార్చాలి. ఈ రోజు ప్రతి వీధి, ప్రతి పోలీసు బస్సు జంతర్ మంతర్ (నిరసన వేదిక) లా మారింది' అని కరత్ అన్నారు. నేటి భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పటిలాగే ఉందని యోగేంద్రం యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. 'వాక్ స్వేచ్ఛ లేదు... భారత ప్రజల తరఫున ప్రధాన ఎన్నికల అపరాధి జ్ఞానేశ్ కుమార్ తొలగింపును తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. గాంధీ జయంతి నాడు 'సత్యాగ్రహం' హత్యకు గురైందని నిఖిల్ డే అన్నారు. 'మహాత్మా గాంధీని, ప్రజాస్వామ్యం, ప్రజా జీవితంలో నిజాయితీ కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకునే రోజున, ఓటును రక్షించుకోవడానికి, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి నిరసన తెలుపుతున్న వారిని అణచివేయడానికి మోదీ ప్రభుత్వం పోలీసు బలగాలను ఉపయోగిస్తోందని సిపిఐ ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఓటు దొంగ' రాజీనామా చేయాలి! నిర్బంధాలతో మా పోరాటాన్ని అణచివేయలేరు అని ఆ పార్టీ పేర్కొంది.

# భారత్‌కు 'పసిడి' పంట

### ఏసియన్ గేమ్స్‌లో ఒకేరోజు ఆరు బంగారు పతకాలు



**నగోయ :** ఆసియా క్రీడల్లో పదమూడో రోజు భారత్‌కు పసడి పతకాల పంట పండింది. బాక్సర్లు, రెజ్లర్లు, హాకీ మహిళాక్రీడాకారులు అదరగొట్టడంతో శుక్రవారం ఒక్కరోజే ఆరు గోల్డ్ మెడల్స్ భారత్ సొంతమయ్యాయి. దీంతో పతకాల పట్టికలో భారత్ ఐదో స్థానానికి చేరుకుంది. తొలుత లవ్లీనా మొదలు పెట్టగా.. ఆ తరువాత పర్వీన్, సుజీత్, అంకుష్ సత్తా చాటారు. కేవలం అర గంట వ్యవధిలో భారత్ మూడు స్వర్ణాలను నెగ్గింది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 76 పతకాలు ఉండగా.. వీటిలో 16 స్వర్ణాలు, 25 రజతాలు, 35 కాంస్యాలు ఉన్నాయి. శుక్రవారం నాడు భారత మహిళా బాక్సర్లు లవ్లీనా, పర్వీన్ హుడా బంగారు పతకాలు గెలిచారు. తొలుత 75 కేజీల విభాగంలో చైనాకు చెందిన బావో జియిని లవ్లీనా ఓడించింది. దీంతో ఆసియా క్రీడల్లో బాక్సింగ్ విభాగంలో స్వర్ణం సాధించిన రెండో భారత మహిళా బాక్సర్‌గా నిలిచింది. తర్వాత 65 కేజీల విభాగంలో పర్వీన్ చైనీస్ తైపీ బాక్సర్ నీన్ చిన్ చెన్‌ను 3-2 తేడాతో ఓడించింది. పురుష బాక్సర్ అంకుష్ 80 కేజీల విభాగంలో అదరగొట్టాడు. ఫైనల్‌లో 4-0 తేడాతో తన ప్రత్యర్థి దక్షిణ కొరియాకు చెందిన కిమ్ మిన్‌సూయింగ్‌పై విజయం



సాధించాడు.

**రెజ్లింగ్‌లో సూపర్ పట్టు..**
రెజ్లర్ సుజీత్ సూపర్ పట్టుతో బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. ఆరంభంలో ఒలింపిక్ ఛాంపియన్, తజకిస్థాన్‌కు చెందిన కుదీవ్ పైచేయి సాధించాడు. ఆ తర్వాత సుజీత్ పుంజుకొని.. తజికిస్థాన్ రెజ్లర్‌ను దెబ్బ కొట్టాడు. చివరికి 10-9 తేడాతో సుజీత్ పైచేయి సాధించి స్వర్ణం గెలిచాడు.

**సెపక్‌తక్రాలో కాంస్యం..** భారత సెపక్‌తక్రా జట్టుకు కాంస్య పతకం వచ్చిం ది. సెమీస్‌లో భారత్‌పై జపాన్ విజయం సాధించింది. దీంతో ఆ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. సెమీస్‌కే పరిమితమైన భారత్ కాంస్యంతో సరిపెట్టుకుంది.

**హాకీలో గోల్డ్ ..**శుక్రవారం జరిగిన హాకీ మహిళల ఫైనల్‌లో చైనాను ఢీ కొట్టిన భారత్ 1-0 తేడాతో విజయం సాధించింది. దీంతో ఆసియా గేమ్స్‌లో 44 ఏళ్ల నిరీక్షణకు తెర దించుతూ మన అమ్మాయిలు పసిడి పతకాన్ని ముద్దాడారు. అలాగే ఈ విజయంతో 2028 లాస్ ఏంజిలెస్ ఒలింపిక్స్‌కు కూడా టీమ్‌ఇండియా నేరుగా అర్హత సాధించింది.

# పాక్‌పై 'స్వర్ణం' నెగ్గాలంటే... 'స్పిన్నే' కీలకం



ఆసియా క్రీడల్లో పసిడి పతకం సాధిస్తుందని భారత క్రికెట్ జట్టుపై భారీ అంచనాలే ఉన్నాయి. ఇక ప్రత్యర్థి కూడా పాకిస్థాన్ కావడంతో శనివారం జరగబోయే మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అనిశ్చితికి మారుపేరైన పాక్ క్రికెట్ జట్టు.. ఆడేది భారత్‌తో అనగానే సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతుంది.

**బ్యాటింగ్ అత్యంత కీలకం..** శ్రీలంకతో సెమీస్ మ్యాచ్‌ను చూశాక.. నిషిన్ మైదానంలో బ్యాటింగ్ ఎంత కష్టమో తెలిసొచ్చింది. ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ రాణించడంతో సరిపోయింది. మిగతా బ్యాటర్ల నుంచి పెద్దగా సహకారం లేదు. మరోవైపు మన ప్రధాన బౌలర్లు శ్రీలంకను బెంబేలెత్తించారనుకోండి. కానీ, బ్యాటింగ్‌లో మెరుగు కాకపోతే పాకిస్థాన్‌తో ప్రమాదం తప్పదు. ఇప్పుడు ఫైనల్‌కూ అదే వేదిక. కానీ, ఏ పిచ్‌ను వాడతారో తెలియదు. కానీ, అన్ని పిచ్లూ ఒకేలా ఉంటాయని టీమ్‌ఇండియా ఆటగాడు అక్షర్ పటేల్ వ్యాఖ్యానించాడు.

**స్పిన్ని ఎదుర్కొంటేనే..** నిషిన్ పిచ్‌పై స్పిన్ తీవ్ర ప్రభావం చూపిస్తుంది. సెమీస్లో భారత్ జస్ప్రీత్ బుమ్రా ఒక్కడినే ప్రధాన పేసర్గా తీసుకుంది. స్పిన్నర్లు హవా చూపిన ఈ ప్పినా బుమ్రా వికెట్లు తీయడం భారత్‌కు పెద్ద ప్లస్పాయింట్. పార్ట్‌టైమ్ స్పిన్నర్ అభిషేక్ శర్మ కూడా రెండు వికెట్లు తీసి సత్తా చాటాడు. ప్రస్తుతం అతడు హ్యాట్రిక్ మీదున్నాడు. లంకపై చివరి రెండు వికెట్లును వరుస బంతుల్లో పడగొట్టాడు. అందుకే, స్పిన్‌ను కాచుకొని ఆడితేనే విజయం దరిచేరుతుంది. ఫైనల్లోనూ భారత్ దాదాపు ఇదే కూర్పుతో దిగే అవకాశం ఉంది.

**ఆసియా క్రీడలు.. భారత్ పసిడి 'పట్టు'.. గోల్డెన్ 'పంచ్'**

**పాకిస్థాన్ పరిస్థితేంటి?**

టీమ్‌ఇండియాను చూస్తే.. ఇది కచ్చితంగా బెస్ట్ టీమ్ అని అర్థమవుతుంది. కానీ, ఇప్పుడున్న పాకిస్థాన్ జట్టును అంచనా వేయాలంటే కష్టమే. ఆసియా క్రీడల బరిలోకి దిగిన ఆ జట్టులో కొత్త వాళ్లే ఎక్కువ. దీంతో వారు ఎలా ఆడతారనేది భారత ప్లేయర్లు గమనించాలి. అనవసరమైన భావోద్వేగాలకు పోకుండా నియంత్రణతో ఆడితేనే పాక్‌ను మట్టికరించి స్వర్ణం నెగ్గొచ్చు.

**వీరంతా రాణిస్తే..** సెమీస్‌లో అభిషేక్ శర్మ, సంజు శాంసన్ పెద్దగా పరుగులు చేయలేదు. పాక్ స్పిన్నర్లు బ్రార్ అహ్మద్, సుఫియాన్ మోకిమ్‌ను ఎలా ఎదుర్కొంటారనే దానిపైనే భారత విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. సైమ్ అయూబ్, అరాఫత్ మిన్హాస్ పార్ట్ టైమ్ స్పిన్‌తో ఇబ్బంది పెడతారు. తిలక్ వర్మ, శివమ్ దూబె కూడా పరుగులు చేయలేక విఫలమయ్యారు. ఫైనల్లో ఆ లోటును తీర్చే ప్రయత్నం చేయాలి.

## సైన్స్

# గమ్యం లేని తీరాలకు అంతులేని ప్రయాణం

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' 1977 సెప్టెంబర్ 5న ప్రయోగించిన 'వాయేజర్ I' అంతరిక్ష నౌకను మొదట బృహస్పతి (జూపిటర్), శని (శాటర్న్) గ్రహాలను అధ్యయనం చేయడానికే రూపొందించారు. అయితే దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత అది మానవులు నిర్మించిన వస్తువుల్లో భూమికి అత్యంత దూరంలో ఉన్న అంతరిక్ష నౌకగా నిలిచింది. అంతేకాదు, 'అంతర్‌నక్షత్ర అంతరిక్షం'లోకి ప్రవేశించిన తొలి మానవ నిర్మిత యంత్ర ప్రయాణంగా చరిత్ర సృష్టించింది. 2012 ఆగస్టు 25న హీలియోపాజ్ అనే సరిహద్దును వాయేజర్ I దాటింది. ఈ సరిహద్దు వరకు సూర్యుని అయస్కాంత క్షేత్రం, సౌర గాలుల ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత ప్రారంభమయ్యేది నక్షత్రాల మధ్య విస్తరించిన అంతరిక్షం. ప్రస్తుతం వాయేజర్ I అదే ప్రాంతంలో తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. దానితో పాటు భూమి నాగరికతకు ప్రతీకగా రూపొందించిన ప్రసిద్ధ గోల్డెన్ రికార్డు కూడా తనతో తీసుకెళుతున్నది. ఇందులో భూమిపై జీవజాతులు, సంగీతం, శుభాకాంక్షలు, ప్రకృతి ధ్వనులు వంటి సమాచారం భద్రపరిచారు. వాయేజర్ Iకు సౌర ఫలకాలు లేవు. విద్యుత్ ఉత్పత్తి కోసం అది మూడు రేడియో ఐసోటోప్ థర్మోఎలక్ట్రిక్ జనరేటర్లను (ఆర్‌టిజిలను) ఉపయోగిస్తోంది. వీటిలో ఉన్న ప్లూటోనియం 238 సహజ రేడియోధార్మిక క్షయంతో ఉత్పత్తయ్యే ఉష్ణాన్ని విద్యుత్తుగా మారుస్తాయి. అయితే ఈ ప్రక్రియతో లభించే విద్యుత్ ప్రతి సంవత్సరం సుమారు 4 వాట్లు తగ్గిపోతోంది. అందువల్ల శక్తిని ఆదా చేయడానికి నాసా శాస్త్రవేత్తలు ఒక్కో శాస్త్రీయ పరికరాన్ని క్రమంగా నిలిపివేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నాసా లోఎనర్జీ ఛార్జ్ పార్టికల్స్ పరికరాన్ని కూడా నిలిపివేసింది. ప్రస్తుతం మాగ్నెటోమీటర్, ప్లాస్మా వేవ్ సబ్‌సిస్టమ్ అనే రెండు పరికరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఇవి ఇప్పటివరకు ఏ అంతరిక్ష నౌకా చేరని ప్రాంతం నుంచి అమూల్యమైన శాస్త్రీయ సమాచారాన్ని భూమికి పంపిస్తున్నాయి. కొన్ని సంవత్సరాల తర్వాత వాయేజర్ Iలో మిగిలిన విద్యుత్తు కూడా పూర్తిగా తగ్గిపోతుంది. అప్పుడు దాని శాస్త్రీయ పరికరాలు, సమాచార ప్రసార వ్యవస్థ శాశ్వతంగా నిలిచిపోతాయి. అయినప్పటికీ దాని ప్రయాణం ఆగదు. ఎలాంటి సంకేతాలు పంపలేని నిశ్శబ్ద యానంగా అది పాలపుంత గెలాక్సీలోని అంతర్‌నక్షత్ర అంతరిక్షంలో తన నిర్దేశిత మార్గంలో కోట్లాది సంవత్సరాల పాటు ప్రయాణిస్తూనే ఉంటుంది. 1970ల లో మానవులు నిర్మించిన ఈ చిన్న అంతరిక్ష నౌక, ఒక రోజు తన సృష్టికర్తలు, వారి నాగరికత కూడా లేకపోయినా, విశ్వంలో భూమి ఉనికికి మౌన సాక్ష్యంగా నక్షత్రాల మధ్య నిరంతరం ప్రయాణిస్తూ ఉండవచ్చు. అదే వాయేజర్ I గొప్పతనం.



# పాలపుంతలో కొత్త 'డైసన్‌స్ఫియర్'!



ఖగోళ శాస్త్రవేత్తలు పాలపుంత (మిల్కీవే) గెలాక్సీలో ఒక నక్షత్రాన్ని చుట్టుముట్టి, దాని నుంచి వచ్చే శక్తిని సేకరించడానికి ఏర్పడే భారీ అంతరిక్ష నిర్మాణం (డైసన్ స్ఫియర్)గా అనుమానిస్తున్న ఏడు నక్షత్రాలను గుర్తించారు. అయితే ఇవి నిజంగా గ్రహాంతరవాసులు నిర్మించిన కృత్రిమ నిర్మాణాలేనని ఇప్పటివరకు ఎలాంటి నిర్ధారణ జరగలేదు. ఇవి కేవలం మరింత పరిశోధనకు అర్హమైన అభ్యర్థులు మాత్రమే. శాస్త్రవేత్తలు గైయా, 2 ఎంఎఎస్ఎస్ (మాస్), డబ్ల్యుఐఎస్ఇ (వైజ్) అనే ఆకాశ సర్వేల ద్వారా సేకరించిన సమాచారాన్ని ఉపయోగించి దాదాపు 50 లక్షల నక్షత్రాలను విశ్లేషించారు. సాధారణంగా కనిపించే కాంతిలో సహజంగానే కనిపిస్తూ, మధ్యపరారుణ (మిడ్ ఇన్‌ఫ్రారెడ్) తరంగదైర్ఘ్యాల్లో అసాధారణంగా ఎక్కువ శక్తిని విడుదల చేస్తున్న నక్షత్రాలను వారు ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పరిశోధనలో గుర్తించిన ఏడు నక్షత్రాలూ ఎండ్వార్ఫ్ (ఎం డార్ఫ్ లేదా రెడ్ డార్ఫ్) రకానికి చెందినవి. వీటి నుంచి వస్తున్న పరారుణ వికిరణం ప్రస్తుతం తెలిసిన కొన్ని సహజ ఖగోళ ప్రక్రియలతో సులభంగా వివరించలేని విధంగా ఉంది. అందువల్ల వీటిని మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. డైసన్ స్ఫియర్ అనే భావనను 1960లో భౌతిక శాస్త్రవేత్త ఫ్రీమన్ డైసన్ ప్రతిపాదించాడు. అత్యంత అభివృద్ధి చెందిన ఒక నాగరికత తన నక్షత్రం విడుదల చేసే అపార శక్తిని వినియోగించుకోవడానికి, ఆ నక్షత్రం చుట్టూ అనేక ఉపగ్రహాలు లేదా శక్తి సేకరణ నిర్మాణాలను ఏర్పాటు చేయవచ్చని ఆయన సూచించాడు. ప్రజాదరణ పొందిన చిత్రాల్లో చూపినట్లుగా అది పూర్తిగా నక్షత్రాన్ని కప్పేసే ఘన గోళం కావాల్సిన అవసరం లేదు. అనేక చిన్న నిర్మాణాల సముదాయం కూడా పాక్షిక డైసన్ స్ఫియర్‌గా పరిగణించవచ్చు. అలాంటి నిర్మాణాలు నక్షత్ర శక్తిని గ్రహించి, ఉపయోగించిన తర్వాత మిగిలిన శక్తిని 'వ్యర్థ ఉష్ణం' (వేస్ట్ హీట్) రూపంలో మధ్యపరారుణ వికిరణంగా విడుదల చేస్తాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే ఈ ఏడు నక్షత్రాల విషయంలో కూడా గ్రహాంతరవాసుల నిర్మాణాలు ఉన్నాయని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. వాటి అసాధారణ పరారుణ వికిరణానికి అంతరిక్ష ధూళి, నేపథ్య గెలాక్సీలు లేదా ఇంకా పూర్తిగా అర్థం కాని ఇతర సహజ ఖగోళ ప్రక్రియలే కారణమై ఉండే అవకాశం ఎక్కువగా ఉందని పరిశోధకులు అంటున్నారు.

# రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యాన్ని అడ్డుకోవాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

### సిపిఐ ఆధ్వర్యంలో గాంధీ జయంతి, మత సామరస్య దినోత్సవం

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** దేశ సమగ్రతను ప్రజా స్వామ్య విలువలను కాపాడుకోవడానికి ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని మతోన్మాదం లేని సమాజ నిర్మాణంకోసం ప్రజలంతా ఐఖ్యంగా పోరాడాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని రైల్వే స్టేషన్ సెంటర్‌లో తమ సామరస్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి దేశసమగ్రత ప్రజా స్వామ్యాన్ని పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జరిగిన సభలో పాషా మాట్లాడుతూ ఎన్నికల సంఘం సిబిఐ ఇడి వంటి రాజ్యాంగబద్ధ స్వతంత్ర సంస్థలను రాజకీయ కీలుబొమ్మలుగా మార్చి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సలిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మేయర్ మూడ్ గణేష్ నాయకులు కంచర్ల జమలయ్య, వి.పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళీ, భూక్య ధ్రస్తు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, కందులు భాస్కర్, కొమారి హన్మంతరావు, వి. పద్మజ, రత్నకుమారి, శాంతి శ్రీ, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, జక్కుల రాములు, ఎండి యూసుఫ్, బండి నర్సింహా, బోయిన విజయ్ కుమార్, దుర్గ య్య, సత్యనారాయణాచారీ, మండల రాజేశ్వరరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, యాంద్ర మహేష్, జనార్ధన్, నిమ్మల రాంబాబు, గిరి షాహీన్, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** భారత కమ్యూనిస్టు పార్టీ మహబూబ్ నగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో 157వ మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని గడియారం చౌరస్తాలో గల గాంధీ విగ్రహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ బి.బాలకిషన్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపల్లి రాము, పి.సురేష్, కె.పద్మావతి, కౌన్సిల్ సభ్యులు మహేష్ బాబు, సత్యనారాయణ రెడ్డి, చాంద్ భాషా, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు రహిమన్, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఇందిరక్క, భవాని, గుడ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** గాంధీజీ పోరాట స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను, ప్రజల ఓటు హక్కును కాపాడుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా సిపిఐ జాతీయ సమితి పిలుపు మేరకు శుక్రవారం ఠాగూర్ స్టేడియం ముందున్న గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్, సిపిఐ మండల కార్యదర్శి వనం సత్యనారాయణ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హుల ఓట్లను తొలగించడం సరికాదని, ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు నక్క వెంకటస్వామి, కాదండి సాంబయ్య, మామిడి గోపి, ఎగుడ మొండి, కౌన్సిలర్లు కౌడగాని సాంబయ్య, మీనుగు ముని, పార్టీ ప్రజా సంఘాల నాయకులు గుమాస మల్లేష్, కారుకూరి రాయలింగు, మాదాస్ శంకర్, ఎండి హుస్సేన్, రాంపల్లి రాజం, కోదాటి లక్ష్మణ్ రావు, కందుల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహాత్మా గాంధీ ఆశయాలను ప్రజలు కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా గోదావరిఖని చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి ఆయన సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కనకరాజులతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సర్ ప్రక్రియ పేరుతో 13 కోట్ల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్పొరేటర్ సూర్య, నాయకులు తొడుపునూరి రమేష్ కుమార్, శనిగరపు చంద్ర శేఖర్, కరీం, పడాల కనకరాజు, సిరిసిల్ల మల్లేష్, నూకల మొండి, జగన్, జగదీశ్వర్, సిర్ర మైసయ్య ,ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రపంచానికి శాంతి, అహింసా మార్గాన్ని పరిచయం చేసిన మహాత్మా గాంధీ స్ఫూర్తితో దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న మతోన్మాదం, కులోన్మాదం, ప్రాంతీయ ఉన్మాదాన్ని అరికట్టేందుకు ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి.ఫయాజ్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జీ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా సీపీఐ జాతీయ సమితి పిలుపులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, జిల్లా కార్యదర్శి మధుగౌడ్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, శేఖర్, సంఘం కృష్ణ, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సభ్యులు వంకేశ్వరం, శ్రీనివాసులు, సీపీఐ నాయకులు బాలపీర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొత్త సంతోష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ (హైదరాబాద్) :** అహింస, శాంతి మార్గంలో నడవడమే గాంధీకి నిజమైన నివాళి అని ఉమా మహేష్ అన్నారు. శుక్రవారం మహాత్మాగాంధీ 157వ జయంతి సందర్భంగా జగద్గిరిగుట్టలోని గాంధీ విగ్రహానికి సీపీఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. జనసేన నాయకుడు సతీష్ మాట్లాడుతూ జగద్గిరిగుట్ట ఆలయ భూములను పరిరక్షించాలని హైకోర్టు సూచించినప్పటికీ రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు స్పందించకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకునేలా సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు బుద్ధి ప్రసాదించాలని కోరుతూ సీపీఐ నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

**ప్రజాపక్షం/జనగామ:** బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, శాంతి సామరస్యంగా ఉద్యమం నడిపి భారత దేశానికి స్వాతంత్ర్యం తేవడంలో కీలకపాత్ర వహించిన జాతిపిత మహాత్మగాంధీని కాల్చి చంపిన ఆర్ఎస్ఎస్ నాయకుడు నాథురామ్ గాడ్సే వారసుడైన ఆర్ఎస్ఎస్, బీజేపి నాయకుల పాలన మనకొద్దని, లౌకిక వాద ప్రజాస్వామ్య భారత రాజ్యాంగమే మనకు ముద్దని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేడు ఎన్నికల్లో సీట్లు గెలవడానికి ఓట్ల దొంగతనానికి పాల్పడుతూ, దొంగ ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేష్ కుమార్‌ను ఎన్నికల కమిషనర్‌గా నియమించి సర్ ద్వారా 13 కోట్ల కోట్లను తీసేయించి దొంగ ఈవీఎంల ద్వారా బీజేపికి ఓట్లు వేయించి గెలిపించే దుష్ట సాంప్రదాయాన్ని పాతర వేయాలని డిమాం డ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ జనగామ జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు మోటె శ్రీశైలం, చామకూర యాకూబ్, దయా నగేష్, పుప్పల ఐలయ్య, సుదర్శనం, కార్మికులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/షాబాద్:** కుల మతాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటే అనే నినాదంతో దేశాని గౌరవించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో సిపిఐ పార్టీ నాయకులతో కలిసి గాంధీ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామస్వామి, పాలమాకుల శ్రీశైలం, రుక్కయ్య, ప్రభులింగం, రఘురాం, సుధాకర్, మంజుల, షబ్బీర్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



షాబాద్‌లో..



భద్రాద్రి కొత్తగూడెంలో..



మహబూబ్‌నగర్‌లో..



బెల్లంపల్లిలో..



పెద్దపల్లిలో..



జనగామలో..



కుత్బుల్లాపూర్‌లో..



నాగర్‌కర్నూల్‌లో..



# సిఆర్ ఫౌండేషన్‌లో ఘనంగా గాంధీ జయంతి

**యూపిఐ లావాదేవీలపై టారిఫ్‌ల అంశంపై చర్చా గోష్ఠిలో పాల్గొన్న సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు కె. నారాయణ, పల్లా వెంకట్ రెడ్డి**

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** గాంధీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో గాంధీ 157వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు కె. నారాయణ, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా వెంకట్‌రెడ్డి, ప్రఖ్యాత ఆర్థికవేత్త డి. నర్సింహారెడ్డిలు విచ్చేసి మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కె. నారాయణ మాట్లాడుతూ (సిఆర్) చంద్ర రాజేశ్వర రావు ఆకాంక్షలకు అనుగుణంగా 1999 అక్టోబర్ 2వ తేదిన సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా వృద్ధాశ్రమం ప్రారంభించుకొని నేటికి 27 సంవత్సరాలు అయిందని గుర్తు చేసుకున్నారు. అనంతరం యూపిఐ టారిఫ్ లావాదేవీలపై జరిగిన చర్చాగోష్ఠిలో మ్యాగ్జ్ కార్డ్, వీసా వంటి సంస్థలు యూపీఐ చెల్లింపుల వల్ల నష్ట పోతాయని భారత్ అమెరికా వ్యాపార చర్చల సందర్భంగా అమెరికా లేవనెత్తడం వల్ల భారత ప్రభుత్వం రూ. 2 వేల పైబడిన యూపీఐ చెల్లింపులపై 0.4 శాతం పన్ను విధించడం వల్ల భారత్ ఎంతో నష్టపోతుందని నారాయణ, నర్సింహారెడ్డిలు తెలిపారు. యూపీఐ వాడకం వల్ల సంవత్సరానికి 314 లక్షల కోట్ల రూపాయల టర్నోవర్ జరిగి 57 వేల కోట్ల రూపాయల భారం వ్యాపారులపైన, ప్రజలపైన పడనున్నదని తెలిపారు. 2 వేల లోపు లావాదేవీలలో 95 శాతం ఉన్న వాటి విలువ మొత్తం టర్నోవర్‌లో 20 శాతానికి లోబడే ఉందని 80 శాతం టర్నోవర్ పై పన్ను విధించే అవకాశం ఉందని దాని వాణిజ్య సంస్థల భరిస్తాయని అది వినియోగదారులపైనే పడవచ్చని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ డాక్టర్ కె. రజని, కార్యదర్శి కంఠపాటి అజయ్ కుమార్, కోశాధికారి చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్రం జోష్యభట్ల కల్పన, సభ్యులు వి. లలిత, కసవర్థి జోష్న, రాజగోపాల్ రెడ్డి, చెన్నమనేని వెంకటేశ్వర్‌రావు, రాజేంద్రరావు, అరుణకుమార్, మేనేజర్ శ్రీనివాస్ ఆశ్రమవాసులు పాల్గొన్నారు.

**నెక్లెస్ రోడ్‌లో కోలాహలంగా**

# ‘వాకర్స్ ఇంటర్నేషనల్’ 5కె వాకథాన్

## ఉచితంగా మొక్కలు పంపిణీ చేసిన హెచ్ఎండిఏ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 40 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని సంస్థ డిస్ట్రిక్ట్ 301, ఏరియా 3, రీజియన్ 9 ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించిన 5కె వాకథాన్ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ప్రజల్లో ఆరోగ్యం, శారీరక ఫిట్నెస్, క్రమం తప్పకుండా నడక ప్రాముఖ్యత, పర్యావరణ స్పృహ పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ 2026 అధ్యక్షులు డాక్టర్ పి. రవికాంత ముఖ్య అతిథిగా హాజరైన ఈ వాకథాన్‌లో ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, వైద్యులు, స్వచ్ఛంద కార్యకర్తలు, ఫిట్నెస్ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎండిఏ అర్బన్ ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో వాకథాన్‌లో పాల్గొన్న వారికి, సాధారణ ప్రజలకు ఉచితంగా ఇళ్లలో పెంచుకునే మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మొక్కలు నాటి నగరాన్ని పచ్చదనంతో నింపాలని ప్రోత్సహించారు. అర్బన్ ఫారెస్ట్ విభాగం డైరెక్టర్ రోహిత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్. చక్రపాణి, ఫారెస్ట్ మేనేజర్ వి. జి. సుందరేశ పర్యవేక్షణలో ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. నాలుగు దశాబ్దాల సేవా ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న వాకర్స్ ఇంటర్నేషనల్, ఈ వాకథాన్ ద్వారా నగర ప్రజలకు ‘శారీరక ఆరోగ్యం పర్యావరణ పరిరక్షణ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి’ అనే బలమైన సందేశాన్ని అందించింది. నగరంలో పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పరస్పరం అనుసంధానమై ఉన్నాయన్నారు.

**గాంధీ చూపిన మార్గం మార్గదర్శకం**



జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా అమీర్‌పేట్‌లోని హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండిఏ) ప్రధాన కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ శ్రీవత్స కోట ముఖ్యఅతిథిగా పాల్గొని మహాత్మునికి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్లానింగ్ ఎం. రాజేంద్ర ప్రసాద్ నాయక్, పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ అందించిన సేవలు, ఆయన ఆదర్శాలు నేటి సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకమని ఈ సందర్భంగా అధికారులు కొనియాడారు.



# గాంధీ ఆశయాలే దేశానికి మార్గదర్శకం: జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా గాంధీ ఆశయాలు నేటికీ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు. బిసి కమిషన్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి చైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యులు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జి. నిరంజన్ మాట్లాడుతూ అహింస, సహాయ నిరాకరణ వంటి మార్గాల ద్వారా మహాత్మా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని ముందుకు నడిపి దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. సభ్యుడు రాపోలు జయప్రకాశ్ మాట్లాడుతూ నేటి నాయకులు గాంధీజీ చూపిన మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. మరో సభ్యుడు తిరుమలగిరి సురేందర్ మాట్లాడుతూ గాంధీజీ సాగించిన పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ ఎస్. సునీత, సెక్షన్ అధికారులు సతీష్ కుమార్, ఇర్ఫాన్ బిన్ ఖలీద్, రీసెర్చ్ అసోసియేట్ లక్ష్మీ నారాయణతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# గాంధీ మార్గంలో ప్రజాసేవే నిజమైన నివాళి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు నమ్మకమైన, సురక్షితమైన రవాణా సేవలు అందించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని టిజిఎస్ ఆర్‌టిసి ఈడి సిహెచ్. వెంకన్న అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సమాజ ప్రగతికి, విలువల పరిరక్షణకు గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాలు నేటికీ ఆదర్శప్రాయమన్నారు. గాంధీజీ బోధించిన క్రమశిక్షణ, సేవా నిరతిని ఆర్‌టిసి ఉద్యోగులు తమ విధుల్లో పాటిస్తూ సంస్థ అభివృద్ధికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ బాపూజీ ఆలోచనలను ఆచరించి ఆయన చూపిన మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎఫ్ఏ విజయపుష్ప, సిఎంఇ రాజశేఖర్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని గాంధీజీకి నివాళులర్పించారు.

# సాగునీటి సమస్యకు పరిష్కారం

**సింగోటం- గోపాల్‌దిన్నె లింక్ కెనాల్ పనులు పునఃప్రారంభించిన మంత్రి జూపల్లి**



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సింగోటం గోపాలదిన్నె రిజర్వాయర్ లింక్ కెనాల్ పనులను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం వల్లభాపూర్ వద్ద పునః ప్రారంభించారు. ఈసందర్భంగా కాలువ పనుల పురోగతిని పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సింగోటంగోపాలదిన్నె లింక్ కెనాల్ పూర్తయితే ఈ ప్రాంత రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కాలువ నిర్మాణం ద్వారా ఆయకట్టు పరిధిలోని రైతులకు సాగునీరు అందించి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయడమే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను సమన్వయంతో పూర్తి చేసి నిర్ణీత సమయంలో కాలువను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రాంత రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు కాలువ పనులు తిరిగి ప్రారంభం కావడంతో ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురించాయి.

**భూసేకరణ ఇలా**

కొల్లాపూర్, కోడేరు, పానగల్, వీపనగండ్ల మండలాల్లో 350 ఎకరాలకు పైగా భూములు కోల్పోతున్నట్లు భూసేకరణ రికార్డులో నమోదు చేశారు. సింగోటం శివారులో 12.10 ఎకరాలు, నర్సాయిపల్లి 40.02 కొర్లకుంట 52.26 బొల్లారం 73.13 వల్లభాపురం 87.03, తెల్లరాళ్లపల్లి 3.16 ఎకరాలు, తూంకుంట సంగినేనిపల్లి మధ్య 82.02 ఎకరాలు సేకరించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో ప్రభుత్వ భూమి 71.20 ఎకరాలు అయితే వల్లభాపురం, బొల్లారం గ్రామాల్లో 173 మంది రైతులు ఎకరానికి రూ.11.58 లక్షల చొప్పు చెక్కులు తీసుకున్నారు. మిగతా గ్రామాల రైతులు పెంచి ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావు నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, కొల్లాపూర్ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్ర రెడ్డి, మాజీ జెడ్పిటిసి కృష్ణ ప్రసాద్, సర్పంచులు సుదర్శన, రెడ్డి, రామన్ గౌడ్, రాముడు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బసవరాజ్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలపై

# కాంగ్రెస్ జాతీయ నాయకత్వం జోక్యం చేసుకోవాలి : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని టిజి ట్రాన్స్‌కో, టిజి జెన్‌కో, సింగరేణి, డిస్కంలాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలపై కాంగ్రెస్ జాతీయ నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు కోరారు. ప్రభుత్వ ఆస్తుల యాజమాన్యం లేదా నియంత్రణను ప్రభావితం చేసే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని, ట్రాన్స్‌కో ఐపిఒ, 26 శాతం ఈక్విటీ డైల్యూషన్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు శుక్రవారం లేఖ రాశారు. టిజి ట్రాన్స్‌కోలో 26 శాతం వాటా ఎందుకు తగ్గిస్తున్నారని, జెన్‌కోను ఏం చేయబోతున్నారని, సింగరేణి సంస్థ విషయంలో ఎటువంటి ప్రతిపాదనలు ఉన్నాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదిత టాన్స్‌కో 26 శాతం ఈక్విటీ డైల్యూషన్/ఐపిఒల (వాటా తగ్గింపు) నిర్ణయం మొత్తం ప్రభుత్వ విద్యుత్ సంస్థల మనుగడనే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. టిజి ట్రాన్స్‌కో పరిధిలో 29, 400 కేవీ సబ్‌స్టేషన్లు, 107, 220 కెవి సబ్ స్టేషన్లు, 337, 132 కెవి సబ్ స్టేషన్లు, 31,420కు పైగా సర్క్యూట్ కిలోమీటర్ల ఇహెచ్‌టి లైన్లు, 1,184 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 43,848 ఎంవిఏ ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యం ఉన్నాయని వివరించారు. టిజి ట్రాన్స్‌కో తర్వాత జెన్‌కో, సింగరేణి, డిస్కంలు కూడా ఇదే బాట పట్టనున్నాయా? సమాధానం చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా ఆస్తుల మానిటైజేషన్, ప్రైవేటీకరణ విధానాలను పదేపదే ప్రశ్నించారని, ఎల్‌ఐసి, విద్యుత్ రంగం వంటి వ్యూహాత్మక ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా తగ్గింపు అంశంపైన కూడా రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారని హరీశ్‌రావు గుర్తు చేశారు.



# పుస్తకానికి ఎఐ ప్రత్యామ్నాయం కాదు

## మరసం సభలో మాజీ మంత్రి హరీశ్‌రావు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మనిషి తన అనుభవాలతో, గుండె లోతుల్లోంచి రాసే కవిత్వానికి, పుస్తకానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ప్రత్యామ్నాయం కాదని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. పిల్లల్లో, పెద్దల్లో పుస్తక పఠనాన్ని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మంజీరా రచయితల సంఘం (మరసం) 40 వసంతాల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. కవులు అంటే కవిత్వాన్ని వెలువరించే వారు మాత్రమే కాదని, మాటకు, పాటకు, ఆటలకు ప్రాణంపోసే వారని క్రియాశీలకంగా నిరూపిస్తున్న మరసం భావితరాలకు దిక్సూచి అని పేర్కొన్నారు. సాహిత్య అకాడమీకి చైర్మన్‌ను నియమించలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని విమర్శించారు. రేపటితరం కొరకు కవులను, సాహిత్యాన్ని ప్రోత్సహించాలని హరీశ్‌రావు సూచించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి, ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్, టివిన్‌జిఒల సంఘం అధ్యక్షులు దేవీ ప్రసాద్, టియుడబ్ల్యూజె అధ్యక్షులు కె.విరాహత్ అలీ, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

# ఆ నిధులెందుకు రికవరీ చేయలేదు

## బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంట్రాక్టు ఉద్యోగుల ఏజెన్సీల నుంచి రూ11వందల కోట్లు తీసుకున్నారని కమిటీ నిర్ధారిస్తే, అందుకు బాధ్యులపైన కేసు ఎందుకు నమోదు చేయలేదని, ఆ నిధులను ఎందుకు రికవరీ చేయలేదని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచేందుకు ‘ఫార్ములా ఈ కార్ రేస్’ కోసం రూ 45 కోట్ల చెల్లింపుల విషయంలో కెటిఆర్‌పైన కేసు నమోదు చేశారని, అలాంటిది రూ. 11వందల కోట్ల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిధులను ఏ మంత్రి తీసుకున్నారని, ఎవరు అడ్డుకున్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాలు అల్టిమేటం ఇవ్వడంతోనే రాష్ట్ర ప్రభుత్వం రెండు డీఏలు ఇస్తామని ప్రకటించిందన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు దసరా కానుక ఎలా అవుతుందని, పిఆర్‌సి గడువును ఇంకా ఎన్ని సార్లు పొడిగిస్తారని ప్రశ్నించారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులను తిరిగి వారికి ఇవ్వడానికి ప్రభుత్వానికి భారమా అని మండిపడ్డారు. ఉద్యోగుల హెల్త్ కార్డులు సరిగ్గా అమలు కావడం లేదని, వెల్‌నెస్ సెంటర్లలో పట్టించుకునే నాథులే లేరని మండిపడ్డారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు సుమిత్రానంద్ ,క్యాదాస్ కళ్యాణ్ కుమార్ పాల్గొన్నారు.

# ‘కల్యాణలక్ష్మి’ లేకుండా చేసేందుకు పావులు : కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కళ్యాణ లక్ష్మి పథకాన్ని లేకుండా చేసేందుకు సిఎంరేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి పథకాన్ని నీరుగార్చడంతో పాటు ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ‘కళ్యాణ లక్ష్మి ’పథకాన్ని ప్రవేశపెట్టి 12 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కెటిఆర్ తన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. కెసిఆర్ మానవీయ పాలనకు నిదర్శనమే కళ్యాణ లక్ష్మి పథకం అని అన్నారు. గత పన్నెండేళ్లలో కళ్యాణ లక్ష్మి /షాదీ ముబారక్ ద్వారా 16.78 లక్షల పేద కుటుంబాలకు లబ్ధి చేకూరిందని వివరించారు.



# కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల మధ్య ‘క్విడ్ ప్రోకో’ నడుస్తోంది

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్‌ఎస్ పార్టీల మధ్య అవినీతిని కప్పిపుచ్చుకునే ‘క్విడ ప్రో కో’ నడుస్తోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. ఇరు పార్టీలు పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం పలువురు చిన్నతెర నటులు, సాంకేతిక నిపుణులు పార్టీలో చేరారు. టివి ఆర్టిస్ట్ వేములపల్లి స్వర్ణలత, నటుడు లక్ష్మణ్, కెమెరామెన్లు సురేష్, మహేశ్‌లకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు అవినీతి ఆరోపణలు చేసుకోవడానికే పరిమితమయ్యాయని, ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయని విమర్శించారు. 100 రోజుల్లో బిఆర్‌ఎస్ అవినీతిపై చర్యలు తీసుకుంటామన్న కాంగ్రెస్, వెయ్యి రోజులైనా ఒక్కరినీ జైలుకు పంపలేదని దుయ్యబట్టారు. పంటలు ఎండిపోయి రైతులు కష్టాల్లో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలన్నారు. జి.ఓ 190 సరిగ్గా అమలు చేయక పోవడంపై గాంధీ భవన్ వద్ద శాంతియుతంగా ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయడాన్ని ఆయన ఖండించారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను విస్మరించారని, రబీ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా నిధులను అన్నదాతల ఖాతాల్లో జమ చేయాలన్నారు. మోదీ సుపరిపాలనకు ఆకర్షితులై రాష్ట్రంలో బిజెపి వైపు పలు రంగాల ప్రముఖులు మొగ్గు చూపుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, ఎన్.వి. సుభాష్, ఇంద్రసేనా రెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

# రిజర్వాయర్లు అన్నీ నింపితే నీటి కష్టాలే వచ్చేవి కాదు : జీవన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**మేడిగడ్డ,అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సిఎం రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టారని బిఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. నీళ్లు ఎత్తిపోసి అన్ని రిజర్వాయర్లను నింపుకుంటే నీటి కష్టాల పరిస్థితి వచ్చేది కాదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కుట్రపూరితంగానే రాష్ట్రాన్ని కరువులోకి నెట్టేశారని, లక్ష క్యూసెక్కుల నీళ్లు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. సింగరేణి జైపూర్ విద్యుత్ ప్లాంట్ ను రాజస్థాన్ కు తాకట్టు పెట్టే కుట్రకు పాల్పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,తుంగబాలు ,గాంధీ నాయక్ ,వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

# గాంధీ ఆదర్శాలతో ప్రపంచ శాంతికి కృషి

## కెవిఎల్, కాచం సత్యనారాయణ, సమతా రోషిని



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సత్యం, అహింస, శాంతి మార్గాలే మానవ మనుగడ, ప్రగతికి సోపానాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాచం సత్యనారాయణ, అధ్యక్షురాలు డాక్టర్ సమతా రోషిని అన్నారు. మహాత్మా గాంధీ 157వ జయంతిని పురస్కరించుకుని చైతన్యపురిలో సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి డాక్టర్ సమతా రోషిని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.వి.ఎల్. మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, మతోన్మాదం, హింసకు వ్యతిరేకంగా గాంధీ శాంతియుత మార్గంలో స్వాతంత్ర్య పోరాటం సాగించారని గుర్తుచేశారు. ప్రపంచ శాంతి, దేశ ప్రగతి కోసం పాలకులు రాజ్యాంగ విలువలకు కట్టుబడి పని చేయాలని కోరారు.

యుద్ధాలకు స్వస్తి పలకాలి: పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా చర్యలను, ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధాన్ని వెంటనే నిలిపివేసి చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని కె.వి.ఎల్. కోరారు. డాక్టర్ కాచం సత్యనారాయణ మాట్లాడుతూ యుద్ధాలు ఎప్పటికీ మానవాళికి శ్రేయస్కరం కావని, ఆయుధాల కోసం భారీగా నిధులు ఖర్చు చేయకుండా ప్రజా సంక్షేమానికి వినియోగించాలని అన్నారు. డాక్టర్ సమతా రోషిని మాట్లాడుతూ ప్రపంచ శాంతికి గాంధీ చూపిన అహింసా మార్గమే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఇరుగు శ్రీధర్, అరుణ్ అంబేద్కర్, కాచం సాయి, డి. జయశ్రీనివాస్, కదారి శ్రీనివాస్, వేణు, కృష్ణమూర్తి, రాము దశరథ తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల ప్రాణరక్షణే మిన్నగా...

## గగనతలం ఘటనను ప్రధాని మోదీతో పంచుకున్న ఫ్లై దుబాయ్ కెప్టెన్



**న్యూఢిల్లీ :** ‘ఇతరులను చనిపోనివ్వకూడదని నాకు తెలుసు’ అని, గగనతలంలో ప్రయాణిస్తుండగా తన కో–పైలట్ చేత దాడికి గురైన తర్వాత, తనలో మిగిలి ఉన్న శక్తితో విమానాన్ని కాపాడగలిగానని ఫ్లై దుబాయ్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తన చేదు అనుభవాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం యుఏఇలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పైలట్ స్మిత్ మచ్చర్ ప్రధానితో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లై దుబాయ్ విమానం ఎఫ్ జెడ్ 1073 కాక్‌పిట్‌లో తన కో–పైలట్ చేతిలో కత్తి పోటుకు గురై తీవ్రంగా గాయపడిన మచ్చర్ వీడియో కాల్‌లో ప్రధానమంత్రికి ఆ ఘటన గురించి సవివరంగా విపులీకరించారు.తనకు కష్టాలు ఎదురైనప్పుడల్లా హనుమంతుడికి అంకితమైన హనుమాన్ ఛాలీసాను పఠిస్తానని తెలిపారు. ‘నేను నా ప్రాణాల కోసం పోరాడుతున్నాను. కానీ, అదే సమయంలో ఇతరులను చనిపోనివ్వనని నాకు తెలుసు.అది చాలా కీలకమైన సమయం. ఆ క్షణంలో విమానం కిందకు కూలిపోతోందని నేను గ్రహించాను. నాకు చాలా గాయాలయ్యాయి. నేను చాలా అలిసిపోయాను. కానీ, లేచి నిలబడాలని నాకు నేను చెప్పుకున్నాను.ఆ సమయంలో, కాక్‌పిట్ తలుపు తెరవడానికి నన్ను నేను ముందుకు నెట్టుకున్నాను. ఇతరుల పాత్ర కూడా అంతే ముఖ్యం’ అని ఆయన చెప్పాడు. హాస్పిటల్ పడకపై నుంచి తలకు కట్టుకున్న మచ్చర్, ప్రధాని మోదీతో మాట్లాడుతూ, తాను 17ఏళ్లుగా విమానాలు నడుపుతున్నానని, అందులో 11ఏళ్లు కెప్టెన్‌గా పనిచేశానని వివరించారు. పైలట్ ధైర్యాన్ని, సమయస్ఫూర్తిని, సంయమనాన్ని ప్రశంసిస్తూ, మచ్చర్ ఆ క్షణంలో నిర్ణయం తీసుకుని ఎంతో మంది ప్రాణాలను కాపాడారని ప్రధానమంత్రి అన్నారు. ‘ఈ ఘటన తర్వాత, భారతీయులు ప్రాణాలు తీసేవారు కాదని, తమ ప్రాణాలను ఫణంగా పెట్టడానికి సిద్ధంగా ఉంటారని దేశం గర్వంగా చెప్పుకోగలదు’ అని మోదీ పైలట్‌ను అభినందించారు. ప్రధానమంత్రి దానిపై ప్రశంసలు తెలియజేయగా ఆ పైలట్ ఇలా బదులిచ్చారు. ‘నేను దేశానికి దూరంగా ఉన్నాను. కానీ, మన సంస్కృతికి కాదు’ అని సమాధానమిచ్చారు. స్మిత్ మచ్చర్ త్వరగా కోలుకోవాలని దేశవ్యాప్తంగా దేవాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించాయని, చాలామంది భారతీయులు మహా మృత్యుంజయ మంత్రాన్ని జపిస్తున్నారని ప్రధానమంత్రి మోదీ ఆ పైలట్‌తో చెప్పారు.‘మీరు చాలా ధైర్యవంతులు. మీకు స్వాగతం పలకడానికి భారతదేశం ఎదురుచూస్తోంది’ అని ఆయన పైలట్‌కు తెలియజేశారు. అందుకు పైలట్ మచ్చర్ సమాధానమిస్తూ ఈ సంఘటన తన జీవిత ప్రయాణంలో ఒక భాగమని, త్వరలో, తాను పూర్తిగా కోలుకుంటానని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. ముంబయిలో జన్మించిన ఆ పైలట్ ఫోన్ కాల్ సమయంలో చాలా భావోద్వేగానికి గురయ్యారు. ప్రధాన మంత్రితో మాట్లాడటం తనకు చాలా ప్రత్యేకమైన క్షణం అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి తనకు అత్యంత ఆరాధ్య దైవమని, ప్రధాని మోదీ నుంచి ఫోన్ కాల్ రావడం తనకు ఎంతో గర్వంగా ఉందని, ఆయనతో మాట్లాడే అవకాశం వస్తుందని తాను ఎప్పుడూ ఊహించలేదని పైలట్ స్మిత్ మచ్చర్ ఆయనతో అన్నారు.



## మహాత్మా గాంధీ బాటలో నడుద్దాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** మహాత్మా గాంధీ ఆశయాలు పూర్తిగా సాధించేందుకు అందరూ ఆయన బాటలో నడవాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని రామగిరిలో ఉన్న పూజ్య బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. శాంతియుత వాతావరణంలో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించడంలో గాంధీజీ ముఖ్య పాత్ర పోషించారని, స్వరాజ్యం రాకముందే కుల వివక్షత వ్యతిరేకంగా,మత సామరస్య సాధనకు అన్ని మతాలను గౌరవిస్తూ పోరాటం చేశారని చెప్పారు.ఈ కార్యక్రమంలోజిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్,మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్,దేవరకొండ సబ్ కలెక్టర్ కోరిన్ ఎల్లిపియన్ మావి, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి,డీఎస్పీ శివరాం రెడ్డి,తహసీల్దార్ పరశురాం,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## జైలు జీవితం తర్వాత గాంధీజీని ఆదర్శంగా తీసుకుని జీవించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జైలు జీవితం నుండి బయటకు వచ్చిన తర్వాత గాంధీజీని ఆదర్శంగా తీసుకుని జీవించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఖైదీలకు పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం నల్గొండ జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖైదీలు జైలు నుండి బయటకు వచ్చిన తర్వాత నవ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని, అందుకు ముందుగా వారిలోనే మార్పు రావాలని అన్నారు. గతంతో పోలిస్తే సమాజంలో ప్రస్తుతం అనేక మార్పులు వచ్చాయని, ఒకప్పుడు చదువు అంతగా ఉండేది కాదని, ప్రస్తుతం అందరూ చదువుకోవాలని కోరుకుంటున్నారని, జైలులో చదువురాని ఖైదీలు తప్పనిసరిగా చదువు నేర్చుకోవాలని, ఇందుకోసం త్వరలోనే బోధకులను ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా మొదటి అడిషనల్ సెషన్స్ జడ్జి కె. కవిత,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు,అదనపు ఎస్పి రమేష్, జైలు సూపరింటెండెంట్ కె. ఆనందరావు, జైలు డాక్టర్ కిరణ్, జైలర్లు అచ్చయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని నందిపాడు గ్రామ శివారులో విద్యుత్ షాక్‌కు గురై రైతు ధనావత్ కీర్య మృతి చెందారు. శుక్రవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనతో నందిపాడు గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నందిపాడు గ్రామానికి చెందిన ధనావత్ కీర్య(52) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. గురువారం నందిపాడు గ్రామ శివారులోని సర్వే నంబర్ 46లో ఉన్న తమ వ్యవసాయ భూమిలో వరి పంటకు నీరు పెట్టేందుకు బోర్ మోటార్ ఆన్ చేయడానికి వెళ్లారు. మోటార్ స్టార్టర్ పెట్టె వద్ద ఫీజులు సరిచేస్తుండగా విద్యుత్ స్తంభం నుంచి స్టార్టర్ పెట్టెకు వచ్చే సర్వీస్ వైరు అకస్మాత్తుగా తెగి కీర్యపై పడింది. దీంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనను గమనించిన ధనావత్ శ్రీను, ధనావత్ మల్లేష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలు విద్యుత్ పరికరాలు, విద్యుత్ తీగల విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. ప్రమాదకర పరిస్థితుల్లో స్వయంగా విద్యుత్ పనులు చేయకుండా సంబంధిత విద్యుత్ సిబ్బంది సహాయం తీసుకోవాలని కోరారు.

## తుక్కాపురం గ్రామంలో... అభివృద్ధి పనులు ప్రారంభం

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలం తుక్కాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన మహిళా శక్తి భవనాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. అనంతరం గాంధీ జయంతి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, గ్రామ స్వరాజ్యం మార్గాలు నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జనగాం పాండు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తి, పిఎసిఎస్ చైర్మన్ పక్కిర్ కొండల్ రెడ్డి, ఎటిఎంఎ కమిటీ చైర్మన్ ఎలిమినేటి కృష్ణారెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణిరవికుమార్ పాల్గొన్నారు.



# కొలువే లక్ష్యం.. కృషే ఆయుధం

200 మంది అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్:** ఉద్యోగమే లక్ష్యంగా ప్రణాళికతో చదివి, కృషి పట్టుదలతో కొలువు సాధించాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధనకు కృషి చేయాలని అన్నారు. పట్టణంలో శుక్రవారం ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది అభ్యర్థులకు 47 రోజులపాటు శిక్షణ ఇచ్చి ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈసందర్భంగా వీరేశం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో అవసరమైన సహకారం అందిస్తానన్నారు.పేదరికం అడ్డంకి కాదని,పరిస్థితులను ఎదురించి కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు.ఉద్దీపన ఫౌండేషన్ గత 12 ఏళ్లుగా విద్యార్థుల చదువులకు సేవలందిస్తోందని,పేద విద్యార్థుల కోసం నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పేపర్ లీకేజీలపై పోరాటాలు జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి స్ఫూర్తితో విజయాలు సాధించాలని అభ్యర్థులకు సూచించారు.ఈకార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ చెరుకు సతీష్,ఆర్‌సీ రెడ్డి కోచింగ్ సెంటర్ ఫ్యాకల్టీ వేముల సైదులు,మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ చౌగోని రజిత శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాదగోని కొండయ్య, పట్టణ అధ్యక్షుడు లింగాల వెంకన్న,గాజుల సుకన్య, కరుణాకర్‌రెడ్డి,ఎడ్ల ప్రవీణ్,బొజ్జ సుందర్, యాసారపు వెంకన్న, రాజకొండ సునీల్,గంగాధర్ భద్రయ్య పాల్గొన్నారు.

**పట్టభద్రుల ఓటు నమోదు చేసుకున్న వీరేశం**

నల్లగొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరుగా ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తన ఓటును నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, విద్యావంతులైన గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదై తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.




## గాంధీజీ పోరాట స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకోవాలి : పల్లా

**ప్రజాపక్షం/దేవరకొండ :** మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని ఓటు హక్కును కాపాడుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ కార్యాలయం పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువలు, ప్రజల ఓటు హక్కు రక్షణకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. గాంధీజీకి నివాళులు అర్పించడం అంటే కేవలం జయంతి కార్యక్రమాలు నిర్వహించడం కాదని, ప్రజల హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు పోరాడటమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌బిజెపి పాలనలో పెరుగుతున్న మత పరమైన విభజన , పోలరైజేషన్‌లకు నిరసనగా గాంధీ జయంతి అయిన అక్టోబర్ 02వ తేదిని మత సామరస్య దినోత్సవంగా నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయలు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, వెంకట్రాములు, మైనోద్దిన్, యాద య్య, మహిళా సమాఖ్య డివిజన్ కార్యదర్శి అనిత, పట్టణ సహాయ కార్యదర్శులు నగేష్, జ్యోతిబస్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హామీల అమలుకు గళమెత్తిన కలం

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను తక్షణమే అమలు చేయాలి

జిల్లా వ్యాప్తంగా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాల మర్పించిన టియుడబ్ల్యుజె (ఐజెయు)




**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టియుడబ్ల్యుజె (ఐజెయు) ఆధ్వర్యంలో శుక్రవారం నల్లగొండ జిల్లావ్యాప్తంగా కలం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.మండల,డివిజన్ కేంద్రాల్లో గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలుసమర్పించారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.నల్లగొండ పట్టణంలోని రామగిరిలో గల గాంధీ పార్కులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి నాయకత్వం వహించి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతున్న జర్నలిస్టులందరికీ ప్రభుత్వం స్థలాలతో పాటు ఇళ్లను కేటాయించాలని కోరారు.జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు అందించి,నగదు రహిత వైద్య చికిత్స సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.డి. అశ్వక్ అహ్మద్,జిల్లా సహాయ కార్యదర్శి జిల్లా యాదయ్య,చిన్న పత్రికల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బోజు మదనాచారి,ప్రధాన కార్యదర్శి పిట్టల రామకృష్ణ,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి దోటి శ్రీనివాస్,డివిజన్ అధ్యక్షుడు వంగాల శ్రీనివాసరెడ్డి,ప్రచార కార్యదర్శి కె. జగదీశ్వరాచారి,డివిజన్ ఉపాధ్యక్షులు చింత యాదయ్య,తెలగమళ్ల దశరథ,కట్ట సుధాకర్,లింగయ్య, ఎం.డి.ఖుద్దూస్,యాదగిరి,డి.సైదులు యాదవ్, చేపూరి రవి,ఎండి సయ్యద్,సోమచంద్రశేఖర్,మేకల వెంకట్‌రెడ్డి, ఎం.డి. సలీం,నగర భాస్కర్ చిలుముల నరేందర్ పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

టియుడబ్ల్యుజె, ఐజెయు రాష్ట్రకార్యవర్గ సభ్యుడు చలసాని




**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** దీర్ఘకాలికంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం టియుడబ్ల్యుజె, ఐజెయు దేశవ్యాప్త డిమాండ్లదే నిర్వహించాలన్న పిలుపుమేరకు ఎంజిరోడ్డు లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టి, కొత్త బస్టాండ్ వరకు రాస్తారోకో చేసి, భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్ముకు రాసిన వినతిపత్రాన్ని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరిని అవలంభిస్తున్నాయని దుయ్యబట్టారు. టియుడబ్ల్యుజె, ఐజెయు సూర్యాపేట జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు కోల నాగేశ్వరరావు, డాక్టర్ బంటు కృష్ణ లు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులకు సమాజంలో రోజు రోజుకు గౌరవం లేకుండా పోతుందని, ఇటీవల జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నాయని, దాడుల నియంత్రణకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకరావాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బత్తుల మల్లిఖార్జున్, రెబ్బ విజయ్, శంకరమంచి రవీందర్, గుంటూరు రాము, వర్దెల్లి అరుణ కృష్ణ, ఎలుక రామిరెడ్డి, దుబ్బాక మల్లారెడ్డి, వెంకటయ్య, దానియాకుల వెంకటేశ్వర్లు, గాయం సత్యనారాయణరెడ్డి (జిఎస్‌రెడ్డి) షేక్ దస్తగిరి, సొంపంగు గోపి, రవి, కోట రాంబాబు, తండు వెంకన్న పాల్గొన్నారు.

## పిఎసిఎస్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/చిట్యాల :** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జరుగుతున్న అక్రమాలను వెలికితీసి కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం సభ్యులు, సిపిఐ జిల్లా కమిటి సభ్యులు బొడిగె సైదులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు, యూరియా అమ్మకాలలో అక్రమాలు జరిగాయని, ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన గన్ని బ్యాగులను తగులబెట్టిన ఉదంతం జరిగిందని ఆయన ఆరోపించారు. సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆదాయ వ్యయాలపై చర్చించాలని ఎన్ని మార్లు కోరినప్పటికి గత మూడు సంవత్సరాలుగా సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటుచేయలేదని విమర్శించారు. సభ్యుల ఆమోదం లేకుండా పరికరాలను కొనుగోలు చేస్తున్నారని, అన్ని విషయాలపై సమగ్రంగా విచారణ జరిపించి తగు చర్యలు తీసుకోవాలని సైదులు వినతి పత్రంలో కోరారు.

# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని నిరసన ర్యాలీ




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ మిర్యాలగూడలో ప్రజాసంఘాల ఐక్యవేదిక, వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం నుంచి రైతు మార్కెట్ మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు డాక్టర్ ముప్పా రామారావు, బీసం రామయ్య మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం బాధ్యత వహించాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణ, ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించేందుకు ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాలని డిమాండ్ చేశారు. 2024 నుంచి ఎన్నికల కమిషన్ వ్యవహారాలపై వస్తున్న ఆరోపణలకు బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రజాసంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు కోరారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం కొనసాగేందుకు పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, డాక్టర్ జాడి రాజు, ఎంసీపీఐ నాయకులు వస్కుల మట్టయ్య, సీపీఎం రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, అంబటి నాగ య్య, కస్తూరి ప్రభాకర్, వై. భిక్షమయ్య, మోహన్‌రావు, జన విజ్ఞాన వేదిక కందుకూరి సుదర్శన్, యశ్వంత్ పాల్గొన్నారు.

## వదంతులకు చెక్

ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోనే ఉన్నానన్నా సర్వోత్తమ్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీ చేసేందుకు సిద్ధంగా లేనని, తన అభిప్రాయం తీసుకోకుండానే ఉమ్మడి నల్లగొండజిల్లా వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారని వస్తున్న వదంతులపై ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం దీనిపై ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మీడియాలో, సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని తిప్పి కొట్టిన ఆయన నేను ఎమ్మెల్సీ బరిలో ఉన్నానని చెప్పారు. ఎవరు కూడా వదంతులను నమ్మవద్దని, నా అభ్యర్థిత్వంపై జరుగుతున్న ప్రచారం అవాస్తవమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నుండి వెనక్కి తగ్గేదేలేదని తేల్చి చెప్పారు. పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. నా దీర్ఘకాలిక రాజకీయాల లక్ష్యాల గురించి నేను గతంలో చెప్పిన విషయాలను ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలతో ముడిపెట్టి వక్రీకరించడం సరికాదన్నారు. ప్రస్తుతం నా ముందు ఉన్న బాధ్యత ఒక్కటేనని, అధిష్టానం నిర్ణయం మేరకు పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ బరిలో ఉండి పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి బలమైన ప్రాతినిధ్యం వహిస్తానని చెప్పారు. తప్పుడు ప్రచారాలను ఎవరు కూడా నమ్మవద్దన్నారు.

# 'గ్రీన్' మిర్యాలగూడ దిశగా ప్రణాళికలు

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణంలో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాలతో పాటు రోజువారీ ఫ్రెష్ మున్సిపల్ వ్యర్థాలకు శాస్త్రీయ, పర్యావరణహిత పరిష్కారాలను అమలు చేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రీన్ మిర్యాలగూడ వేస్ట్ టు వెల్త్ అనే సమగ్ర ప్రణాళికను ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, ఏఫోర్ కాన్ సర్వీసెస్ సాంకేతిక ప్రతినిధులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నేతృత్వంలో ప్రతినిధుల బృందం మిర్యాలగూడలోని డంపింగ్ యార్డును నేరుగా సందర్శించింది. అక్కడ ఉన్న వ్యర్థాల పరిమాణం, సేకరణ విధానం, వర్గీకరణ, ప్రాసెసింగ్ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఏఫోర్ కాన్ సర్వీసెస్ ప్రతినిధులు లెగసీ వ్యర్థాలకు సైంటిఫిక్ రిమీడియేషన్, సెగ్రిగేషన్, ఆర్డీఎఫ్ రికవరీ పద్ధతులను, అలాగే తడి చెత్తకు ఆర్గానిక్ రీసోర్స్ రికవరీ విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల నుంచి సేకరించే వ్యర్థాలను మూలం వద్దనే శాస్త్రీయంగా వేరు చేసి, వాటిని విలువైన వనరులుగా మార్చడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆర్గానిక్ వ్యర్థాల నుంచి బయోరిసోర్సెస్, పశుసంవర్ధక, ఆక్వాకల్చర్ రంగాలకు ఉపయోగపడే ప్రోటీన్ ఆధారిత ఫీడ్‌ను తయారు చేసే సాంకేతికతపై దృష్టి సారించాలన్నారు. ప్లాస్టిక్ చెత్తను వేరు చేసి పునర్వినియోగానికి తగిన విధంగా గ్రాన్యూల్స్‌గా మార్చడం ద్వారా ల్యాండ్‌ఫిల్‌పై భారాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. వైద్యశాలల నుంచి వచ్చే బయోమెడికల్ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి శాస్త్రీయ నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. మిర్యాలగూడను రాష్ట్రానికే ఆదర్శవంతమైన వేస్ట్ మేనేజ్‌మెంట్ మోడల్‌గా తీర్చిదిద్దేలా సమగ్ర డీపీఆర్ నివేదికను త్వరలోనే మున్సిపాలిటీకి సమర్పించనున్నట్లు సాంకేతిక బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, ఏఫోర్ కాన్ సర్వీసెస్ డైరెక్టర్లు అంబటి నవకుమార్, వంగల సతీష్, ఆద్యాల విజయ్ కుమార్‌రెడ్డి, రతన అజిత్, ప్రతినిధుల బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులతో కలిసి భర్తను హత్య చేసిన భార్య

కుటుంబ కలహాలా? వివాహేతర సంబంధమా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మొదటి భర్తకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకున్న మహిళ

**ప్రజాపక్షం/నల్లగొండ :** భార్య,భర్తను ఇంటికి రావాలని పిలిచి ఇంటికి రాగానే కుటుంబ సభ్యులతో కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన గురువారం రాత్రి నల్లగొండలో చోటుచేసుకుంది.వివాహమైన తర్వాత భర్తతో కలిసి జీవిస్తున్న మహిళ మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పరుచుకుని అతడినే వివాహం చేసుకుంది.వివాహమైన తర్వాత భర్తతో కలిసి 12 సంవత్సరాలు కలిసి జీవించిన తర్వాత ఈ దంపతుల మధ్య కుటుంబ కలహాలు వచ్చి చివరికి కట్టుకున్న భర్త ను భార్య కుటుంబ సభ్యులతో కలిసి పక్కా ప్లాన్ తో భర్తను హత్య చేసినట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలుస్తోంది. ఈ హత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.నల్లగొండ పట్టణంలో నివాసం ఉండే బంటు వెంకటేశ్వర్లు (36) గతంలో డీఎంహెచ్ కార్యాలయంలో అటెండర్గా పనిచేసేవాడు అయితే కొంతకాలం క్రితం అతడు సస్పెండ్ అయ్యాడు. సుమారు 12 ఏళ్ల క్రితం మాన్యం చెల్క కు చెందిన రేష్మకు అప్పటికే వివాహమై ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లుతో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం రేష్మ భర్తకు తెలియడంతో పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించారని సమాచారం.అనంతరం ఆమె తన మొదటి భర్తకు విడాకులు ఇచ్చి వెంకటేశ్వర్లును వివాహం చేసుకుంది. ఆ తర్వాత ఇద్దరూ నల్లగొండలోనే వేరుగా కాపురం పెట్టారు. అప్పటికే సస్పెండ్ అయిన వెంకటేశ్వర్లు పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు అయితే కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గురువారం రాత్రి వెంకటేశ్వర్లు అత్తగారింటికి వెళ్లి భార్యను తనతో రావాల్సిందిగా కోరినట్లు తెలిసింది. అయితే అప్పటికే పథకం ప్రకారం సిద్ధంగా ఉన్న రేష్మ కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు పై దాడి చేసినట్లు తెలుస్తోంది.ముందుగా అతని కళ్లలో కారం చల్లి కిందపడేసి అనంతరం సిమెంట్ ఇటుకలతో తీవ్రంగా కొట్టినట్లు తెలుస్తుంది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే నల్లగొండ డిఎస్పి కే శివరాం రెడ్డి,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి క్లూస్ టీమ్ తో కలిసి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.ఈ హత్యలో మృతుడి భార్యతో పాటు ఆమె సోదరి,మరో ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.ఇప్పటికే నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.



డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించారు.

# రీల్




## నెట్ ఫ్లిక్స్‌లో 'రోమాంచకం'

డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మించిన సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందించారు. థియేట్రికల్ గా 'రోమాంచకం' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొంది ఘన విజయం సాధించింది. ఈ చిత్రంలోని ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఎలిమెంట్స్ ను మాస్, క్లాస్ ఆడియెన్స్ బాగా ఎంజాయ్ చేశారు. ఇప్పుడు నెట్ ఫ్లిక్స్ లోనూ 'రోమాంచకం' సందడి మొదలైంది. 'రోమాంచకం' మూవీ నెట్ ఫ్లిక్స్ లోకి స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీలో ఈ సినిమా ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. థియేట్రికల్ గా 'రోమాంచకం' మిస్ అయిన ఆడియెన్స్ నెట్ ఫ్లిక్స్ లో మూవీని ఎంజాయ్ చేయొచ్చు. నెట్ ఫ్లిక్స్ ద్వారా ఈ సినిమా మరింతమంది ప్రేక్షకులకు చేరువకాబోతోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్, ఉపేంద్ర లిమయె, వెంకటేష్ కాకుమాను, మణి, సోహన్, నటించారు.

## 'బా బా బ్లాక్ షీప్' ట్రైలర్ లాంచ్

న్యూ ఏజ్ క్రైమ్ కామెడీ 'బా బా బ్లాక్ షీప్'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో చిత్రాలయం స్టూడియోపై వేణు దోనేపూడి నిర్మిస్తున్న ఈ మూవీకి గుణి మంచికంటి దర్శకత్వం వహిస్తున్నారు. 9న సినిమా రిలీజ్ అవుతుంది. టిను ఆనంద్, ఉపేంద్ర లిమాయె, జార్జ్ మరియన్, అక్షయ్ లగుసాని , విష్ణు ఓయ్, కార్తికేయ, విస్మయ శ్రీ, మాల్వీ మల్హోత్రా, కశ్యప్, శుభలేఖ సుధాకర్, రాజారవీంద్ర తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ సందర్భంగా నటి సమృద్ధి ఆర్యాళ్ మాట్లాడుతూ "సినిమా కంటే కూడా, ఈ మూవీ యూనిట్‌తో వర్క్ చేస్తూ నేను పొందిన అనుభవం నాకెంతో ప్రత్యేకం. నటీనటులు, దర్శకుడు, నిర్మాతలు.. ఇలా ప్రతి ఒక్కరూ చాలా ఆప్యాయంగా చూసుకున్నారు. ఎక్కడా నేనొక కొత్తదాన్ననే భావన కలగనివ్వలేదు. తెలుగులో నాకు ఇది మొదటి సినిమా. భాష రాకపోవడం వల్ల మొదట్లో తెలుగు డైలాగ్స్ చెప్పడం కష్టంగా అనిపించి చాలా కష్టపడ్డాను. కానీ డైలాగులు బట్టీ పట్టి మరీ పూర్తి చేశాను. అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది. ఓవరాల్గా ఇదొక అద్భుతమైన అనుభవం, భవిష్యత్తులో ఈ టీమ్‌తో మళ్లీ కలిసి పనిచేయాలని కోరుకుంటున్నాను'' అన్నారు. నటి మాల్వీ మల్హోత్రా మాట్లాడుతూ '''బా బా బ్లాక్ షీప్ 'అనేది చాలా ఫన్, కొంచెం వెరైటీగా ఉండే ఒక ఆసక్తికరమైన టైటిల్. దర్శకుడు గుణి నాకు ఈ కథ చెప్పినప్పుడు



నేను ఎంతో ఎగ్జైట్ అయ్యాను. ట్రైలర్లో నా పాత్రను పెద్దగా చూపించలేదు కానీ, థియేటర్లలో సినిమా చూసినప్పుడు మీకు ఒక మంచి సర్ప్రైజ్ దొరుకుతుంది. ఇందులో నా పాత్ర పేరు 'రమ', కొంచెం గ్రే షేడ్స్ ఉండే పాత్ర అది. ఈ మూవీ రెగ్యులర్ హీరో, హీరోయిన్ కథలా కాకుండా.. ప్రతి పాత్రకూ ఎంతో ప్రాధాన్యత ఉండే సినిమాగా రూపొందింది. ప్రతి ఒక్కరూ తమ పాత్రలను చాలా చక్కగా చేశారు. దర్శకుడు గుణి మంచికంటి మాట్లాడుతూ ''ముందుగా నిర్మాత వేణు గారికి చాలా పెద్ద థాంక్స్. ప్రస్తుతం ఉన్న కాంపిటీషన్‌లో ఒక డెబ్యూ డైరెక్టర్‌కు సినిమా రావడం చాలా కష్టమైన విషయం. కానీ వేణు గారు నేను చెప్పిన ఒక్క నరేషన్‌తోనే ఈ సినిమాను ఓకే చేశారు. ఆ తర్వాత నెల రోజుల్లోనే టీమ్ మొత్తాన్ని సమకూర్చుకుని, మరో మూడు నెలల్లోనే ప్రీప్రొడక్షన్, లొకేషన్ రెక్కీ అన్నీ పూర్తి చేసుకుని షూట్‌కి వెళ్లాం. మేఘాలయలో దాదాపు 28 రోజుల పాటు షూట్ చేశాం .అని అన్నారు. ప్రముఖ నటుడు ఉపేంద్ర లిమాయె . నటుడు విష్ణు ఓయ్, నటుడు అక్షయ్ లగుసాని , నిర్మాత వేణు దోనేపూడి పాల్గొన్నారు.

జానీ మాస్టర్‌పై ...

## వేటు వేసిన ఫిలిం ఫెడరేషన్



డ్యాన్సర్ల మధ్య జరిగిన గొడవల నేపథ్యంలో తెలుగు ఫిలిం ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షేక్ జానీ బాషా అలియాస్ జానీ మాస్టర్ పై సహాయ నిరాకరణ ప్రకటించారు. ఇటీవల జరిగిన ఎంప్లాయిస్ ఫెడరేషన్ జనరల్ బాడీ మీటింగ్ లో ఏకగ్రీవ తీర్మానం చేశామని ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లంక రాజేంద్ర ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఫెడరేషన్ ప్రకటించిన జానీ మాస్టర్ సహాయ నిరాకరణకు ఫెడరేషన్ పరిధిలో ఉన్న 24 విభాగాలు సహకరించాలని ఆయన కోరారు. గత కొంత కాలంగా డ్యాన్సర్ల అసోసియేషన్ లో సభ్యుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఉన్న జానీ మాస్టర్ భార్య సుమలత ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని మిగితా మెంబర్స్ ఆరోపిస్తున్నారు. ఈ గొడవల నేపథ్యంలో ఫెడరేషన్ పై జానీ మాస్టర్ అనుచితంగా మాట్లాడిన వీడియో కూడా వైరల్ అయింది. దీంతో ఫెడరేషన్ పై ఏమాత్రం గౌరవం లేకుండా నోటికొచ్చినట్టు మాట్లాడిన జానీ మాస్టర్ పై సహాయ నిరాకరణ విధిస్తు ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. అయితే తనపై ఉన్న కక్షతో తన భర్తపై వేటు వేయడాన్ని డాన్సర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుమలత అలియాస్ అయేషా తీవ్రంగా ఖండించారు.

## నర్సింగ్ రావుకు డాక్టరేట్



నర్సింగ్ రావు తెలంగాణకు చెందిన అత్యంత విశిష్టమైన, బహుముఖ ప్రజ్ఞాశాలి సాంస్కృతిక వ్యక్తిత్వాలలో ఒకరు. సినీ దర్శకుడు, రచయిత, చిత్రకారుడు, ఛాయాగ్రాహకుడు, రంగస్థల కళాకారుడు, సంగీతకారుడు, సాంస్కృతిక దస్తావేజీకర్తగా ఆయన సాగించిన సుదీర్ఘ సృజనాత్మక ప్రయాణం తెలంగాణ కళా, సాంస్కృతిక వారసత్వాన్ని విశేషంగా సుసంపన్నం చేసింది. మా భూమి, మా ఊరు, దాసి, మట్టి మనుషులు వంటి మైలురాయి చిత్రాల ద్వారా తెలంగాణ భూదృశ్యాలు, మాండలికాలు, జానపద సంప్రదాయాలు, సామాజిక వాస్తవాలు, సామాన్య ప్రజల జీవన చిత్రణను జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక వేదికలకు పరిచయం చేశారు. వివిధ కళారూపాలను సమన్వయపరిచిన ఆయన సృజనాత్మక కృషి తెలంగాణ అమూల్యమైన సాంస్కృతిక జ్ఞాపకాలను భద్రపరచడమే కాకుండా, భారతీయ కళలు, సినిమా విస్తృత ప్రస్థానంలో తెలంగాణకు విశిష్టమైన కళాత్మక గుర్తింపును సుస్థిరం చేసింది. అందుకే ఆయన తెలంగాణ పునరుజ్జీవన ప్రతిభామూర్తి గా సముచిత గౌరవాన్ని పొందారు. ఈ నేపథ్యంలో 7వ తేదీన జరిగే స్నాతకోత్సవంలో డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ నర్సింగ్ రావు కు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేయనుంది.

## ఆహాలో 'నా వైఫ్ మిస్సింగ్'




ఎప్పటికప్పుడు ఎంగేజింగ్ కంటెంట్ తో సబ్ స్క్రైబర్స్ ను ఎంగేజ్ చేస్తోన్న ఆహా ఓటీటీ ఇప్పుడు మరో ఎంగేజింగ్ సిరీస్ ను మన ముందుకు తీసుకొస్తోంది. వరుణ్ సందేశ్, శ్వేతా బసు ప్రధాన పాత్రల్లో ఆహా ఒరిజినల్ 'నా వైఫ్ మిస్సింగ్' త్వరలో స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సిరీస్ తెలుగుతో పాటు తమిళంలోనూ సబ్ స్క్రైబర్స్ కు అందుబాటులో ఉండనుంది.ప్రతి కేసుకు ఒక కథ ఉంటుంది, ఈ కేస్ లో నిజం ఏంటి అనే క్యాప్షన్ తో 'నా వైఫ్ మిస్సింగ్' అప్డేట్ ఇచ్చింది ఆహా. తన భార్య మిస్సయ్యిందంటూ వరుణ్ సందేశ్ పోలీస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వడాన్ని గతంలో రివీల్ చేసింది ఆహా. ఇప్పుడా కేసులో ఉన్న నిజం ఏంటో సిరీస్ లో చూడాలనే క్యూరియాసిటీ ఆడియెన్స్ లో క్రియేట్ అవుతోంది. త్వరలో 'నా వైఫ్ మిస్సింగ్' స్ట్రీమింగ్ డేట్ ను ఆహా ఓటీటీ అనౌన్స్ చేయబోతోంది. కొత్త బంగారులోకం వంటి సూపర్ హిట్ సినిమా చేసిన పెయిర్ వరుణ్ సందేశ్, శ్వేతాబసు ప్రసాద్ లాంగ్ గ్యాప్ తర్వాత చేస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం.




## 9న 'హనుమాన్ అంశ్'

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించి, రికార్డ్ స్థాయి వసూళ్లు అందుకుంటున్న 'హనుమాన్ అంశ్' సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్. ఆయన సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థ ఈ చిత్రాన్ని ఈ నెల 9న తెలుగులో థియేట్రికల్ రిలీజ్ చేస్తోంది. ప్రముఖ ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవిత చరిత్ర ఆధారంగా దర్శకుడు డా. విశాల్ చతుర్వేది 'హనుమాన్ అంశ్' సినిమాను రూపొందించారు. రాగిని ఎస్, నమ్రత. జి. సింగ్, అనుప్రియ ఎ నగర్, డా.విశాల్ చతుర్వేది నిర్మించారు. 'హనుమాన్ అంశ్' తివారి, విహాన్ షెగ్డే కీలక పాత్రల్లో నటించారు. గత నెల 7వ తేదీన బాలీవుడ్ లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 150 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండటం మరింతగా అంచనాలు పెంచుతోంది. తెలుగు ఆడియెన్స్ ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో తెలుగులో 'హనుమాన్ అంశ్' సినిమా మంచి విజయం సాధిస్తుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.



## గాంధీకి నిజమైన నివాళి

(మొదటి పేజీ తరువాయి)

శ్రేణులు నివాళులర్పించారు. ఆయా జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో సిపిఐ జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ క్రియాశీలక పాత్ర పోషించారని, అశేష ప్రజానీకాన్ని ఉద్యమంలోకి తీసుకురావడంలో సఫలీకృతులయ్యారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, మతసామరస్యం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. మత విద్వేష రాజకీయాలను విడనాడి ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించాలని గాంధీజీ చేసిన కృషిని ఆయన గుర్తు చేశారు. దేశ నిర్మాణం కోసం మేధావులు పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన వ్యవస్థలను నిర్మించారని, అయితే ప్రస్తుత బిజెపి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ వ్యవస్థలను బలహీనపరుస్తోందని ఈ.టి.నరసింహ ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది అత్యంత కీలకమైనదని, అలాంటి ఓటు హక్కును బిజెపి ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం భారత ఎన్నికల కమిషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించి తమకు అనుకూలంగా లేని వారి ఓటర్లను తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా 13 కోట్ల మంది ప్రజల ఓట్లను తొలగించి మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో అధికారంలోకి రావడం జరిగిందన్నారు. ఓట్ల తొలగింపుతో పాటు 2023 భారత ఎన్నికల కమిషన్ నియామకాలలో తీసుకొచ్చినటువంటి మార్పులను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఇండియా కూటమి మిగతా ప్రజా సంఘాలు, లౌకిక శక్తులు రోడ్డుపైకి వచ్చి తమ నిరసనను వ్యక్తం చేస్తున్నప్పటికిని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా ఉన్న జ్ఞానేష్ కుమార్ స్పందించకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. ఎవరు ఎన్ని ఆందోళనలు చేసిన తాను మాత్రం బిజెపికి అనుకూలంగా ఉంటాననే భ్రమను జ్ఞానేష్ కుమార్ విడనాడకపోతే ప్రజలు తిరగబడే రోజు ఆసన్నమైనదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుకునేందుకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, సలీం ఖాన్, ఉమర్ ఖాన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.శ్రీమాన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కొమురెల్లి బాబు, కళ్యాణ్, అనిల్ కుమార్, సైఫ్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధీ జయంతిన అరెస్టులు సిగ్గుచేటు**

ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ను అరెస్టు చేయాలని మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను ఎంపీలను మాజీ ముఖ్యమంత్రులను ఢిల్లీలోని జంతర్ మంతర్ కేంద్రంగా ఎక్కడికక్కడ అరెస్టు చేయడం అత్యంత సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ అన్నారు. సిపిఐ ఎంపీ సందోష్ కుమార్‌తో పాటు జంజీల అక్రమ అరెస్టును ఆయన ఖండించారు. చట్టబద్ధ పాలన ఇష్టం లేని మోదీ ప్రభుత్వం రాచరిక పాలన చేయాలనుకోవడం మూర్ఖత్వమని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య యుతంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వ్యతిరేకిస్తూ నిరసన తెలుపడం పౌరులకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని గుర్తు చేశారు. జంతర్ మంతర్. ముంబాయి కేంద్రంగా జరుగుతున్న ప్రదర్శన ,ధర్నాలపైన తీవ్రమైన ఆంక్షలు నిర్బంధాలు విధించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో సేవలను,ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేసి అప్రకటిత ఎమర్జెన్సీని తలపించే విధంగా దేశంలోని నగరాల్లో పోలీస్ ఆంక్షలను విధించారని మండిపడ్డారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలు ఉద్యమకారులు ఓట్లు కోల్పోయిన 13 కోట్ల మంది ప్రజల తరపున జెన్‌జీలు, రాజకీయ పార్టీలు తమ నిరసన వ్యక్తం చేయడం పాలకవర్గానికి కంటగింపుగా మారిందన్నారు. ఏ చిన్న నిరసనను, భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జీర్ణించుకోలేని స్థితిలో ఉందన్నారు. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున చేపట్టిన ఉద్యమం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ మెడలు వంచి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో మంత్రిపదవికి రాజీనామా చేయించిన చరిత్ర ప్రజలకు ఉన్నదని ఈటి గుర్తు చేశారు.

## డిసెంబర్ 9న షురూ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీతో పాటు ఇతర ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఒక మంచి కార్యక్రమానికి నిధులు అందించి సహకరించడానికి ముందుకు వచ్చిన సంస్థల ప్రతినిధులను ఈ సందర్భంగా సిఎం అభినందించారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని, విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల కేలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు.

బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యత విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ప్రా ంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్‌ను అందించే విధంగా చూడాలని, జీవితకాలం కొనసాగించాల్సిన ఈ కార్యక్రమం కాబట్టి సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని సూచించారు.

## ఒకే పాస్

(మొదటి పేజీ తరువాయి)

అండర్‌పాస్‌లు, తాగునీటి వసతులు తదితర రంగాల్లో భారీగా పనులు చేపట్టామని ఆయన వివరించారు. శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన తెలంగాణ ఆర్టీసీమెట్రో రైల్ కామన్ పాస్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజలకు అవసరమైన పౌర సదుపాయాలను ఇప్పటి నుంచే విస్తరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం ప్రచారానికి పరిమితం కాకుండా పనులు చేసి వాటి ఫలితాలను ప్రజలకు చూపించాలనే విధానంతో ముందుకు సాగుతోందని భట్టి అన్నారు. హెచ్ఎండిఏ పరిధిలో రూ.35 వేల కోట్లతో రోడ్లు, ఫ్లయిఓవర్లు, బ్రిడ్జిల వంటి భారీ మౌలిక వసతుల పనులు చేపట్టామన్నారు. జిహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, అండర్‌పాస్‌లు, ఫ్లయిఓవర్లు, ఇతర అభివృద్ధి పనులతో కలిపి నగరంలో మొత్తం రూ.52 వేల కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని వివరించారు. హైదరాబాద్ అభివృద్ధిలో గత కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్రను ప్రస్తావిస్తూ.. నగరానికి తాగునీటి అవసరాలను తీర్చేందుకు కృష్ణా, గోదావరి, మంజీరా జలాలను గత కాంగ్రెస్ ప్రభుత్వాలే తీసుకొచ్చాయని తెలిపారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత పదేళ్లపాటు అధికారంలో ఉన్న ప్రభుత్వం నగరానికి ఒక్క చుక్క అదనపు తాగునీటిని కూడా తీసుకురాలేదని విమర్శించారు. గండిపేట్ నీటిని నిజాం పాలనలోనే తీసుకొచ్చారని, ఆ తర్వాత హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం కృష్ణా, మంజీరా, గోదావరి జలాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు అందుబాటులోకి తెచ్చాయని చెప్పారు.

**కాంగ్రెస్ హయాంలోనే కీలక ప్రాజెక్టులు**

హైదరాబాద్‌కు మణిహారంగా నిలిచిన ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ వంటి విద్యా సంస్థలతో పాటు బిహెచ్ఇఎల్, ఇసిఐఎల్, మిథాని, ఐడిపిఎల్, డిఆర్‌డిఓ, డిఆర్‌డిఎల్, బిఇఎల్, మిధాని వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థలు కూడా అప్పటి కాంగ్రెస్ పాలనలోనే ఏర్పాటయ్యాయని చెప్పారు. వీటి ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని అన్నారు.హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను మరింత మెరుగుపరిచేందుకు మెట్రో రైల్‌ను 122 కిలోమీటర్ల మేర విస్తరించనున్నట్లు తెలిపారు. ఓల్డ్ సిటీ, ఎయిర్‌పోర్టు, పటాన్‌చెరు, హయత్‌నగర్ ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ కల్పించేందుకు సుమారు రూ.38 వేల కోట్లతో ఫేజ్2 ప్రాజెక్టును చేపట్టనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ అభివృద్ధిని నగర పరిధి దాటి రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును చేపట్టామన్నారు. 362 కిలోమీటర్ల మేర అన్ని జిల్లాలను అనుసంధానించే ఈ ప్రాజెక్టుకు రూ.30,627 కోట్ల వ్యయం అవుతుందని తెలిపారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌లను అనుసంధానిస్తూ 21 రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే 10 రోడ్ల అలైన్‌మెంట్‌కు అనుమతులు ఇచ్చామని, రెండు రోడ్ల పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికి కీలకమైన మూసీ నది పునరుజ్జీవనానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని భట్టి చెప్పారు. మూసీని ప్రక్షాళన చేసి, నగరానికి మెరుగైన పర్యావరణ వాతావరణాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఫేజ్1 పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు.

**ఎలక్ట్రిక్ బస్సులతో కాలుష్య నియంత్రణ**

హైదరాబాద్‌లో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్, ఆర్టీసీ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నామని భట్టి తెలిపారు. ఇప్పటికే 550 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయని, మరో 2,200 బస్సులను భవిష్యత్తులో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆటో డ్రైవర్లు డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చుకునేందుకు రెట్రోఫిట్టింగ్ కోసం రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని భట్టి తెలిపారు. ఈ ప్రాజెక్టులతో హైదరాబాద్ మరింత నివాసయోగ్యమైన నగరంగా మారుతుందని, పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు.

**ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్**

నగర ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు ఆర్టీసీ, మెట్రో రైల్ కామన్ పాస్ విధానాన్ని ప్రారంభించడం అభినందనీయమని భట్టి అన్నారు. వన్డే పాస్ నుంచి వన్మంత్ పాస్ వరకు రెండు రవాణా వ్యవస్థల్లోనూ ఉపయోగించుకునేలా ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అభినందనలు తెలిపారు. తాను, రాష్ట్ర మంత్రులంతా రూ.500 చెల్లించి వన్డే పాస్లు కొనుగోలు చేశామని చెప్పారు.

శనివారం ఉదయం బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి మెట్రోలో ప్రయాణించి, అనంతరం ఆర్టీసీ బస్సు లో ప్రయాణిస్తూ కామన్ పాస్ సౌకర్యాన్ని స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రు లు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి,అజారుద్దీన్, ప్రభుత్వ విప్ శాసనమండలి సభ్యులు అద్దంకి దయాకర్, మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజు పాల్గొన్నారు.

ఓటరు మహాశయులకు విన్నపం...!
ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ
ఖమ్మం జిల్లా శాఖ ఎన్నికలు-2026



డా॥ వెలిగేటి చంద్రమోహన్ గారు
బ్యాలెట్ SL నెం. 36

"మానవత్వం ద్వారా శాంతికి" అనే సేవాతత్పరతను గుర్తిద్దాం.. సేవను ప్రోత్సహిద్దాం. నిరంతరం సమాజ సేవకులనే అఖండ మెజార్టీతో గెలిపిద్దాం..
మానవతావాదానికి పర్యాయపదం రెడ్‌క్రాస్..
ఈ పోస్టులు అలంకారమైన పదవీ చిహ్నం కావు.
రెడ్‌క్రాస్ మహత్తర సేవాపథంలో ఉద్యమ స్ఫూర్తితో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న డా॥ వెలిగేటి చంద్రమోహన్ గారిని వారి బృందాన్ని గెలిపించడం మన బాధ్యత.

జనశ్రేయానికి.. జనం మెచ్చే అమూల్య సేవలందించిన ఘన చరిత్ర ఈ బృందం సొంతం. జిల్లాలో రెడ్‌క్రాస్‌కి గుర్తింపు తెచ్చిన సేవామూర్తులు. వీరి సారథ్యంలో ఎన్నో ప్రజోపయోగ సేవలు. విడిఓస్ కాలనీలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆఫీసు ఏర్పాటు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎన్నో అవిశ్రాంతమైన సేవలు... అవగాహన కార్యక్రమాలు. అవసరమైన మందులు.. నిత్యావసరాలు అందించి ఈ బృందం మన్ననలు పొందిన వైనం. మున్నేరు ముంపుకు గురైన 23 గ్రామాల ప్రజలకు, ఖమ్మం నగరంలోని కాలనీ వాసులకు లక్షలాది రూపాయల విలువైన నిత్యావసర సరుకులు, వంట పాత్రలు, ఆహార పదార్థాలు, దుప్పట్లు పంపిణీ చేసిన ఘనత. మారుమూల గ్రామాలలో 122 పైగా ఉచిత వైద్య శిబిరాలు. ఉచిత మందుల పంపిణీ, రక్తదాన శిబిరాల నిర్వహణ, రక్తదానంతో ఎందరికో ప్రాణదానం. సిపిఆర్, ఫస్ట్ ఎయిడ్ చేసిన ఘన నేపథ్యం. మానవతా దృక్పథంతో టిబి రోగులకు వితరణ శీలత ఈ బృందంలోని అందరూ నిత్య ప్రజాక్షేత్రంలో ఉండేవారే... సేవ చేసేందుకు నిత్యం అందుబాటులో ఉండేవారే.. జిమ్, టివి, లైబ్రరీ, డాక్టర్స్ రూం, గేమ్స్ రూం వంటి వసతులతో ఒక డే కేర్ సెంటర్‌ను గౌరవ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారిచే ప్రారంభం చేయించిన ఘనత ఈ బృందానిదే. సీనియర్ సిటిజన్స్‌కి మధ్యాహ్నం భోజనం ఇవ్వడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో గొప్ప గుర్తింపు పొందింది డా॥ వెలిగేటి చంద్రమోహన్ గారి బృందం. గుర్తుంచుకోండి మన జిల్లా రెడ్‌క్రాస్‌ను రాష్ట్రంలో అగ్రగామిగా నిలపగల సత్తా, సాధికారత, దీక్షాదక్షతలు పుష్కలంగా ఉన్న ఈ టీమ్‌ను గెలిపించడం మన బాధ్యత, మన కర్తవ్యం. అందుకే డా॥ వెలిగేటి చంద్రమోహన్‌గారి బృందాన్ని అఖండ మెజార్టీతో గెలిపిద్దాం.. నిజమైన నిత్య సమాజ సేవకులకు పట్టం కడదాం..

డా॥ వెలిగేటి చంద్రమోహన్ గారి ప్యానెల్ అభ్యర్థులు

బ్యాలెట్ నెం. 1 అత్తలూరి గోవర్ధన్ రావు
బ్యాలెట్ నెం. 5 గజేంద్రుల నాగేశ్వరరావు
బ్యాలెట్ నెం. 10 కాలవ శ్రీనివాస్ నందన్
బ్యాలెట్ నెం. 16 కొత్త సత్యనారాయణ రెడ్డి
బ్యాలెట్ నెం. 18 కె. లింగమూర్తి
బ్యాలెట్ నెం. 21 మూలగుండ్ల శ్రీహరి
బ్యాలెట్ నెం. 23 కేదాసు నర్సయ్య
బ్యాలెట్ నెం. 25 టి. రాఘవయ్య
బ్యాలెట్ నెం. 26 రామడుగు రవీందర్‌రావు
బ్యాలెట్ నెం. 28 సాధినేని జనార్ధన్ రావు
బ్యాలెట్ నెం. 29 సాధినేని వెంకటేశ్వరావు
బ్యాలెట్ నెం. 32 పి. సుధాకర్
బ్యాలెట్ నెం. 33 జి. సూర్యప్రకాశ్‌రావు
బ్యాలెట్ నెం. 37 జల్లా వెంకటేశ్వర్లు

నిలువెత్తు సేవా భావనే స్ఫూర్తిగా సాగుతున్న మన బృందాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం.! పట్టం కడదాం.!!
SERVICE MOTTO ONLY
గమనిక: ఓటు వేసేటప్పుడు ఆధార్ కార్డు వెంట తప్పనిసరిగా తీసుకొని రావలెను.

పోలింగ్ తేది: 04-10-2026, ఆదివారం, ఉ॥ 8 గం॥ల నుండి మం॥ 3 గం॥ల వరకు
వేదిక: TTDC భవనం, వైరా రోడ్, ఖమ్మం

ఇట్లు: మిత్రులు, శ్రేయోభిలాషులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ & డా॥ చంద్రమోహన్ మిత్ర బృందం

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com